ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
17-10-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 258 పేజీలు: 10+4 వెల: 6.50

కరవుపై ముందస్తు చర్యల్లో ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్: కవిత 3
41 బార్లకు ఏకంగా 8770 దరఖాస్తులు 6



## డీలిమిటేషన్‌పై అఖిలపక్షం జరపండి

5లో

ప్రధాని మోడీకి కాంగ్రెస్ చీఫ్ ఖర్గే లేఖ
పార్లమెంట్ ప్రోరోగ్ జాప్యంపై అసహనం



## నెలాఖరున పార్లమెంటు ప్రత్యేక భేటీ!

3లో

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులే లక్ష్యం



## ఎల్‌కె అద్వానీకి అస్వస్థత

2లో

ఆసుపత్రిలో చేరిన బిజెపి అగ్రనేత

# తిరంగా మార్చ్ ఉద్రిక్తం

## ఢిల్లీలో మళ్లీ టెన్షన్ టెన్షన్



శుక్రవారం ఢిల్లీలో తిరంగా మార్చ్ జరుపుతున్న సిజెపి ఆందోళనకారులు

### ఎక్కడికక్కడ సిజెపి నేతలను నిర్బంధంలోకి తీసుకున్న పోలీసులు

### అభిజిత్ దీప్కే, నేహా బోరా ముందుగానే అదుపులోకి

### అక్రమ అరెస్టులపై రాజకీయపార్టీల తీవ్ర నిరసన



**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** కాక్రోచ్ జనతాపార్టీ నిర్వహించ తలపెట్టిన లెహ్రాదో తిరంగా ర్యాలీ మరోసారి సెంట్రల్‌పార్క్ వద్ద ఉద్రిక్తపరిస్థితులకు దారితీ సింది. ర్యాలీకి అనుమతిలేదని, జాతీయ పతాకం ఆవిష్కరించేందుకు రాజ్యాంగబద్ధమైన నిబంధనలున్నాయని, అయినా ర్యాలీ నిర్వహిస్తామని అనుమతులు కోరుతూ తమను ఎవ్వరూ సంప్రదించలేదని, తమకు ఎలాంటి ముందస్తు అనుమతి లేఖలులేవని పోలీసులు స్పష్టం చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. సిజెపి నేతలు అభిజీత్ దీప్కే ర్యాలీకి బయలుదేరుతుండగానే ఇంటి

>>2

# ఇక 'హ్యుందయ్' కార్ల తయారీ

హైదరాబాద్‌లో ప్లాంట్ ఏర్పాటుకు సంస్థ యాజమాన్యం సిద్ధం

జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో గ్లోబల్ ఆర్ అండ్ డి కేంద్రం

పెండింగ్ అనుమతులు త్వరగా ఇవ్వాలని అధికారులకు సిఎం రేవంత్ ఆదేశం

త్వరలోనే భూమి పూజకు హ్యుందయ్ రెడీ



శుక్రవారం హైదరాబాద్‌లో హ్యుందయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ప్రతినిధి బృందం సిఎం రేవంత్ రెడ్డితో భేటీ దృశ్యం

**ప్రభాతవార్త ప్రధానప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు16:** తెలంగాణను కార్ల తయారీకి అనువైన ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హ్యుందయ్ గ్లోబల్ ఆర్ అండ్ డి కేంద్రానికి సంబంధించిన పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలోని బోధి పెవిలియన్‌లో హ్యుందయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ (హెచ్‌ఎంఐఇ) మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యాన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, జహీరాబాద్‌లో ప్రతిపాదిత ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్)లో రూ.8,528 కోట్ల పెట్టుబడితో హ్యుందయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ ఆర్ అండ్ డి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. 678 ఎకరాల్లో విడతలవారీగా అభివృద్ధి చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు పురోగతిని హ్యుందయ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు.

రాబోయే కొద్ది నెలల్లోనే ఆర్ అండ్ డీ కేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన సిఎం రేవంత్ రెడ్డి... అవసరమైన అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హ్యుందయ్ సంస్థకు హైదరాబాద్‌తో రెండు దశాబ్దాల అనుబంధం ఉంది. హైటెక్ సిటీలోని కేంద్రం అధునాతన వాహన ఇంజినీరింగ్‌కు మద్దతునిస్తూ కీలక ఆర్ అండ్ డి

>>2

# బొగ్గు కుంభకోణాలపై న్యాయ విచారణ జరపాలి



### పరిస్థితి చేయిదాటాక విద్యుత్ కొంటామంటూ నాటకాలు

### ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ పెంచిన కరవు: కెటిఆర్

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** సింగరేణిలో కుంభకోణాలు జరుగుతున్నాయని తాము చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. సింగరేణి కుంభకోణాలు, ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోళ్ల వ్యవహారంపై దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి హయాంలో జరిగినట్లు తాము ఆరోపిస్తున్న అక్రమాలపైనా న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన నర్సంపేట నియోజకవర్గ సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ సింగరేణి,విద్యుత్, సాగునీటి సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలనుఎండగట్టారు. తాను ఉత్తరం రాస్తే విచారణకు ఆదేశిస్తానని ముఖ్యమంత్రి చెప్పడం కాదని వాస్తవంగా విచారణ జరిపించాలని స్పష్టం చేశారు.

సింగరేణిలో తన బామ్మర్ది ప్రమేయంతో జరిగిందని తాము ఆరోపిస్తున్న రూ.10 వేల కోట్ల కుంభకోణంపైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో జరిగినట్లు తాము ఆరోపిస్తున్న సోలార్‌పవర్ కుంభకోణాన్ని కూడా బయటపెడతామని పేర్కొన్నారు. గతంలో 70 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన సింగరేణిని బలహీనపరిచి, ఇప్పుడు ఆ సంస్థను పక్కనపెట్టి విదేశీ బొగ్గు కొనుగోళ్లకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని కెటిఆర్ ఆరోపించారు. ఒక

>>2

## ఎల్‌నినో పర్యవేక్షణకు ఐఎఎస్‌లు

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** ప్రపంచ దేశాలను వణికిస్తున్న సూపర్ ఎల్‌నినో సమయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఉన్నతాధికారులను ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల్లో పరిస్థితులను సమీక్షించడానికి ప్రత్యేక అధికారులుగా ఐఎఎస్‌లను నియమించింది. ఈనేపథ్యంలో వీరు రాష్ట్రంలో తాగు నీరు, సాగునీరు,వర్షపాతం, విద్యుత్ సరఫరా, వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ.. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారు.

**ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు**



ఉమ్మడి హైదరాబాద్ జిల్లా: జయేష్ రంజన్
ఉమ్మడి రంగారెడ్డి జిల్లా : వికాస్ రాజ్
ఉమ్మడి కరీంనగర్ జిల్లా : బెనహర్ మహేష్ దత్తా ఎక్కా
ఉమ్మడి మెదక్ జిల్లా : ఎ. వాణి ప్రసాద్
ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: యోగితా రాణా
ఉమ్మడి నల్గొండ జిల్లా : హరిచందన దాసరి
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా : ఇలాంబర్తి కె.
ఉమ్మడి వరంగల్ జిల్లా : ఎ. శ్రీదేవిసేన
ఉమ్మడి మహబూబ్నగర్ : వి.పి. గౌతమ్
ఉమ్మడి ఖమ్మం జిల్లా : అనుదీప్ దురిశెట్టి

# సమష్టిగా ఎదుర్కొందాం

- కేంద్రం 'ఎల్‌నినో సాయం' అందించాలి
- రూ. 30 వేల కోట్ల ప్రతిపాదనలు కేంద్రానికి..
- రాష్ట్రానికి సవాలుగా నీరు, విద్యుత్ కొరత
- నీటి లభ్యతను బట్టే పంటలు వేయాలి: పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 16,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలు మరోసారి తీవ్రమైన ప్రకృతి సవాలును ఎదుర్కొనడానికి సమాయత్తం కావాలని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న వర్షాభావ పరిస్థితులపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ లేఖరాసి శుక్రవారం విడుదల చేశారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతంలో తీవ్రలోటు, జలాశయాల్లో తగ్గుతున్న నీటి నిల్వలు, భూగర్భజలాలపై పెరుగుతున్న ఒత్తిడి, వ్యవసాయానికి నీటి కొరత, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ ఇవన్నీ కలిపి రాబోయే నెలల్లో రాష్ట్రానికి తీవ్రమైన సవాల్‌గా మారే పరిస్థితి కనిపిస్తోందనీ హెచ్చరించారు.ఇది కేవలం వర్షాలు తక్కువ పడిన సమస్య కాదు. ఇది రైతు సమస్య. ఇది తాగునీటి సమస్య. ఇది వ్యవసాయ సమస్య. ఇది విద్యుత్ సమస్య. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సమస్య. మొత్తంగా ఇది తెలంగాణ ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన సమస్య అందుకే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లి వాస్తవ పరిస్థితిని వివరించాలనీ లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం జలాశయాలలో నీటి నిల్వలు 460 టిఎంసిలు ఉండాల్సి ఉండగా ఇప్పుడు 209 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. ఇది తీవ్రమైన కరవుకు నిదర్శనమనీ ఆయన లేఖలో వివరించారు. ఇప్పుడున్న నీటిని చాల జాగ్రత్తగా వినియోగించకపోతే వేసవి నాటికి పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉంది. హైదరాబాద్‌తో పాటు పట్టణ ప్రాంతాలకు కూడా ముప్పు పొంచి ఉందని,అందుకే ఇప్పటి నుంచే నీటి పొదుపు



చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు వరి, చెరుకు వంటి అధికనీరు వినియోగించే పంటలు వేయకుండా ఆరుతడిపంటలు వేసుకోవాలని హితవు చెప్పారు.

కాంగ్రెస్ నాయకులు ప్రతి గ్రామంలో రైతులతో సమావేశాలు నిర్వహించి నీటి లభ్యతను బట్టి పంట ఎంపిక.. ప్రత్యామ్నాయ పంటలు తక్కువ నీటితో సాగువాతావరణ ఆధారిత వ్యవసాయ పద్ధతులు విత్తనాల లభ్యత, పంట బీమా ప్రభుత్వ సహాయంవంటి అంశాలపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ప్రతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రతి ఎమ్మెల్యే, ఎంపి, నియోజకవర్గ ఇన్‌చార్జి, మండల అధ్యక్షుడు, గ్రామ స్థాయి నాయకుడు పది ప్రధాన అంశాలపై పరిశీలించి రైతుకు సలహా ఇవ్వాలని కోరారు. మండలాల వారీగా నీటి పరిస్థితిపై సమీక్షించాలనీ ఆయన తెలిపారు. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో నీటి నిల్వల పరిశీలన, తాగునీటి సమస్య వచ్చే గ్రామాలను ముందుగానే గుర్తింపు, రైతుల పంటలు, సాగునీటి అవసరాలపై వివరాలు సేకరణ,బోర్లపై ఆధారపడుతున్న ప్రాంతాలను గుర్తింపు రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ అధి

>>2



## పాల ధర పెంచిన విజయ డెయిరీ

2లో

- లీటరుకు రూ.2 పెంపు
- నేటి నుండి అమలు



## ఎపిలో పురపోరు హింసాత్మకం

రాయలసీమలోని పలు ప్రాంతాలలో ఉద్రిక్తత

పుంగనూరులో ఎంపి మిథున్‌రెడ్డి వాహనంపై దాడి

7లో

# 3 నెలల్లో రోహిత్ వేముల బిల్లు ముసాయిదా

### విద్యార్థుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యం: డి.సిఎం భట్టి



**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల హక్కులను పరిరక్షిస్తూ, కులం, సామాజిక నేపథ్యం ఆధారంగా వివక్షకు తావులేకుండా సమగ్ర చట్టాన్ని రూపొందించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. సచివాలయంలో శుక్రవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కూడిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో రోహిత్ వేముల తెలంగాణ బిల్లు రూపకల్పన విధానం, కమిటీ కూర్పు, న్యాయపరమైన అంశాలు, సంప్రదింపుల ప్రక్రియపై ఇందులో చర్చించారు.

>>2



# 'తుంగ' బెంగ!

*తెలుగు రాష్ట్రాల్లో కొరవడిన సఖ్యత వల్ల తుంగభద్ర జలాశయం నుంచి నీటి వాటా పొందడంలో తెలుగువారు నష్టపోతుంటే కర్ణాటక లబ్ధి పొందుతోంది. తుంగ భద్ర ఆయకట్టు రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వారం రోజులు కావొస్తున్నా ఇప్పటికీ నీరు వదలలేదు. పంటలకు నీటి తడి అందించడానికి మరో వారం రోజులే సమయం ఉంది.*

**హైదారాబాద్,అక్టోబరు 16,ప్రభాతవార్త:** జూరాలకు నీటిని మొన్న కర్ణాటక అభయస్తం ఇచ్చి ఆచరించలేదు. నేడు తుంగభద్ర నుంచి వారసత్వంగా వచ్చే నీటిహక్కును కూడా కాలరాస్తు తెలుగు రైతులను కడగండ్లకు గురిచేస్తోన్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలో కొరవడిన సఖ్యత తుంగభద్ర జలాశయం నుంచి నీటి వాటా పొందే విషయంలో తెలుగువారు నష్టపోతుంటే కర్ణాటక లబ్ధి పొందుతోంది. తుంగభద్ర ఆయకట్టు రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో నదిలోఉండే చిన్న చిన్న మడుగుల్లో సైతం నీరు ఆవిరైంది. నది మొత్తం ఎడారిని తలపిస్తోంది. దీనిపై ఆధారపడి రైతులు తీరం వెంట పత్తి, వరి, మిరప సాగు చేశారు. వీటికి తడులు లేక ఎండిపోతున్న పరిస్థితి ఉంది. వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. 5దశాబ్దాలుగా నదిలో ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ చూడలే దని రైతులు చెబుతున్నారు. నీరుతగ్గినా మడు

>>2

నీటి విడుదలపై కర్ణాటక మొండి చేయి

ఎండుతున్న పంటలతో తెలంగాణ రైతుకు తీవ్ర నష్టం

పరిశ్రమలకు నీళ్లు వదులుతూ పంటలపై చిన్నచూపు

మూడు టిఎంసిల ఇండెంటుకు ఇంకా దొరకని మోక్షం



శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిలో దుర్గమ్మకు పట్టువస్త్రాలు తీసుకు వెళుతున్న ఎపి సిఎం చంద్రబాబు దంపతులు

# ఇక 'హ్యుందయ్' కార్ల తయారీ

>> కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సామర్థ్యాలను మరింత విస్తరించేలా జహీరాబాద్‌లో గ్లోబల్ ఆర్అండ్‌డి, మెగా టెస్టింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రం ద్వారా వాహనాల రూపకల్పన, పరీక్షలు, పనితీరు, ధ్రువీకరణ, నాణ్యతా ప్రమాణాల పరిశీలనతోపాటు ఇంజినీరింగ్ ప్రక్రియలను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం కలగనుంది. హ్యుందయ్ అధునాతన సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది.దేశంలో తెలంగాణ భౌగోళికంగా మధ్యలో ఉందని, హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కలిగిన నగరమని ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలోని ఆరు ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలతో పోలిస్తే హైదరాబాద్ సురక్షితమైన, జీవించడానికి అనుకూలమైన కాస్మోపాలిటన్ నగరంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. కార్ల తయారీ పరిశ్రమకు అవసరమైన రవాణా, మౌలిక సదుపాయాలు తెలంగాణలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. రహదారులు, రైలు మార్గాలు, విమానాశ్రయాలతోపాటు భవిష్యత్తులో ఓడరేవులకు హైస్పీడ్ కనెక్టివిటీ కల్పించే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు.ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్ల అభివృద్ధితో వాహన తయారీ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. పెరి అర్బన్ రీజియన్ (ఫ్యూర్) వంటి ప్రణాళికల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, తయారీ రంగంలో పెట్టుబడులకు తెలంగాణ అనువైన వేదికగా నిలుస్తుందని సిఎం వివరించారు.తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 2024 ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ ప్రతినిధులతో చర్చలు జరిపింది. అనంతరం 2025 జూన్‌లో హ్యుందయ్ ఆర్ అండ్ డి కేంద్రం ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి వర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారీ శాటిలైట్ నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సిఎం హ్యుందయ్ ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలియజేస్తూ, రాబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని సంస్థ యాజమాన్యాన్ని ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను అంతర్జాతీయ సాంకేతిక, అధునాతన ఇంజినీరింగ్ కేంద్రంగా మరింత బలోపేతం చేయాలన్న హ్యుందయ్ లక్ష్యం తెలంగాణ రైజింగ్-2047 విజన్‌కు అనుగుణంగా ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యాన్ చో తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో తమ సంస్థ భాగస్వామిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్ ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



శుక్రవారం తిరుమలలో ఘనంగా నిర్వహించిన గరుడ సేవ దృశ్యం

# బిల్లు ముసాయిదా

>> ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ ప్రతిపాదిత వేముల తెలంగాణ బిల్లుకు సంబంధించిన ప్రాథమిక ముసాయిదాను మూడు నెలల్లోగా సిద్ధం చేసి సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీకి సమర్పించాలన్నారు. ఎలాంటి జాప్యానికి తావులేకుండా నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని చెప్పారు. విద్యార్థుల హక్కులకు సమర్థవంతమైన రక్షణ కల్పించేలా చట్టాన్ని రూపొందించేందుకు స్పష్టమైన కార్యాచరణ అమలు చేయాలని పేర్కొన్నారు. చట్ట రూపకల్పన ప్రక్రియకు సాంఘిక సంక్షేమ శాఖ నాయకత్వం వహించాలని, న్యాయశాఖతో పాటు, విద్య, హోంశాఖ, యుజిసి తదితర సంస్థలను కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. కమిటీని వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి, ముసాయిదా తయారీకి అవసరమైన కార్యాచరణను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు, న్యాయనిపుణులు, పౌర సమాజ సంస్థలు, విద్యా రంగ నిపుణులు, ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షకు సంబంధించిన అంశాలు, చట్ట అమలులో ఎదురయ్యే సవాళ్లను పరిగణనలోకి తీసుకొని ముసాయిదా సిద్ధం చేయాలని చెప్పారు. ప్రభుత్వ అధికారులతోపాటు నిపుణుల సంస్థల ప్రతినిధుల సూచనలనుకూడా పరిగణనలోకి తీసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. బిల్లుకు అవసరమైన న్యాయపరమైన, సాంకేతిక అంశాల్లో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సహకారం తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం, వివక్షను నిరోధించడం, విద్యాసంస్థల్లో న్యాయబద్ధమైన వాతావరణాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రతిపాదిత చట్టంలో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిర్ణీత గడువులో కసరత్తు పూర్తయ్యేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు ఉపయోగపడే సమగ్ర చట్టం రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరి సవ్యసాచి ఘోష్, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి తదితరులు పాల్గొన్నారు.

# సమష్టిగా ఎదుర్కొందాం

>> కారులతో కలిసి అవగాహన కల్పించుట, నీటి పొదుపుపై గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించుట, తాగునీటిని వృథా చేయకుండా ప్రజలను అప్రమత్తం చేయుట, సమస్యలను ప్రభుత్వ దృష్టికి వెంటనే తీసుకురావడం, సోషల్ మీడియాలో భయపెట్టే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకుని, వాస్తవ గణాంకాలను ప్రజలకు వివరించుట అనే ప్రధాన కర్తవ్యం నిర్వహించాలని కోరారు. .కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అండగా నిలవాలి తెలంగాణ ఇప్పటికే కరువు పరిస్థితులపై కేంద్ర సహాయం కోరిందనీ ప్రజలకు లేఖలోతెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 30,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయం కోరుతూ కేంద్రాన్ని అడగాలని ప్రతిపాదన చేస్తోంని తెలిపారు. ప్రకృతి వైపరీత్యం విషయంలో కేంద్రం-రాష్ట్రం కలిసి పనిచేయాలి.రాష్ట్రంలో ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో రాజకీయ పార్టీలు అన్ని బాధ్యత యుతంగా ప్రజలను ఆదుకునేందుకు కలిసికట్టుగా కృషి చేయాలి.ప్రజలకు తాగునీరు అందాలి. పశువులకు నీరు,మేత అందాలి.పంటలు కాపాడాలి.గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిలబడాలి. హైదరాబాద్ సహా అన్ని పట్టణాలకు తాగునీరు అందాలి.ఇదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం.అయితే ప్రజలకు వాస్తవ పరిస్థితిని దాచిపెట్టడం కూడా సరికాదు. సమస్యను గుర్తించడం బలహీనత కాదు. సమస్యను ముందుగానే గుర్తించి పరిష్కరించడానికి సిద్ధపడటం నాయకత్వ లక్షణం.తెలంగాణ ప్రజలకు నా విజ్ఞప్తిప్రతి కుటుంబం నీటిని పొదుపు చేయాలి.

అవసరానికి మించి నీటిని వినియోగించకండి. వర్షపు నీటిని సాధ్యమైనంత వరకు భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోండి. రైతులు నీటి లభ్యతను బట్టి పంటలను ఎంచుకోండి. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోండి.ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రమైనదైనా, శాస్త్రీయ ప్రణాళిక, ప్రజల సహకారం, ప్రభుత్వ సమర్థవంతమైన చర్యలు, కాంగ్రెస్ శ్రేణుల చైతన్యం ఉంటే తెలంగాణ ఈ సవాలును సమర్థవంతంగా ఎదుర్కోగలదు. ప్రజలను భయపెట్టడం కాదు ప్రజలను చైతన్యపరచడం మన బాధ్యత. రైతును కాపాడటం మన కర్తవ్యం. తెలంగాణ నీటి భద్రత కోసం ఇప్పటి నుంచే కలిసి పనిచేద్దాం అని గౌడ్ తనలేఖలో పేర్కొన్నారు.

# న్యాయ విచారణ జరపాలి

>> ప్పుడు తెలంగాణలో 24 గంటల విద్యుత్ సరఫరాకు అండగా నిలిచిన సింగరేణినే ఇప్పుడు రేవంత్ రెడ్డి బదనాం చేస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో టన్ను బొగ్గు సుమారు రూ.3,800కు లభిస్తుంటే విదేశాల నుంచి కొనుగోలు చేస్తే టన్నుకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చవుతుందని కెటిఆర్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా నుంచి బొగ్గు కొనుగోళ్ల పేరుతో కమీషన్లు పొందేందుకే ఈ వ్యవహారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. దేశీయంగా సింగరేణిలో బొగ్గు అందుబాటులో ఉన్న దాన్ని ఉపయోగించుకోకుండా కేవలం కమిషన్ల కోసం మాత్రమే విదేశీ బొగ్గు కోసం ప్రయత్నం చేస్తున్నారన్నారు. సంక్షోభాన్ని ముందుగా సృష్టించి, పరిస్థితి చేయి దాటిన తర్వాత బొగ్గు తెస్తామని, విద్యుత్ కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారని విమర్శించారు.రేవంత్ రెడ్డిని 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా అభివర్ణించిన కెటిఆర్.. కాంగ్రెస్ అధిష్ఠానానికి రాజకీయ ఇఎంఐలు కట్టకపోతే ముఖ్యమంత్రి పదవి పోతుందనే భయంతోనే విదేశీ బొగ్గు కొనుగోళ్ల వ్యవహారంలో కమీషన్లు సమకూర్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు చెల్లించాల్సిన ఇఎంఐలను వసూలు చేసేందుకే ఎఐసిసి ప్రధాన కార్యదర్శి రాష్ట్రంలో ఉన్నారని, రికవరీ ఏజెంట్‌లా వ్యవహరిస్తూ కమీషన్లు చెల్లించకపోతే రేవంత్ రెడ్డి పదవిని తొలగించే పరిస్థితి ఉంటుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు సొమ్ములు పంపకపోతే ముఖ్యమంత్రి పదవి రెన్యువల్ కాదనే భయంతోనే ఈ వ్యవహారాలు జరుగుతున్నాయని విమర్శించారు,సింగరేణి భుజంపై తుపాకీ పెట్టి టెండర్లు, కమీషన్ల లెక్కలు వేసుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిని తగ్గించడం వల్లే నేడు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వద్ద బొగ్గు కొరత ఏర్పడిందన్నారు. సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలను పెండింగ్‌లో పెట్టి, బొగ్గు సరఫరా చేయడం లేదంటూ సంస్థను బదనాం చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను దెబ్బతీసిన తర్వాత ఇప్పుడు విద్యుత్ కొనుగోలు చేయాలంటే కరెంట్ అందుబాటులో లేదంటూ అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. ఒకప్పుడు 24 గంటల పాటు విద్యుత్ అందించిన తెలంగాణలో ఇప్పుడు కరెంట్ ఎందుకు లేదని కెటిఆర్ ప్రశ్నించారు. గతంలో ఛత్తీస్‌గఢ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకున్నప్పుడు, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాన్ని కూడా కుంభకోణంగా చిత్రీకరించారని గుర్తుచేశారు. అప్పట్లో యూనిట్‌విద్యుత్‌ను రూ.3.90కు కొనుగోలు చేస్తే కుంభకోణమని ఆరోపించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు యూనిట్‌కు రూ.15 చెల్లించి విద్యుత్ కొనుగోలు చేయాలని చూస్తోందని విమర్శించారు. గత విద్యుత్ కొనుగోళ్లపై కుంభకోణం పేరుతో కమిషన్ ఏర్పాటు చేసి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. ఎల్‌నీనో ప్రభావం దేశవ్యాప్తంగా ఉందని, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ అక్కడి ప్రభుత్వాలు నీటి నిర్వహణలో చర్యలు తీసుకుంటున్నాయని కెటిఆర్ పేర్కొన్నారు. ఎపిలో ముఖ్యమంత్రి జల పండగ చేసుకుంటుంటే తెలంగాణలో మాత్రం కరువు పరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయని ప్రశ్నించారు. ఎపిలో సుమారు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు నీటిని తీసుకెళ్లారని, పట్టిసీమ పంపులద్వారా సుమారు 400 టిఎంసిల నీటిని ఎత్తిపోస్తున్నారని తెలిపారు. పోతిరెడ్డిపాడు నుంచి మొదలుకొని వివిధ ప్రాజెక్టుల్లో నీటిని నింపుకున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వందల కిలోమీటర్ల దూరానికి నీటిని తీసుకెళ్తుంటే, తెలంగాణలో కేవలం 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహబూబ్‌నగర్‌కు కూడా నీటిని తీసుకెళ్లలేకపోతున్నారని రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు.కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల ద్వారా తెలంగాణ దేశానికి అన్నపూర్ణగా నిలిచే పరిస్థితి ఉండేదని, కానీ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం కరువు దిశగా వెళ్తోందని అన్నారు. తెలంగాణ నుంచి పారే నీళ్లతో ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టులు నిండుతుంటే, తెలంగాణలో మాత్రం క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి రావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. 'ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు' అని కెటిఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయాలను పక్కనపెట్టి రైతుల సమస్యలపై స్పందించాలని, సాగునీరు, తాగునీరు, విద్యుత్ కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకోవాలని రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పాల ధర పెంచిన విజయ డెయిరీ

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** తెలంగాణ విజయ డెయిరీ పాల ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. స్టాండరైజ్డ్ పాలు, హోల్ మిల్క్ ధరలను లీటరుకు రూ.2 పెంచింది. ఈ సవరించిన ధరలు శుక్రవారం అర్ధరాత్రి నుండి అమల్లోకి వచ్చాయని డెయిరీ డెవలప్‌మెంట్ కోపరేటివ్ ఫెడరేషన్ వెల్లడించింది. సవరించిన ధరల ప్రకారం 500 మిల్లీలీటర్ల స్టాండరైజ్డ్ పాల ప్యాకెట్ ధర రూ.34 నుండి రూ.35కు పెరిగింది. అలాగే 500 మిల్లీలీటర్ల హోల్ మిల్క్ ప్యాకెట్ ధర పెంచిన నేపథ్యంలో రూ.39 నుండి రూ.40కి చేరింది. ఈ ధరల సవరణ వినియోగదారులకు, పాల విక్రేతలకు, పంపిణీదారులకు, సంస్థలకు, రిటైల్ అవుట్‌లెట్‌కు, ఈ కామర్స్ కంపెనీలకు వర్తిస్తుందని స్పష్టం చేసింది.

కాగా తెలంగాణలో గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఆవులు, గేదెల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టడంతో పాటు విజయ డెయిరీకి వచ్చే పాల సేకరణలో కూడా హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయి. ఐసిఎంఆర్ సిఫార్సుల ప్రకారం రోజువారీ వినియోగం పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో ఉత్పత్తిని మించి డిమాండ్ ఉండటంతో పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. తెలంగాణ పాల దిగుమతులపై ఆధారపడుతోంది. ప్రస్తుతం తెలంగాణలో రోజుకి సుమారు 26 లక్షల లీటర్ల పాలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి.

రాష్ట్రంలో ఉత్పత్తవుతున్నపాలు కేవలం 4లక్షలలీటర్ల వరకు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. ఇది రాష్ట్ర అవసరాలను తీర్చేందుకు సరిపడే స్థాయిలో లేదు.

పాడిపశువుల సంఖ్య తగ్గడం వల్ల పాల ఉత్పత్తిలో గణనీయమైన కోత వచ్చింది. ఇప్పటికే పాడిరైతులు పోసే పాలు రోజుకి కేవలం 50 వేల లీటర్ల వరకు తగ్గిపోవడం ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోంది. ఈ నేపథ్యంలో విజయ డెయిరీ పాల ధరలను పెంచడం గమనార్హం.

## ఎల్‌నినో ప్రభావంలోనూ
# మిగులులో వరి!
## వ్యవసాయ వర్సిటీలో రియల్‌టైమ్ వరి డాష్ బోర్డు

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త :** ఎల్ నినో సంవత్సరంలో కూడా తెలంగాణ వరి మిగులు రాష్ట్రంగా కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు, అయితే ఆ మిగులు ఎంత ఉండాలనేది రాబోయే సాగు నీటి కాలంలో నీటిలభ్యతపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ప్రమాదాలను ఎత్తి చూపుతూ, 2026-27 సంవత్సరంలో జలాశయాల మట్టాలు, సాగునీటి విడుదలలు, వరి ఉత్పత్తిపై వాటి ప్రభావాన్ని నిశితంగా పర్యవేక్షించడానికి తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒక రియల్‌టైమ్ వరినీటి డాష్‌బోర్డ్‌ను సిఫార్సు చేసింది. విశ్వవిద్యాలయ అంచనాల ప్రకారం తక్కువ నీటి లభ్యత ఉన్న పరిస్థితుల్లో రాష్ట్రంలోని ఖరీఫ్, రబీ సీజన్ల నుండి వచ్చే మొత్తం వరి ఉత్పత్తి 198 లక్షల టన్నులుగా, ప్రాథమిక పరిస్థితుల్లో 209 లక్షల టన్నులుగాను, నీటిలభ్యత మెరుగుపడితే 219 లక్షల టన్నులుగా ఉంటుందని అంచనా వేసింది. ఇక మిల్లింగ్ రికవరీ రేటు చూస్తే 67 శాతంగా పరిగణిస్తే, దీని ప్రకారం మిల్లు బియ్యం ఉత్పత్తి వరుసగా 133 లక్షల టన్నులు, 140 లక్షల టన్నులు, 147 లక్షల టన్నులుగా ఉంటుందని లెక్కకట్టింది. 2014-15లో వర్షపాతం 25 శాతం తగ్గడం, వరి పంట సాగు విస్తీర్ణం 29 శాతం తగ్గడం వల్ల ధాన్యం ఉత్పత్తి 98.72 లక్షల టన్నులనుండి 68.18 లక్షల టన్నులకు అంటే 31శాతంమేర పడిపోయింది. ప్రస్తుత ఖరీఫ్ సీజనుకు సంబంధించి వరి ఉత్పత్తి తక్కువ నీటి లభ్యతను ఆధారంగా చేసుకుంటే 107 లక్షల టన్నులు, ప్రాథమికంగా 111 లక్షల టన్నులు, మెరుగైన నీటి లభ్యత కింద 113 లక్షల టన్నులుగా అంచనా వేయబడింది. ఈ అంచనాలు గత ఏడాది 27.01 లక్షల హెక్టార్లతో పోలిస్తే 16.25 శాతం తగ్గి 22.62 లక్షల హెక్టార్ల వరి సాగు విస్తీర్ణంపై ఆధారపడి ఉన్నాయని పేర్కొంది. అలాగే దిగుబడులు గత సీజన్ కంటే సుమారు 2 శాతం తక్కువగా ఉంటాయని అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఇక యాసంగి పంట విషయానికి వస్తే ఈ సీజన్‌లోనే ఎక్కువ అనిశ్చితి నెలకొని ఉంది. తక్కువ నీటి లభ్యత ఉన్నప్పుడు వరి ఉత్పత్తి 91 లక్షల టన్నులుగా, ప్రాథమిక అంచనా ప్రకారం 98 లక్షల టన్నులుగా, నీటిపారుదల పరిస్థితులు మెరుగుపడితే 106 లక్షల టన్నులుగా అంచనా వేసింది. దీనికి అనుగుణంగా సాగు విస్తీర్ణ అంచనాలు వరుసగా 18 లక్షల హెకార్టు, 19 లక్షల హెక్టార్లు, 20 లక్షల హెక్టార్లుగా ఉన్నాయి. కాగా తెలంగాణకు వినియోగం, ప్రజా పంపిణీ, విత్తన అవసరాల కోసం యేటా సుమారు 100 లక్షల టన్నుల బియ్యం అవసరం కాబట్టి ప్రతికూల పరిస్థితుల్లో కూడా రాష్ట్రం మిగులును కొనసాగించే అవకాశం స్పష్టంగా ఉందని భావిస్తోంది. అయితే నీటి లభ్యత బలహీనపడితే ఈ మిగులు గణనీయంగా తగ్గే అవకాశం ఉన్నట్లు రియల్‌టైమ్ వరి డాష్‌బోర్డు లెక్కలు చెబుతున్నాయి. కాగా యాసంగి పంటకు అక్టోబర్, మార్చి కాలం కీలకమైనదని ఈ అంచనా గుర్తించింది. జలాశయ నిల్వలస్థాయిలు, కృష్ణా బేసిన్ నీటి కేటాయింపులు, భూగర్భ జలాల పునరుత్పత్తి, సాగునీటి విడుదలలు సాగు విస్తీర్ణం మరియు దిగుబడులు రెండింటినీ నిర్ధారిస్తాయని భావిస్తున్నారు. కాగా ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలోని పంటల సాగుపై ప్రభుత్వ ప్రణాళికకు సహాయపడటానికి, విశ్వవిద్యాలయం ఖరీఫ్, యాసంగి సీజన్‌లు రెండింటినీ కవర్ చేస్తూ 2026-27 కోసం ఒక తెలంగాణ వరి నీటి డాష్‌బోర్డ్‌ను ప్రతిపాదించింది. ఈ ప్లాట్‌ఫారమ్ రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం, జలాశయాల నిల్వ, భూగర్భ జలమట్టాలు, సాగునీటి విడుదలలు, సేకరణ మరియు మార్కెట్ ధరలపై వారపు డేటాను ఏకీకృతం చేస్తుంది. ఇది నీటిలభ్యత వరి ఉత్పత్తిని ఎలా ప్రభావితం చేస్తోందనే దానిపై విధాన నిర్ణేతలకు వాస్తవసమయ చిత్రాన్ని అందిస్తుంది.

# 'తుంగ' బెంగ!

>> గుల్లో ఉండేదని, దాంతో పంటలు కాపాడుకునేవారు. ఈ యేడాది జలాశయంలో మన వాటా 3 టిఎంసిల రావాల్సి ఉంది. ఆనీటిని 15 రోజుల్లో విడుదల చేయాలని మన అధికారులు అధికారికంగా ఇండెంట్ నోట్ కూడా అందించారు. వారం రోజులు కావోస్తున్నా ఇప్పటికి నీరు వదలేదు. పంటలకు నీటి తడి అందించడానికి మరో వారం రోజుల సమయం ఉంది. దీంతో జలాశయం నుంచి చివరి మూడు రోజుల పాటు విడుదలైన నీరు దిగువకు వచ్చే పరిస్థితి ఉండదు. తెలంగాణ వాటా విడుదల సమయంలో కర్ణాటక కూడా కొంత నీటిని నదిలోకి విడుదల చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో జలాశయం నుంచి నీటి విడుదల జరిగిన సమయంలో అవిభక్త ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక పరిధిలోని కాలువలు, ఎత్తిపోతల పథకాల కోసం కొంత నీటిని విడుదల చేసేవారు. ప్రస్తుతం భిన్నరీతిలో సాగుతోంది.జలాశయం నుంచి విడుదలైన నీరు 180 కి.మీ.లు దూరం పారితే గానీ తెలంగాణ రైతులకు అందుబాటులోకి రాదు. విడుదలవుతున్న నీటిలో 25 నుంచి 30 శాతం ఆయకట్టుకు చేరితే గొప్ప అన్నట్లుగా తయారైంది. నీరు త్వరగా చేరకపోవడానికి కర్ణాటక పరిధిలోని పవర్ ప్రాజెక్టుల వద్ద ఆనకట్టలు నిండిన తర్వాత దిగువకు విడుదల చేయడమే కారణం. నదీతీరం వెంట ఏర్పాటు చేసిన ఎత్తపోతలు పథకాల ద్వారా నీటి తోడివేత మరో ప్రధాన కారణంగా మారింది. ఆంధ్రప్రదేశ్ తెలంగాణల నీటి వాటా విడుదల చేస్తే చాలు నీటిని తోడేసుకొంటున్నారు. కళ్యాణ కర్ణాటకతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, కడప, అనంతపురం, తెలంగాణలోని మహబూబ్‌నగర్, గద్వాల తదితర జిల్లాల రైతుల జీవనాడి అయిన తుంగభద్ర జలాశయం పరిధిలోని రైతులు ఇప్పటికే వరి, మిర్చి తదితర పంటలను విస్తారంగా సాగుచేశారు. ఈ పంటలు చేతికి రావాలంటే కనీసం నవంబరు నెలాఖరు వరకు జలాశయం నుంచి నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఆగస్టు 11న జరిగిన నీటిపారుదల సలహా మండలి సమావేశంలో 90 రోజుల పాటు అంటే నవంబరు 11వరకు మాత్రమే నీరు ఇస్తామని నిర్ణయించారు.

ప్రస్తుత పరిస్థితుల్లో నవంబరు 11కెహెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి కాలువలకు నీటి సరఫరా నిలిపివేస్తే పంటలు ఎండిపోయి ఎకరానికి రూ.50వేల వరకు నష్టం వాటిల్లుందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో పంట చేతికొచ్చే దశలో నీరు ఆపితే కోలుకోలేని దెబ్బతగులుతుందని వాపోతున్నారు. నదిలో నీరు అందుతుందనే ఆశతో రైతులు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. కొందరు మిరప కోసం ఎకరాకు రూ.20వేలు కౌలు చెల్లించారు. వీరందరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తుంగభద్ర నదీ తీరం వెంట సాగుచేసిన పంటలకు రూ. కోట్లు పెట్టుబడులు పెట్టారు. కనీసం పెట్టుబడిలో 25 శాతం కూడా రాని పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో 56.73టిఎంసిల నీరు నిలువ ఉంది. పల్నాడు ప్రాంతంలో వర్షాలు తగ్గడంతో డ్యామ్‌కు వరద ప్రవాహం నిలిచిపోయింది. గత యేడాది క్రస్ట్‌గేట్ల మరమ్మతుల కారణంగా వేసిన పంటను కోల్పోయిన రైతులు, ఈసారైనా పంట దక్కుతుందని ఆశపడ్డారు. కానీ నీటి నిల్వలు తగ్గుతుండడంతో వారిలో మరింతర భయాన్ని నింపుతోంది. మరోవైపు కర్మాగారాలకు, పరిశ్రమలకు అక్రమంగా మితిమీరి నీటిని కేటాయిస్తున్నారని, జనరేటర్లు పెట్టి నీటిని తోడేస్తున్నారని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇలాంటి దుర్వినియోగాన్ని వెంటనే అరికట్టి పరిశ్రమలకు ఇచ్చే నీటిని నిలిపివేసి రైతుల పంటలకు మళ్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నవంబరు చివరి వరకు నీరు అందకపోతే 60వేల ఎకరాల్లో పంటలు దెబ్బతినడమే కాకుండా, మిర్చి కోల్డ్ స్టోరేజీలు, అనుబంధ రంగాలు కూడా తీవ్రనష్టాన్ని ఎదుర్కొంటాయని హెచ్చరిస్తున్నారు. బళ్లారి జిల్లాధికారి అధ్యక్షతన స్థానిక ప్రజా ప్రనిధులు, తుంగభద్ర బోర్డు ఇంజనీర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

## వారం - వర్జ్యం

17-10-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, చిత్త కార్తె,
తి. సప్తమి పూర్తి, న.మూల ఉ.9.47
వ.1.ఉ.7.59-ఉ.9.47
వ.2.రా.8.35-రా.10.23
దు. ఉ.6.00-ఉ.7.35
రాహు ఉ.9.00-ఉ.10.30
శుభ ఉ.10.00-ఉ.11.00

## వార్తాఫలం

**మేషం :** చెక్కులను అందుకుంటారు. ఆదర్శాలకు ప్రాముఖ్యతనిస్తారు. ఇష్టాగోష్టులు సాగిస్తారు.

**వృషభం :** ఆనందోత్సాహాలతో కాలాన్ని గడుపుతారు. పెండింగ్ బిల్స్ మంజూరవుతాయి. లౌక్యంగా వ్యవహరించి లాభపడతారు.

**మిథునం :** దీర్ఘాలోచనలు సాగిస్తారు. ఫోన్ సంభాషణలు ఎక్కువగా సాగిస్తారు. అనుకూలమైన బదిలీ లభిస్తుంది.

**కర్కాటకం :** కుటుంబపరమైన స్పర్ధలు చోటు చేసుకుంటాయి. వ్యాపారస్తులకు ఊరట కలిగిస్తుంది.

**సింహం :** నలుగురినీ కలుపుకుని పనులను సానుకూల పరచుకుంటారు. ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉంటాయి.

**కన్య :** వస్తు భద్రత, ఆభరణాల భద్రత పట్ల శ్రద్ధను కనబరచండి. జమా ఖర్చులను సరిచూసుకుంటారు.

**తుల :** మీకు ఇష్టం లేని పనుల నుండి తప్పుకోగలుగుతారు. ఎదుటి వారి మనస్సు నొప్పించకుండా చాకచక్యంగా వ్యవహరిస్తారు.

**వృశ్చికం :** కోపాన్ని అదుపులో ఉంచుకుంటారు. మేధస్సుకు పదును పెట్టవలసిన విధంగా పరిస్థితులు చోటు చేసుకుంటాయి.

**ధనుస్సు :** శుభకార్యాల విషయంలో మీ నిర్ణయాలను నిర్మొహమాటంగా వెల్లడించవలసి వస్తుంది.

**మకరం :** అందరూ ఉన్నా మిమ్మల్ని మీరు ఒంటరిగా భావిస్తారు. యోగా, ప్రకృతి వైద్యం పైన మక్కువ చూపుతారు.

**కుంభం :** ఉన్నత స్థానంలోని వారు మీ శ్రేయోభిలాషులు అవడం వలన లబ్ది పొందుతారు. బంధువుల కలయిక.

**మీనం :** వృద్ధాశ్రమాలను సందర్శిస్తారు. గృహోపకరణాలు అమ్మే వ్యాపారస్తులకు అనుకూలం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తిరంగా మార్చ్ ఉద్రిక్తం

>> వద్దనే అదుపులోకి తీసుకుని భారీ బందోబస్తుమధ్య తరలించారు. అదేవిధంగా ఎఐఎస్ఎ నాయకురాలు నేహ బోరాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని మంగ్లాపురికి తరలించారని ఎఐఎస్‌నేతలు ఆరోపించారు. పోలీసులు న్యాయవాదులు కలిసేందుకు కూడా అనుమతించకుండా ఆంక్షలు పెట్టారంటూ అటు సిజెపి ఇటు ఎ ఐఎస్ఎ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. జంతర్‌మంతర్‌వద్ద నిరసనలు ఆందోళనలను రద్దుచేసి మూడు ప్రాంతాలను ప్రకటించిన తర్వాత ఢిల్లీమున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే కాన్నాట్‌ప్లేస్, సెంట్రల్‌పార్కులను నిరసన కేంద్రాలుగా యంత్రాంగం గుర్తించి నోటిఫైచేసింది. సర్ పై ఆందోళన కొనసాగించిన సిజెపి ఇపుడు కొత్తగా తిరంగార్యాలీకి పిలుపునివ్వడంతోపరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. సుమారు ఏడువేలమందితో ఢిల్లీపోలీసులు భారీ ఎత్తున బందోబస్తు నిర్వహించారు. సిజెపి, ఇతర వామపక్ష విద్యార్థి సంఘాల నేతలను ఎక్కడికక్కడ ముందస్తుగా అదుపులోనికి తీసుకున్నారు. దీనితో పలు చోట్ల పోలీసులకు, విద్యార్థినేతలమధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాత్రిసమయానికి సుమారు 150 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.అయినా కూడా కాన్నట్‌ప్లేస్, మండిహౌస్‌లవద్దకు వందలాదిగా విద్యార్థి నాయకులు, సిజెపి కార్యకర్తలు చేరుకుని తిరంగా ర్యాలీకి సిద్ధం అయ్యారు. ఓవైపు పోలీసులు అడ్డుకుంటున్నా జాతీయ పతాకాన్ని చేతపట్టి పెద్దగా అటూ ఇటూ ఊపుతూ కార్యకర్తలు నినాదాలుచేసారు. నిరసనకారులు త్రివర్ణపతకాలతో ఆకస్మిక నిరసనలకు దిగారు. సెంట్రల్ దిల్లీలోని కన్నాట్ ప్లేస్, మండి హౌస్‌లో సీజేపీ మద్దతుదారులు, విద్యార్థి సంఘాల సభ్యులు ఆకస్మిక నిరసనలు చేపట్టారు. వందలాదిమంది గుంపుగా చేరి చేతిలో జాతీయ జెండాలు పట్టుకొని నిరసన తెలిపారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీంతో అక్కడ నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది. తిరంగాను చేతబట్టి పెద్దపెట్టున నినాదాలుచేసారు. పోలీసులు లెహంగాదో తిరంగా మార్చ్‌కకు అనుమతినిచ్చినప్పటికీ పలువురు నేతలను నిర్బంధంలోకి తీసుకోవడంపై భారీ ఎత్తున నిరసన వ్యక్తం అయింది. బిఎన్ఎస్ఎస్‌పరిధిలో సెక్షన్ 163 నిషేధాంక్షలు కూడా విధించారు. ఈప్రాంతంలో ఎలాంటి గుమికూడటాలు, నిరసనలు ఉండకూడదని ఈ ఆంక్షలు విధించారని సిజెపి ఆరోపించింది. అంతకుముందే 20మందికిపైగా పోలీసులు దీప్కేను నివాసం వద్దనే చుట్టుముట్టి కాన్నట్‌ప్లేస్‌వద్ద ర్యాలీలో పాల్గొనేందుకు లేదని పట్టుబట్టారు. ఇందుకు సంబంధించి నిషేధాంక్షలు ఉన్నాయని, ఆయనకునోటీసులు కూడా ఇచ్చారు.

**గాంధేయ మార్గమే మా ఆందోళన పథం: దీప్కే**

ఢిల్లీలో పరిపాలనాపరమైన ఆంక్షలు విధించడంపై దీప్కే ఎక్స్ వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్నవాళ్లను జవాబుదారీతనం కోరడం అనేది అరాచకం కాదని అన్నారు. పరిపాలనాపరమైన ఆంక్షలు వల్ల ప్రజలు, వ్యాపారులకు తీవ్ర అంతరాయం కలుగుతుందని తెలిపారు. శాంతియుత నిరసనల వల్ల వ్యాపారాలు నష్టపోవు. కానీ ఒక నగరాన్ని పూర్తిగా మూసివేసి, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, పౌరుల రాకపోకలపై ఆంక్షలు విధిస్తే భారీ నష్టం కలుగుతుంది.సిజెపి స్థాపించినప్పటి నుంచీ ఎల్లప్పుడూ మహాత్మా గాంధీ శాంతి, అహింసా మార్గాన్ని అనుసరిస్తాము. నాపై దాడి జరిగినా ప్రతీకారం కోసం మేం ప్రయత్నించలేదు. అంబేడ్కర్ రాజ్యాంగం మాకు కల్పించిన హక్కులను వినియోగించుకోవడానికే మేం అత్యంత ప్రాధాన్యం ఇస్తాం అని ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు.

# ఎల్‌కె అద్వానీకి అస్వస్థత
## ఆసుపత్రిలో చేరిన బిజెపి అగ్రనేత

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** బిజెపి వృద్ధనేత, కేంద్ర మాజీ డిప్యూటీ ప్రధానమంత్రి ఎల్‌కె అద్వాని అస్వస్థతకు లోనవడంతో ఆయన్ను నగరంలోని అపోలో ఆసుపత్రిలో చేర్చారు. 98 యేళ్ల అద్వాని వృద్ధాప్యసమస్యలతో సతమతం అవుతున్న సంగతి తెలిసిందే. శుక్రవారం సాయంత్రం ఆయనకు ఛాతిలో ఇన్ఫెక్షన్ సోకినట్లు తేలడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. రాత్రి 7.30 గంటలప్రాంతంలో ఆయన్ను తమ ఆసుపత్రిలో చేర్పించారని, ప్రస్తుతం పల్మనరీ విభాగంలో ఆయనకు చికిత్స అందుతోందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గడచిన మేనెలలో కూడా వృద్ధాప్య సమస్యలపై ఒకపర్యాయం ఆసుపత్రిలో చిక్సిపొందారు. వారం రోజులక్రితమే ప్రధానిమోడీ ఆద్వాని నివాసానికి వెళ్లి ఆయన్ను పరామర్శించడంతోపాటు 25 యేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయన ఆశీస్సులు అందుకున్నారు.

# రష్యా కమ్‌చట్కా ద్వీపకల్పంలో భారీ భూకంపం

## రిక్టర్ స్కేలుపై 7.0గా నమోదు

**మాస్కో, అక్టోబరు 16:** రష్యా తూర్పు తీరంలోని కమ్‌చట్కా ద్వీపకల్ప ప్రాంతాన్ని భారీ భూకంపం తీవ్ర భయాందోళనకు గురిచేసింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.0గా నమోదైనట్లు యూరోపియన్‌మెడిటరేనియన్ సీస్మోలాజికల్ సెంటర్ వెల్లడించింది.




భూమి ఉపరితలం నుంచి సుమారు 140 కిలో మీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. హఠాత్తుగా సంభవించిన ఈ ప్రకంపనలతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:35 గంటల ప్రాంతంలో ఈ భూప్రకంపనలు నమోదయ్యాయి. రష్యాలోని పసిఫిక్ మహాసముద్ర తీరప్రాంతంలో ఉండే ఈ కమ్‌చట్కా ప్రాంతం భౌగోళికంగా అత్యంత ప్రమాదకరమైన పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ జోన్‌లో ఉంది. భూఫలకల ఉపరితల కదలికలు నిరంతరం జరిగే ఈ ప్రాంతంలో భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు సాధారణంగా సంభవిస్తుంటాయి. భూకంపం ధాటికి భూమి తీవ్రంగా కంపించినప్పటికీ, ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ఆస్తి నష్టం గానీ సంభవించినట్లు సమాచారం లేదు. భూకంప కేంద్రం చాలా లోతులో ఉండటంతో పెద్దగా నష్టం వాటిల్లలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే తీరప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేసి పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నారు.

# నవంబరు 3న జాతీయ నీటి అభివృద్ధి సంస్థ పాలకమండలి సమావేశం

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** జాతీయ నీటి అభివృద్ధి సంస్థ పాలక మండలి సమావేశం నవంబరు 3న నిర్వహిస్తున్నట్లు ఎన్‌డబ్ల్యుడిఎ డైరెక్టర్ జనరల్ బాలేశ్వర్ ఠాకూర్ ఒక ప్రకటనలో తెలిపారు. వాటర్ రీసోర్స్, రివర్ డెవలప్‌మెంట్, గంగా పునర్జీవం డిపార్టుమెంట్ సెక్రటరీ అధ్యక్షతన ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లోని జలశక్తి ఆఫీసు మొదటి అంతస్తులో మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం అవుతోంది. ఈ సమావేశంలో గోదావరి, కావేరి అనుసంధానం అంశం కూడా చర్చకు రానున్నది. సిడబ్ల్యుసి, ఎన్‌డబ్ల్యుడిఎతోపాటు సభ్యులు విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు. సమావేశ ఎజెండాను కూడా మెంబర్‌లకు పంపారు. విడియో లింకేజి కూడా పంపుతామని తెలిపారు. మరోవైపు ఈ నెల 26న కెఆర్‌ఎంబి సమావేశం ఏర్పాటు చేస్తూ కెఆర్‌ఎంబి మెంబర్ సెక్రటరీ సతీష్‌కాంబోజి సభ్య రాష్ట్రాలకు ఎజెండాను పంపారు.

# ఇంటర్ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదలైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, ఫెయిలైన విద్యార్థులు అక్టోబర్ 26 నుంచి నవంబర్ 9 వరకు ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని ఇంటర్ బోర్డు తెలిపింది. రూ.100 ఆలస్య రుసుంతో నవంబర్ 20 వరకు, రూ.500 ఆలస్య రుసుంతో నవంబర్ 29 వరకు, రూ.1,000 ఆలస్య రుసుంతో డిసెంబర్ 7 వరకు, రూ.2,000 ఆలస్య రుసుంతో డిసెంబర్ 14 వరకు ఫీజు చెల్లించవచ్చని బోర్డు పేర్కొంది.

# పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వండి

## ప్రచార రథాన్ని ప్రారంభించిన జనసేన చీఫ్ పవన్‌కల్యాణ్

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పన్నెండేళ్లు అయితున్నప్పటికీ ఇంకా ఇక్కడ తీరని కోరికలు, ఆకాంక్షలు చాలా ఉన్నాయని జనసేన చీఫ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్ అన్నారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారానికి ఉపయోగించేందుకు గాను ఏర్పాటు చేసిన జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ ప్రచార రథంను శుక్రవారం హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత బలిదానాలు, వారి పోరాటాలే తెలంగాణ రాష్ట్ర సాధకు ముఖ్య కారణాలని వ్యాఖ్యానించారు.

తెలంగాణ యువత ఆశించింది జనసేన సాధిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి సేవ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. తానెప్పుడూ ప్రజల పక్షానే నిలబడ్డానని, తెలంగాణలో జనసేన పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని మొట్టమొదటి సారిగా చేతులెత్తి అడుగుతున్నానని అన్నారు.

జనసేన పార్టీని తెలంగాణలోనే స్థాపించినట్లు స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ద్వారా మొట్టమొదటి సారి తెలంగాణ రాష్ట్రానికి సేవ చూసుకునే అవకాశం, అదృష్టం లభిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని త్వరలో జరగబోయే ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా జనసేన పార్టీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావును గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కొత్త తరం యువత భవిష్యత్తు కోసం, వారి యొక్క రాజకీయ ఆకాంక్షల కోసం శ్రీనివాసరావు ప్రచార రథం ద్వారా ప్రజల్లోకి వస్తున్నట్లు చెప్పారు.

120 రోజుల పాటు ప్రచార రథం ద్వారా ప్రజల్లో తిరుగుతారని, మన తెలంగాణ కోసం ప్రతి ఒక్క పట్టభద్రులు ఈ ప్రచార రథం ఆవశ్యకతను గుర్తించాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లాలో ఒక లక్ష రూపాయలు కూడా చేతిలో లేకుండా బోర్ వెల్ వేయించిన సందర్భంలో ఆ రోజు ఏర్పడిన ఆకాంక్ష ఈ రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 30 వేల కోట్ల రూపాయలతో జల్ జీవన్ ధార పథకం చేపట్టే స్థాయికి వెళ్ళిందని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ప్రచార రథంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పట్టభద్రుల కుర్చీలో కూర్చుని, మీ యొక్క సమస్యలు, ఆలోచనలను పంచుకుని, ఆకాంక్షలను, ఆశయాలను తెలియజేసి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

# నౌహీరా షేక్ హీరా గ్రూప్ కేసులో రూ.103.26 కోట్ల ఆస్తుల వేలం రిజిస్ట్రేషన్ పూర్తి

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** నౌహీరా షేక్ హీరా గ్రూప్ కేసులో రూ.103.26 కోట్ల ఆస్తుల వేలం రిజిస్ట్రేషన్ పూర్తైంది. ఈ కేసులో ఇప్పటివరకు 9 ఆస్తుల రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. బంజారాహిల్స్‌లోని కార్వీ సెంటర్, నైనా టవర్స్ విక్రయం ద్వారా రూ.88.23 కోట్లు వచ్చాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బాధితులకు చెల్లింపులు చేసేందుకు ఈ ఆస్తులను వేలం వేశారు.

# నెలాఖరున పార్లమెంటు ప్రత్యేక భేటీ!

## డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులే లక్ష్యం

## మోడీ ప్రభుత్వం ముమ్మర కసరత్తు

## మద్దతు సమీకరణపై పార్టీలతో సంప్రదింపులు



**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనలు తీవ్రమవుతున్న నేపథ్యంలో, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను చేపట్టేందుకు ప్రభుత్వం ఈ నెల చివరలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అక్టోబరు 26, 27 తేదీల్లో 'సంవిధాన సదన్' (పాత పార్లమెంటు భవనం)లో జరగనున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌ను దృష్టిలో ఉంచుకుని తేదీలను ఖరారు చేసే అవకాశం ఉందని సమాచారం. లోక్‌సభలో ఈ బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలం కేంద్రానికి ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. సభలో తమ బలంపై ప్రభుత్వానికి పూర్తి విశ్వాసం ఉందని, ప్రతిపాదిత చట్టాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతోందని, అదే సమయంలో ఓటింగ్‌కు ముందు మద్దతు కూడగట్టుకోవడానికి ప్రతిపక్ష పార్టీలను సంప్రదిస్తోందని వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 17న జరిగిన బడ్జెట్ సమావేశాల్లో, నియోజకవర్గాల పునర్విభజన, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు దిగువ సభలో ఓడిపోవడంతో మోడీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని నెలల తర్వాత ఈ ప్రతిపాదిత చర్య వచ్చింది.

ప్రభుత్వం ఈ బిల్లులను వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని భావించినప్పటికీ, నీట్ పరీక్ష లీకుల వివాదం, సిజెపి ఆందోళన, ఎస్ఐఆర్ చర్యలపై నిరసనల నేపథ్యంలో విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి పరిణామాలు ప్రాధాన్యత సంతరించుకోవడంతో ప్రభుత్వం ఈ చర్యను వాయిదా వేసింది. రాజ్యాంగ సవరణకు పార్లమెంటులో ప్రత్యేక మెజారిటీ అవసరం. ప్రస్తుత లోక్‌సభలో ఎన్డీఏకు మెజారిటీ ఉన్నప్పటికీ, దానికి అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ (సుమారు 360 సీట్లు) కంటే అది తక్కువగా ఉంది. దిగువ సభలో ప్రస్తుతం 540 మంది సభ్యులు ఉన్నారు, అయితే గత సమావేశాల తర్వాత 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఆరుగురు శివసేన (యుబిసి) ఎంపీలు అధికార పక్షంలో చేరడంతో ప్రభుత్వ స్థానం బలపడింది. వర్గాల సమాచారం ప్రకారం, కొన్ని బిల్లులకు మద్దతు కూడగట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం డిఎంకెతో చర్చలు జరుపుతోంది. తమిళనాడు ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌తో తెగదెంపులు చేసుకుని, ఇండియా కూటమి నుంచి బయటకు వచ్చిన తర్వాత, ఈ ప్రాంతీయ పార్టీతో కేంద్రం సంప్రదింపులు జరుపుతుండటం గమనార్హం. ఓటింగ్ జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, తమకు అవసరమైన సంఖ్యాబలాన్ని సమకూర్చుకునేందుకు ప్రభుత్వం మరికొన్ని చిన్న ప్రతిపక్ష పార్టీలతో కూడా సంప్రదింపులు జరుపుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

### ప్రొరోగ్ కాని వర్షాకాల సమావేశాలు

ఆగస్టు 13న ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఇంకా అధికా రికంగా ముగియలేదు (ప్రొరోగ్ కాలేదు). దీనివల్ల ప్రభుత్వం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇక్కడే కీలకమైన అంశాలు ప్రాధా న్యత సంతరించుకుంటాయి. పార్లమెంటు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అంటే తదుపరి సమావేశం ఎప్పుడు జరుగుతుందో నిర్ణయించకుండానే సభలను నిలిపివేశారు. అయితే, సమావేశాలను అధికారికంగా ముగించే రాజ్యాంగ ప్రక్రియ అయిన 'ప్రొరోగేషన్' ఇంకా జరగలేదు. సాధారణంగా సభలు నిరవధికంగా వాయిదా పడిన 23 రోజుల్లోనే ప్రొరోగేషన్ ప్రకటిస్తారు, కానీ ఈసారి రెండు నెలలకు పైగా సమయం గడిచిపోయింది. ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే ముందు కనీసం వారం రోజుల ముందుగానే నోటీసు ఇచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# సహకార సంఘాల ఎన్నికలకు తక్షణమే ఒత్తిడి తేవాలి

## కెటిఆర్‌తో జిల్లాల నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షుల భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సహకార సంఘాలు, సహకార బ్యాంకులకు వెంటనే ఎన్నికలు నిర్వహించేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన సహకార సంఘాల అధ్యక్షులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి, సహకార రంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన కేటీఆర్.. సహకార సంఘాల ఎన్నికల నిర్వహణ కోసం తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో సహకార బ్యాంకుల మొత్తం వ్యాపారం సుమారు రూ.13 వేల కోట్లుగా ఉండగా, కేసీఆర్ నేతృత్వంలోని పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అది రూ.60 వేల కోట్లకు చేరిందని అధ్యక్షులు తెలిపారు. రైతాంగానికి మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం సహకార సంఘాలు, బ్యాంకులను బలోపేతం చేసిందని పేర్కొన్నారు. సహకార సంఘాలకు స్వయం ప్రతిపత్తి కల్పించి, ఎన్నికల ద్వారా పాలకవర్గాలను ఏర్పాటు చేయడంతో రైతులకు చేరువగా సేవలు అందించగలిగాయని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలకవర్గాలతో వ్యవస్థను నడిపిస్తుండటంతో సహకార రంగం తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

కొన్ని చోట్ల సహకార సంఘాల పదవులను రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు తీసుకుని కేటాయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొంటూ, ఈ వ్యవహారాలపై విచారణ జరిపి పారదర్శకత తీసుకురావాలని కోరారు.

మేనేజ్‌మెంట్ కమిటీలు లేకపోవడంతో సహకార బ్యాంకులు రైతులకు పంట రుణాలు అందించలేని పరిస్థితి ఏర్పడిందని అధ్యక్షులు తెలిపారు. ప్రస్తుత పంట సీజన్‌లో సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

బ్యాంకుల సీఈఓలకు పరిమిత అధికారాలే ఉండటంతో రూ.10 లక్షలకు మించిన రుణాల మంజూరుకు అవసరమైన నిర్ణయాలు తీసుకోవడం కష్టమవుతోందన్నారు. దీంతో జిల్లా సహకార బ్యాంకుల కార్యకలాపాలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాల పంపిణీ కూడా ప్రభావితమవుతున్నాయని వివరించారు.

ఉన్నత విద్య కోసం ఐఐటీలు, ఐఐఎంలలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సైతం రుణాలు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గతంలో ఎన్నికైన పాలకవర్గాల స్థానంలో నామినేటెడ్ వ్యవస్థను కొనసాగించడం వల్ల సహకార సంఘాల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటోందని అధ్యక్షులు పేర్కొన్నారు. పాలకవర్గాల పునరుద్ధరణకు సంబంధించిన అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉందని, న్యాయపరమైన ప్రక్రియలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టేలా ఒత్తిడి తీసుకురావాలని కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు.

సహకార సంఘాలు, బ్యాంకులు తిరిగి బలోపేతం కావాలంటే ఎన్నికల నిర్వహణ అత్యవసరమని స్పష్టం చేశారు. రైతులకు పంట రుణాలు, విద్యార్థులకు విద్యా రుణాలు సహా అవసరమైన సేవలు సక్రమంగా అందాలంటే ఎన్నికైన పాలకవర్గాలను ఏర్పాటు చేయాలని కోరారు.

సహకార సంఘాల అధ్యక్షుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేటీఆర్, ఈ అంశంపై తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సహకార రంగాన్ని బలోపేతం చేయడం, ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన చర్యలకు మద్దతుగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

# ఓటర్ల తొలగింపుపై ప్రచారం అవాస్తవం

## సిఇఒ సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** తెలంగాణలో భారీగా ఓట్లను తొలగించారంటూ జరుగుతున్న ప్రచారంపై సీఈవో సుదర్శన్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఓటర్ల తొలగింపు ప్రచారాన్ని శుక్రవారం తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా 73.39 లక్షల మంది ఓటర్ల ఫారాలు అందలేదని.. 2.64 కోట్ల మంది ఓటర్ల ఫారాలు స్వీకరించామని తెలిపారు. ఫారాలు అందిన ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో చేర్చినట్లు చెప్పారు. ఫారాలు అందని వారి పేర్లు ముసాయిదా జాబితాలో లేవన్నారు. బీఎల్‌వో లు ఇంటింటికీ వెళ్లి ఫారాలను సేకరించారని సీఈవో తెలిపారు. ఓటర్లకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఫారాల సమర్పణకు అవకాశమిచ్చామన్నారు. ఫారాలు అందని వారి కోసం క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రక్రియ చేపట్టామన్నారు. ఈనెల 15,16 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. కొత్త ఓటర్లు, యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక అవకాశం కల్పించినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో చోటు కల్పిస్తామని స్పష్టం చేశారు. 73.39 లక్షల మందికి అవకాశం ఇవ్వకుండా తొలగించారన్న ప్రచారం అవాస్తవమని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

# కరవుపై ముందస్తు చర్యల్లో అట్టర్ ఫ్లాప్

## రేవంత్‌రెడ్డి అవగాహనరాహిత్యంతోనే ఈ దుస్థితి

## తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత




శుక్రవారం రక్షణ సేన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** కరవు వస్తుందనే ముందే హెచ్చరించినా ముందస్తు చర్యలు చేపట్టడంలో సీఎం రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్ అయ్యారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. శుక్రవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది జనవరి నుంచే ఎల్ నినో ఎఫెక్ట్ తో తీవ్రమైన కరువు వచ్చే ప్రమాదముందని హెచ్చరించినా కనీస చర్యలు చేపట్టలేదన్నారు. దొంగలు పడిన ఆరు నెలలకు అన్నట్లుగా ఇప్పుడొచ్చి రైతులు త్యాగాలు చేయాలని నీతులు వల్లించడం సిగ్గుచేటు అన్నారు. కరువు విషయంలో తాను ఏమీ చేయలేనని సీఎం రేవంత్ రెడ్డి నిస్సహాయతను వ్యక్తం చేస్తూ చేతులెత్తేశారని మండిపడ్డారు. పాలకుడికి దూరదృష్టి ఉండాలని.. సీఎంలో అది లోపించిందని అన్నారు. పరిస్థితి మొత్తం చేయి దాటి పోయిన తర్వాత వచ్చి రైతులు త్యాగాలు చేయాలని మాట్లాడటం దారుణమన్నారు. ఆగస్టు నెలలో 28 శాతం లోటు వర్షపాతం నమోదు అయ్యిందని.. అప్పుడే అలర్ట్ అయి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్నారు. పక్క రాష్ట్రాలు కరువు మండలాలను ప్రకటించి కేంద్రానికే ఇప్పటికే నివేదిక పంపాయని గుర్తు చేశారు. మన సీఎం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇప్పుడు నింపాదిగా రివ్యూలు అంటూ కాలం వెళ్లదీసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు అవుతుందని.. ఇప్పటి వరకు పాలమూరు రంగారెడ్డి పూర్తి చేయలేదని, మేడిగడ్డ బ్యారేజ్ ను కూడా రిపేర్ చేయలేదని అన్నారు. వాటిని పూర్తి చేసి ఉంటే ఇవ్వాళ రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఇంకా ఎన్నాళ్లు గత ప్రభుత్వాన్ని తిడు తూ టైమ్ పాస్ చేస్తారని ప్రశ్నించారు. తిట్టుడు బంద్ చేసి కట్టుడు షురూ చేయాలని సూచించారు. ఆగ్రహం వ్యక్తం చేశారు.

### కెటిఆర్‌ది సొంత మనుషులపై ఉడుకు నీళ్లు పోసే నైజం

విదేశీ బొగ్గు కొనుగోలు ఒప్పందాలపై విచారణ పేరుతో ప్రతిమ శ్రీనివాస్‌రావుకు వ్యతిరేకంగా కేటీఆర్ లేఖ రాయడంపై కవిత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉద్యమ కాలంలో బీఆర్ఎస్‌కు పూర్తి అండగా ఉన్న శ్రీనివాస్ రావుపై విచారణ కోరడం అంటే నమ్మినోళ్లను నట్టేట ముంచడమేనన్నారు. సాయం చేసిన వాళ్లను, కుల బంధువులను ఇబ్బంది పెట్టడం.. ఇంటి మనిషినైనా తనను కిరాయి మనుషులతో తిట్టించే నైజం కేటీఆర్ ది అని మండిపడ్డారు. సొంత మనుషులపై ఉడుకు నీళ్లు పోసే వ్యక్తి కేటీఆర్ అన్నారు.

# ఎల్‌నినో ఎదుర్కొనేందుకు మద్దతుగా సినీ పరిశ్రమ సిద్ధం

## అక్కినేని నాగార్జున

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** సూపర్ ఎల్‌నినో అనే ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడంలో సామాన్య ప్రజల నుంచి పారిశ్రామిక వేత్తల వరకు సహకరించాలని ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుపై సినీ హీరో అక్కినేని నాగార్జున స్పందించారు. 'ప్రపంచ దేశాలపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంది. ఇది ఎప్పటివరకు ఉంటుందో తెలియదు. రాబోయే కాలంలో ఈ ఎల్‌నినో ప్రభావం ప్రమాదకర స్థాయిలో ఉండనుంది. ఈ గడ్డు పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలందరూ సహకరించాలి. సినీ పరిశ్రమ వైపు నుంచి మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు.. ఎల్‌నినో ప్రభావం తగ్గేవరకు.. ప్రభుత్వానికి సినీ పరిశ్రమ తోడ్పాటును అందిస్తుంది' అని నాగార్జున పేర్కొన్నారు.

# రాహుల్‌గాంధీ దాదాగిరి చేస్తున్నారా?

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీరుపై కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని, ఎన్నికల అధికారులను లక్ష్యంగా చేసుకుని రాహుల్ వ్యాఖ్యలు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ దేశంలో దాదాగిరి చేస్తున్నారా అని ప్రశ్నించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను వదిలిపెట్టబోమని రాహుల్ అనడం సరికాదన్నారు. దమ్ముంటే ఎన్నికల్లో గెలవాలని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం ఆయన బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. దేశంలో ఓట్ చోరీ జరగలేదని, చోరులకు ప్రజలు ఎప్పుడూ ఓటు వేయరని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సర్‌తో సంబంధం లేకుండానే గతంలో బీజేపీ ఘన విజయం సాధించిందని గుర్తుచేశారు. ఇదే సమయంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌ను రాజకీయాల్లోకి లాగడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశ యువత హృదయాల్లో ధోవల్‌కు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన పేరు చెబితేనే పాకిస్థాన్ గుండెల్లో రైళ్లు పరిగెడుతాయని ఆయన తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం గొప్ప వ్యక్తులను వివాదాల్లోకి లాగడం కాంగ్రెస్ పార్టీకి తగదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హితవు పలికారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లలో కాంగ్రెస్ గెలిస్తే ఈవిఎంలు, ఎన్నికల కమిషన్ బెస్ట్ అన్నారు. కేరళం ఎన్నికల్లో గెలిస్తే సర్ మంచిదని కాంగ్రెస్ సర్టిఫికెట్లు ఇచ్చిందని పేర్కొన్నారు. బిజెపి గెలిస్తే మాత్రం ఈవిఎంలు, ఎలక్షన్ కమిషన్ తప్పని ఆరోపించడం సిగ్గుచేటు అని విమర్శించారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎన్నడూ లేని విధంగా న్యాయస్థానాల ముందుకు కాంగ్రెస్ నేతలు ఊరేగింపుగా వెళ్లడం అత్యంత గర్హనీయమని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనలో స్వాతంత్ర పోరాటం జరిగినప్పుడు కూడా ఎవరూ కోర్టుల ముందు ఊరేగింపులు చేయలేదని, కానీ రాహుల్ గాంధీ ముఖ్యమంత్రులు, ఎంపీలు, పదవులు పోయిన నాయకులందరినీ విమానాలు, రైళ్లలో తరలించి సుప్రీంకోర్టుపై ఒత్తిడి తెచ్చేందుకు, న్యాయమూర్తులను బ్లాక్‌మెయిల్ చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. న్యాయస్థానాలు తమకు అనుకూలంగా తీర్పు ఇస్తే ఒకలా, వ్యతిరేకంగా వస్తే మరోలా వ్యవహరించే కాంగ్రెస్ శైలిని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. రోడ్లపై బారికేడ్లెక్కి డ్యాన్సులు చేయడం, మహిళా పోలీసు అధికారులపై దురుసుగా ప్రవర్తించడం, ప్రియాంక గాంధీ మహిళా కానిస్టేబుల్‌పై పిడిగుద్దులు కురిపించడం చూసి దేశ ఆడబిడ్డలు ఛీత్కరించుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగడుతూ.. ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేయాలన్నా, ఫీజు రీయింబర్స్‌మెంట్, జీవో 22ఏ సమస్యలపై పోరాడాలన్నా బీజేపీ కార్యకర్తలను, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని వారంలో ఐదుసార్లు అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి అక్రమంగా నిర్బంధిస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో రైతులు ఏడాదిన్నర పాటు నిరసనలు చేపడితే తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు కల్పించి ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించిన చరిత్ర కేంద్ర ప్రభుత్వానిదని గుర్తుచేశారు. ఇక్కడ ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ, బీజేపీ కార్యాలయాల నుంచి బయటకు రాకుండా గృహ నిర్బంధాలు చేస్తూ.. ఢిల్లీకి పోయి రాజ్యాంగ పరిరక్షణ అంటూ రేవంత్ రెడ్డి ఇచ్చే పెద్ద పెద్ద ఉపన్యాసాలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని విమర్శించారు. భారతదేశ అభివృద్ధిని, ప్రపంచవ్యాప్తంగా నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో పెరుగుతున్న దేశ ప్రతిష్టను జీర్ణించుకోలేక అంతర్జాతీయ పెట్టుబడిదారీ శక్తులు, డీప్ స్టేట్ మీడియా, విదేశీ శక్తులు, దేశీయ విద్రోహ శక్తులు ఏకమై పెద్ద కుట్రకు తెరలేపాయని కిషన్ రెడ్డి హెచ్చరించారు. భారత్ ఎప్పటికీ ప్రపంచం ముందు అప్పుల కోసం చేతులు చాచాలని, తమ కనుసన్నల్లోనే నడవాలని కోరుకునే శక్తులు ఇక్కడి ప్రజల్లో అసంతృప్తి రేకెత్తించేందుకు యత్నిస్తున్నాయన్నారు.

# తెలంగాణలో పీక్ డిమాండ్

## రికార్డు స్థాయిలో 20,003 మెగావాట్లు విద్యుత్

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** తెలంగాణలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోంది. తాజాగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 20,003 మెగావాట్లకు చేరి కొత్త రికార్డు సృష్టించింది. రాష్ట్రవ్యాప్త గరిష్ఠ విద్యుత్ డిమాండ్ గురువారం ఉదయం 10:29 గంటలకు 20003 మెగావాట్లుగా నమోదైంది. ఇది రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు అత్యధికం. ఈ ఏడాది మార్చి 3వ తేదీన అత్యధిక డిమాండ్ 18548 మెగావాట్లుగా నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్‌లో అత్యధికంగా 4220 మెగావాట్లు విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. కాగా గత పది రోజులుగా రాష్ట్రంలో విద్యుత్ క్రమంగా పెరుగుతోంది. ఈ నెల 1వ తేదీన రాష్ట్రం మొత్తం మీద 18936 మెగావాట్ల (320.90 మిలియన్ యూనిట్లు) విద్యుత్ వినియోగం జరగ్గా, 2వ తేదీన 18368 మెగావాట్లు (313.41 మిలియన్ యనిట్లు), 3న 19098 మెగావాట్లు (317.17 మిలియన్ యూనిట్లు), 4న 18447 మెగావాట్లు (314.22 మిలియన్ యూనిట్లు), 5న 18982 మెగావాట్లు (314.20 మిలియన్ యూనిట్లు), 6న 19204 మెగావాట్లు (315.51 మిలియన్ యూనిట్లు), 7న 19535 మెగావాట్లు (318.69 మిలియన్ యూనిట్లు), 8న 19598 మెగావాట్లు (320.90 మిలియన్ యూనిట్లు), 9న 19762 మెగావాట్లు (324.54 మిలియన్ యూనిట్లు),10న 19462 మెగావాట్లు (322.07 మిలియన్ యూనిట్లు), 11న 19087 మెగావాట్లు (327.38 మిలియన్ యూనిట్లు), 12న 19764 మెగావాట్లు (327.40 మిలియన్ యూనిట్లు), 13న 19457 మెగావాట్లు (323.91 మిలియన్ యూనిట్లు, 14న 19636 మెగావాట్లు (325.27 మిలియన్ యూనిట్లు), 15వ తేదీన 20003 మెగావాట్లు (334.50 మియూ) విద్యుత్ వినియోగం జరిగింది.

# నర్సంపేటలో గులాబీ జెండా ఖాయం: కెటిఆర్

**హైదరాబాద్, అక్టోబరు 16: ప్రభాతవార్త:** నర్సంపేట నియోజకవర్గంలో రాబోయే రెండేళ్లలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేట నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలను దగ్గరుండి పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా కలిసి పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఒక పార్టీ నాయకుడు మరణించినప్పుడు ఆయన కుటుంబానికి అండగా నిలవడంతోపాటు, ఆ కుటుంబాన్ని గుండెల్లో పెట్టుకుని చూసుకునే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని కేటీ ఆర్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు ప్రజలందరినీ మోసం చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని, గత బీఆర్ఎస్‌ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. ప్రజల ఆకాంక్ష మేరకు కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులన్నీ సమష్టిగా కృషి చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో పనిచేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సూచిం చారు, సింగరేణి పరిరక్షణ, విద్యుత్ సంక్షోభం, సాగునీటి సమస్యలు, రైతుల ఇబ్బందులు వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటాన్ని కొనసాగిస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

వార్త

మార్పు అనివార్యం, అభివృద్ధి చెందుతున్న దేశాలలో మార్పు స్థిరాంకం.

- బెంజమిన్ డిజ్రాయెలి

# ఊబకాయం ఉపద్రవమే!

ప్రపంచవ్యాప్తంగా పిల్లలు, కౌమారదశలో ఉన్న వారిలో ఊబకాయం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో, ప్రపంచ ఆరోగ్యసంస్థ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఊబకాయంతో బాధపడుతున్న పిల్లలు ఎదుర్కొనే సామాజిక వివక్షను పరిష్కరించడం, వారి మానసిక ఆరోగ్యాన్ని కాపాడటం కూడా చాలా ముఖ్యమని కొన్ని మార్గదర్శకాలు నొక్కిచెప్తున్నాయి. అయినా ఈ సమస్యను ఎదుర్కోవడానికి సమగ్రమైన, జీవనశైలి ఆధారిత విధానాలను అనుసరించడమే మేలు. 2024 నాటికి ప్రపంచవ్యాప్తంగా 5 నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలు, కౌమారదశలో ఉన్నవారిలో దాదాపు 17 కోట్ల మంది ఊబకాయంతో జీవిస్తున్నారని డబ్ల్యూహెచ్ఓ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వీరిలో 59 ఏళ్ల వయసు వారు 7కోట్లు ఉండగా, 10-19 ఏళ్ల వయసు వారు 10 కోట్లు ఉన్నారు. 1990తో పోలిస్తే ఈ వయసు వారిలో ఊబకాయం ప్రాబల్యం నాలుగు రెట్లు పెరిగి, 2నుంచి 8 శాతానికి చేరడం ఆందోళన కలిగిస్తోంది. వీరికి అదనంగా, ఐదేళ్ల లోపు వయసున్న మరో 3.5 కోట్ల మంది చిన్నారులు అధిక బరువుతో ఉన్నారని నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో తొలిసారిగా గ్లోబల్ మార్గదర్శకాలను డబ్ల్యూహెచ్ఓ కీలక సూచనలు చేసింది. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని శారీరక శ్రమ, ప్రవర్తనా మార్పులపై దృష్టి సారించే నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టాలని సిఫార్సు చేసింది. తల్లిదండ్రులు లేదా సంరక్షకులను భాగస్వాములను చేస్తూ ఈ కార్యక్రమాలను అమలు చేయాలని సూచించింది. పర్యవేక్షణలో డిజిటల్ హెల్త్ టూల్స్‌ను కూడా షరతులతో వినియోగించుకోవచ్చని తెలిపింది. ముఖ్యంగా, 09 ఏళ్ల మధ్య వయసున్న పిల్లల విషయంలో మందులు, బేరియాట్రిక్ సర్జరీ లేదా బరువు తగ్గించే పరికరాల వాడకాన్ని డబ్ల్యూహెచ్ఓ తీవ్రంగా వ్యతిరేకించింది. దీర్ఘకాలిక భద్రత, వారి పెరుగుదలపై ప్రభావం గురించి సరైన శాస్త్రీయ ఆధారాలు లేకపోవడమే ఇందుకు కారణమని వివరించింది. అదే సమయంలో 10-19 ఏళ్ల మధ్య వయసున్న కౌమారదశ పిల్లల్లో జీవనశైలి మార్పులకార్యక్రమాలు విఫలమైనప్పుడు మాత్రమే, నిపుణుల పర్యవేక్షణలో ఆమోదిత మందులను పరిగణనలోకి తీసుకోవచ్చని పేర్కొంది. తీవ్రమైన ఊబకాయం ఉన్నవారికి, బేరియాట్రిక్ సర్జరీ ఒక ప్రత్యామ్నాయంగా అయినా సర్జరీ అంత ఆహ్వానించదగినది కాదు. 'మందులు లేదా సర్జరీలకంటే ఆరోగ్యకరమైన ప్రవర్తనలను ప్రోత్సహించే సమగ్రమద్దతే చికిత్సకు పునాది' అని డబ్ల్యూహెచ్ఓ పోషకాహారం, ఆహార భద్రత విభాగం డైరెక్టర్ డాక్టర్ లజ్ మారియా డి రెగిల్ స్పష్టం చేశారు. బాల్య ఊబకాయం ప్రస్తుత సమాజంలో తీవ్రమైన ఆరోగ్యసమస్యగా మారింది. మన దేశంలో పిల్లలు ఆడుతూ పాడుతూ ఆరోగ్యంగా పెరగాల్సిన వయసులో, బరువు పెరుగుతూ రోగాల బారిన పడుతుండటం ఆందోళన కలిగించే విషయం. ఒకప్పుడు సంపన్న వర్గాలకే పరిమితమనుకున్న 'బాల్యఊబకాయం' నేడు అన్నివర్గాల ఇళ్లలోనూ ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్యగా రూపుదిద్దుకుంది. ఆధునిక జీవనశైలి మార్పులు పిల్లల ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. జంక్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారాలు, అధిక చక్కెర ఉన్న కూల్ డ్రింక్స్, ప్యాక్ చేసిన స్నాక్స్ పట్ల పిల్లలు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. పౌష్టికాహారమైన పండ్లు, కూరగాయలు, తృణధాన్యాల వినియోగం గణనీయంగాతగ్గింది. ఒకప్పుడు సాయంత్రం కాగానే మైదానాల్లో ఆటలాడే పిల్లలు, నేడు టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, వీడియో గేమ్‌లకే పరిమితమవుతున్నారు. దీనివల్ల శారీరక కదలికలు తగ్గిపోయి క్యాలరీలు కొవ్వుగా మారుతున్నాయి. స్క్రీన్ టైమ్ పెరగడం, గంటల తరబడి స్క్రీన్ల ముందు కూర్చోవడం వల్ల శారీరక శ్రమ తగ్గడమే కాకుండా, ఆ సమయంలో చిరుతిళ్లు తినేఅలవాటు కూడా పెరుగుతోంది. మానసిక ఒత్తిడి, నిద్రలేమి, చదువుల ఒత్తిడి, నిద్ర వేళల్లోమార్పులు పిల్లల్లో హార్మోన్ల అసమతుల్యతకు దారి తీసి ఊబకాయానికి కారణమవుతున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే చిన్నవయసులోనే పిల్లలు టైప్2మధుమేహం, అధిక రక్తపోటు గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు మానసిక ఒత్తిడి వంటి సమస్యల బారిన పడే ప్రమాదం ఉంది. బాల్య ఊబకాయాన్ని అరికట్టడం కేవలం పిల్లల బాధ్యత మాత్రమే కాదు, తల్లిదండ్రులు, పాఠశాలలు, సమాజం ఉమ్మడిగా శ్రమించాల్సిన అవసరం ఉంది. సమ తుల్యాహారం అందించడం, ఇంట్లో తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ప్రొటీన్లు ఉన్న ఆహారాన్ని ప్రోత్సహించాలి. జంక్‌ఫుడ్, కూల్ డ్రింక్స్‌ను ఇంటికి దూరంగా ఉంచాలి. రోజుకి 12గంటల కంటే ఎక్కువ స్క్రీన్ టైమ్, ఉండకుండా చూడాలి. తింటున్నప్పుడు టీవీ లేదా ఫోన్లు చూడకుండా కుటుంబమంతా కలిసి భోజనం చేసే అలవాటు చేయాలి. స్క్రీన్ టైమ్‌కు పరిమితి, ఉండటం అవసరం. శారీరక శ్రమను పెంచడం, ప్రతిరోజూ కనీసం 1గంట పాటు మైదానాల్లో ఆడుకోవడం, సైక్లింగ్, ఈత లేదా రన్నింగ్ వంటి శారీరక కార్యకలాపాల్లో పిల్లలు పాల్గొనేలా చూడాలి. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. పిల్లలకు వయసును బట్టి రోజుకి 8 నుండి 10 గంటల ప్రశాంతమైన నిద్రఅవసరం. చదువుల విషయంలో పిల్లలపై అధిక ఒత్తిడి తేకుండా, వారి మానసిక ఉల్లాసానికి ప్రాధాన్యత ఇవ్వాలి. పిల్లలే మన భవిష్యత్తు. వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టడం అంటే దేశ భవిష్యత్తును సురక్షితం చేయడమే. పసిప్రాయం నుంచే పిల్లల జీవనశైలిలో సక్రమ నిర్వహణ ద్వారానే బాల్య ఊబకాయాన్ని అరికట్టడం సాధ్యమౌతుంది.



మాట్లాడటం కంటే అధికంగా వినాలని, అధికంగా చూడాలని భగవంతుడు మనకు రెండు కళ్లు, రెండు చెవులు ఇచ్చి నోరు మాత్రం ఒకటే ఇచ్చాడు.

సోక్రటీస్



ధర్మాత్ముడైన మనిషి మంచి గంధపుచెట్టు వంటివాడు. తనను నరికే గొడ్డలికి కూడా అది సువాసన అందిస్తుంది.

తులసీదాస్

## ప్రజావాక్కు



### మూడవసారి పోటీ చేయకూడదు

భారత్ పాక్‌ల మధ్య జరిగినపెహల్గామ్ యుద్ధాన్ని తానే నివారించానని ఆమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కనీసం యాభైసార్లు పైనేడప్పు వాయించుకున్నాడు. ఈమధ్య మరోసారి తాను ఇప్పటికి ఎనిమిది యుద్ధాలను ఆపానని, తనకు నోబెల్ శాంతిబహుమతి తప్పక ఇవ్వాలని ప్రతిపాదించాడు. కాని ఈయన మాటను వినేదెవరు? నార్వేనోబెల్ కమిటీవారిని దుమ్మెత్తిపోసాడు. తనకుశాంతి బహుమతి రానప్పుడు ఊరికే కూర్చోవడమెందుకని యుద్ధాలు చేస్తూ, అందరిచేత చేయిస్తానని శపథం చేసాడు. ఈ పెద్దమనిషి మనస్తత్వం ఏమిటో గ్రహించని వారుండరు. ఈయన మరల అమెరికా అధ్యక్షుడిగా పోటీ చేస్తాడట. రెండుసార్లు ఈ పదవిని అలంకరించిన వారు మూడవసారి పోటీ చేయకూడదని అమెరికాలో ఒక న్యాయ సూత్రం ఉందని విన్నాం. మధ్యలో ఓటర్మ్ గాప్ వచ్చింది కాబట్టి చేయవచ్చా? లేదా రాజ్యాంగాన్ని మార్చేస్తాడా? మరల పోటీ చేసి గెలిస్తే ఓటమి ఒట్లేసి గెలిపించిన ప్రజలదవుతుంది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరుకుంటున్నారు. కొన్నిరాష్ట్రాలలో పునరుద్ధరించినట్లు తెలంగాణలోని ఉద్యోగులు అంటున్నారు. మనకుకావాల్సింది షేర్ మార్కెట్ ఆధారిత పెన్షన్ కాదు, భరోసానిచ్చే పాతపెన్షన్‌అని నినదిస్తున్నారు. వాస్తవానికి అలా కోరుకునే హక్కు వారికుంది. అయితే మేధావి వర్గంకదా, ముందే ఈవిధానం మంచిచెడులు ఊహించలేకపోయేవారా అనేఅనుమానం సామాన్యుడికి వస్తుంది.

- వి.ఆర్.ఆర్.ఎ.రాజు, హైదరాబాద్

### సిబిల్ స్కోర్ తప్పిదాలు?

బ్యాంకు అధికారుల అలసత్వం, పొరపాట్లు, తప్పిదాల వలన బ్యాంకు ఖాతాదారుల సిబిల్‌స్కోర్ తప్పుగా నమోదై తక్కువగా వస్తుంది. ఇతరుల అప్పు వివరాలను ఇంకొకరిపై చూపెడుతుంది. వ్యక్తులు వేరు వేరు అయినా కూడా పేరు ఒకటిగా ఉండడం వలన తప్పిదాలు జరుగుతున్నాయి. ఉన్నతస్థాయి బ్యాంకు అధికారులు సిబిల్ స్కోర్‌తప్పిదాలను సవరణ చేయాలి. ఇంతవరకు బ్యాంకు రుణాలు తీసుకోలేనిఅసలు లబ్ధిదారులకున్యాయం చేయాలి. బ్యాంకు ఖాతాల వివరాలు తప్పులు సరి చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### అసందర్భపు విమర్శలు

ఈ మధ్య కాంగ్రెసు అధినాయకుడు రాహుల్ గాంధీ ఓ వేదిక మీద హిందువుల అతి ప్రాచీన మనుస్మృతిని అనేక రకాలుగా మానవులనువిడదీసే గ్రంథంగా ఉన్నదని విమర్శలు చేసారు. కులాలను హెచ్చుతగ్గులుగా నాలుగు వర్ణాలుగా విడదీసి చూపిందని అన్నారు. ఇది ముమ్మాటికి ఆమోదయోగ్యం కాని విమర్శ. ఈనాలుగు వర్ణాలను నాలుగు వృత్తులుగా విభజిస్తూ నిర్ణయించిన అపూర్వ చారిత్రాత్మక, ఎవ్వరిచేత విమర్శించబడని బృహత్‌గ్రంథం. ఇందులో ఎవరూఎక్కువ కాదు. తక్కువ కాదు. వరుస క్రమంలో ఒకరు ముందు వెనుక ఉన్నారంతే. కాని మన పూర్వీకులు కొందరు వీరిలో బేధాలు చూపడం వలన పలు విమర్శల పాలైంది. భగవద్గీతలో కూడా ఈ వర్ణాశ్రమ ధర్మాలు పేర్కొనబడ్డాయి. దీనిపై కూడా రాహుల్ గాంధీ అసందర్భపు విమర్శలు చేయగలరా? హిందూమత గ్రంథాల మీద ఉన్నంత విమర్శలు ఏ ఇతర మతాల్లోనూ ఉండవు.

- డా. ఎన్. ఎస్. ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### అందరి మద్దతు అవసరం

హక్కుల కోసం పోరాడేందుకు యువత పోటీ పడుతుండడం శుభసూచకం. బల్లగుద్ది నిరసన తెలిపి న్యాయం కోసం సాధించిన విజయాలు అనేకం. చుక్కల్ని తాకిన నిత్యావసరాలు, ఇంకా పలు సమస్యలతో సతమతమవుతున్న ప్రజానీకానికి ఊరట కలిగించే అంశం కనుచూపు మేరలో లేదంటే అతిశయోక్తి కాదు. శాంతియుతంగా ధర్నాలు చేస్తుంటే ఆంక్షలతో వేధింపులు, ఉద్యమాన్ని అణచివేయడం, అవకతవకలు తారస్థాయి చేరాయి. నిప్పును అరచేతిలో బంధించడం అసాధ్యం. కాలేమే జావాబు చెబుతుంది. యువరక్తాన్ని తక్కువ అంచనా వేసి, దెబ్బతిన్న దేశాలు కోకొల్లలు. భావి భారతీయుల మనుగడ కోసం డిమాండ్లకు అందరి మద్దతు చాలా అవసరం.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### విద్యావ్యవస్థలో సవాళ్లు

ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం, పాఠశాల సమాచార నివేదిక (యుడైస్+) నిబంధనల పేరుతో ఉపాధ్యాయులపై పెరుగుతున్న పరిపాలనాపరమైన నిబంధనలు విద్యావ్యవస్థలో సవాలుగా మారుతున్నాయి. పాఠ్యాంశాల బోధన, పాఠాల ప్రణాళికల రూపకల్పన, జవాబు పత్రాల మూల్యాంకనం, విద్యార్థుల ప్రగతి పర్యవేక్షణ వంటి ప్రాథమిక బాధ్యతలతో ఉపాధ్యాయులు నిరంతరం బిజీగా ఉంటారు. అదనపు పని, డిజిటల్ డేటానమోదు, నివేదికల సమర్పణ వంటి బాధ్యతలు వారి బోధనా సమయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

-కె.రామారావు, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# అన్నదాతలంటే అందరికి అలుసే

***ఉదయం నుంచి సాయంత్రం వరకు బయట ఉన్న చెట్ల కింద కూర్చుని వేచి చూసినా అధికారుల దర్శన భాగ్యం కలగడం లేదు. ఒకవేళ కలిగినా ఒక్క నిమిషం వారి సమస్య వినే ఓపిక ఉండడం లేదు. దళారులతో గంటల తరబడి మాట్లాడే అధికారులకు కనీసం రైతును కూర్చోమని చెప్పే సంస్కారం కూడా లేకుండాపోతున్నది. ఇచ్చిన దరఖాస్తును కనురెప్పపాటైనా చూసే సమయం కేటాయించలేకపోతున్నారు. ఒక సెకను అయినా తామిచ్చిన దరఖాస్తును చూడని వారు తమ సమస్యను ఎలా పరిష్కరిస్తారని నిరాశ నిస్పృహాలతో విధిలేని పరిస్థితిల్లో దళారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతున్నారు. దీంతో డబ్బు పెద్ద ఎత్తున చేతులు మారుతున్నది. కింది స్థాయిలో కొందరు అధికారుల నిర్వాకం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నది. ఇతరత్రా ఎంత అభివృద్ధి సాధించినా మానవ జీవనానికి ఆహారం తప్పనిసరి. ఇంతపెద్ద జనాభాకు కావాల్సిన ఆహార పంటలు ఆ రైతుల 'చెమట' పుణ్యమేననే విషయం గుర్తుంచుకోవాలి. చివరిగా ఒక్కమాట. రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన ఎవుసం బాగుపడినట్లు చరిత్రలో లేదు.***

దామెర్ల సాయిబాబ

'కల్లాకపటం కాననివాడా, లోకంపోకడ తెలియనివాడా..' అంటూ దాదాపు ఏడు దశాబ్దాల క్రితం రైతును ఉద్దేశించి ఒక సినీకవి పాట రాస్తూ 'పల్లెటూర్లలో చెల్లని వాళ్లు, పాలిటిక్స్‌తో బతికేవాళ్లు, ప్రజాసేవయని అరిచేవాళ్లు, ఓట్లు గుంజి నిన్ను మరిచేవాళ్లు, పదవులు స్థిరమని భ్రమసేవాళ్లు, నీవే దిక్కని వస్తురు పదవోయ్.. రోజులు మారాయి అంటూ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆ పరిస్థితి వచ్చేరోజు, ఈ రోజులు మారే రోజు ఆ కవి కల నిజమయ్యే రోజు ఎప్పుడు వస్తుందో ఏమోకానీ వ్యవసాయ రంగం మాత్రం రోజురోజుకు కుదేలైపోతున్నది. అలాని పాలకులు వ్యవసాయానికి ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్ని లక్షల కోట్లు రైతుల సంక్షేమానికి వెచ్చించారో లెక్కలకే అందదు. అయినా రైతు పరిస్థితి ఏమాత్రం మెరుగుపడడం లేదు. వ్యవసాయ రంగం సంక్షోభంలో రోజురోజుకు కూరుకుపోతున్నది. ఇప్పుడు తాజాగా ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అన్నదాతలు అతలాకుతలమవుతున్నారు. నైరుతీ రుతు పవనాలు మొండి చేయి ఇచ్చాయి. ఇక దింపుడు కళ్లెం ఆశలన్నీ ఈశాన్య రుతుపవనాల పైనే. ఎల్‌నినో ప్రభావంతో అవి ఎలా ఉంటాయో చెప్పలేని పరిస్థితి. దీనికి కరెంటు కోతలు తోడుకావడంతో పరిస్థితి మరింతగా దిగజారుతున్నది. ఇప్పటికే వేలాది బోరుబావులు నీరులేక నోళ్లెళ్లబెట్టాయి. ఇలాంటి పరిస్థితుల్లో కూడా తలతాకట్టుపెట్టి సాగు చేసిన పంటలు కళ్లముందే గుక్కెడు నీటి కోసం అర్రులుచాచి ఎండిపోతుంటే గుండె ఆగి కొందరు, మరికొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్యలు ప్రారంభమయ్యాయి. రోజూ పిట్టల్లాగా రాలిపోతున్నారు. మెట్టపంటల రైతులే కాదు, ఈసారి ప్రాజెక్టుల కింద రైతుల పరిస్థితి కూడా ఆందోళనకరమే. సాధారణ సాగులో సగం కూడా సాగుకు నోచుకోలేదు. కృష్ణా, గోదావరి నదులు పరువళ్లు తొక్కాల్సిన తరుణమిది. అయినా ఎక్కడా నీటి గలగల జాడలేదు. సాగునీటి సంగతి దేవుడెరుగు. ఈసారి మంచినీటి పరిస్థితి కూడా తీవ్రరూపం దాల్చేపరిస్థితులు కన్పిస్తున్నాయి. రబీలో వరిపంట వేయొద్దని తెలంగాణ ముఖ్యమంత్రి గురువారం అన్నదాతలకు విజ్ఞప్తి చేశారు. కూలీల కొరత వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఇలాంటి రకరకాల సమస్యలతో ఇప్పటికే వేలాది మంది రైతులు కాడి కిందపెట్టారు. ఒకనాడు వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్నామని సగర్వంగా చెప్పుకునే రైతులు నేడు తాము వ్యవసాయ దారులమని చెప్పుకునేందుకు వెనుకాముందు ఆలోచిస్తున్నారు. వ్యవసాయం కాక మరేదైనా జీవనాధారం దొరికితే చిన్నరైతుల నుంచి పెద్ద భూస్వాముల వరకు పల్లెలను, వ్యవసాయాన్ని వదిలిపెట్టి పట్టణాలకు తరలిపోవడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులు గ్రామాలను వదిలి పెట్టారు. ఏ రైతు తమ పిల్లలు రైతులు కావాలని ఆశించడం లేదు. రైతుల జీవన ప్రమాణాలు రోజురోజుకు పడిపోతున్నాయనడానికి ఇది అద్దం పడుతున్నది. ఇదంతా ఒక ఎత్తయితే భూములను కాపాడుకోవడం కూడా రైతులకు రానురాను కష్టతరం అవుతున్నది. ప్రభుత్వాలు మారినప్పుడే కాదు, అధికారంలో పార్టీలు మారినప్పుడు, చివరకు ముఖ్యమంత్రులు మారినప్పుడు విధానాలు మారిపోతున్నాయి. ఏ చట్టాలు, సంస్కరణలు చేసినా అవి ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి.

## ఒక్క మాట

అవి కొత్త కష్టాలు తెచ్చిపెట్టకూడదు. కానీ భూమి రికార్డులు పక్కాగా తయారు చేసేందుకు పటిష్టమైన చట్టం రూపకల్పనకు పాలకులు చేస్తున్న చట్టాలు రైతులకు కొత్త ఇబ్బందులను తెచ్చిపెడుతున్నాయి. రెవెన్యూ రికార్డుల విషయంలో ఆది నుంచీ భూయజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్ని చట్టాలు చేశారో లెక్కకు అందదు. చట్టాలు చేసే కొద్దీ సమస్యలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదని చెప్పొచ్చు. దశాబ్దాల తరబడి దేశవ్యాప్తంగా లక్షలాది కేసులు వివిధ స్థాయిల్లో న్యాయస్థానాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. పూర్వపరాల్లో వెళితే నిజాం కాలం నుండి భూముల విషయంలో పటిష్టమైన చట్టం లేదనే చెప్పొచ్చు. వాస్తవంగా 1936 నుంచి రికార్డ్స్ ఆఫ్ రైట్స్ నిర్వహించడం ప్రారంభించారు. నైజాం పరిపాలనలో హక్కుల రికార్డు నిర్వహణ కోసం భూమి హక్కుల రికార్డు చట్టం, 1346 ఫసలీ రూపొందించారు. ఇలా ఎన్నో మార్పులు, చేర్పులు చేస్తూ 1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమి హక్కుల పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారు. 1971లో కేంద్రప్రభుత్వం భూగరిష్ట పరిమితి తీసుకురావడంతో కొంత కదలిక వచ్చింది. ఆ తర్వాత కూడా ఎన్నో మార్పులు, చేర్పులు, కొత్త చట్టాలు వచ్చాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటికీ అస్తవ్యస్థంగా ఉన్న భూరికార్డుల హక్కులను పటిష్టం చేసేందుకు 'ధరణి' పేరుతో కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకువచ్చారు. చట్టపరంగా రికార్డుల్లో అంతా బాగానే ఉన్నట్లు కన్పించినా క్షేత్రస్థాయిలో అవకతవకలు తారస్థాయికి చేరాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని రద్దుచేసి 'భూభారతి' చట్టాన్ని తీసుకువచ్చింది. ఇలా చట్టాలమీద చట్టాలు చేసే కొద్దీ భూ యజమానులకు కష్టాల మీద కష్టాలు పెరుగుతున్నాయి. ఇప్పటికీ పటిష్టమైన భూయజమాన్య హక్కులు ఏర్పడలేదనే చెప్పొచ్చు. కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం పట్ల రైతుల్లో అవగాహన అంతగా లేకపోవడంతో కొత్తదళారులు పెద్ద సంఖ్యలో పుట్టుకొచ్చారు. గతంలో వందల్లో, వేల రూపాయల్లో అయ్యే పనికి ఇప్పుడు లక్షల్లో, కోట్ల రూపాయల్లోకి మారిపోయింది. వేధింపులు, అవినీతి తారస్థాయికి చేరింది. ముఖ్యంగా రెవెన్యూశాఖలో ప్రధానంగా కింది స్థాయిలో కొన్ని మండల రెవెన్యూ కార్యాలయాల్లో లంచావతారాలు పెరిగిపోయారు. అన్నదాతలను పీల్చి పిప్పి చేస్తున్నారు. చిన్న చిన్న పనులకు లక్షలాది రూపాయలు డిమాండ్ చేసి వసూలు చేసుకొంటున్నారు. కొందరు రైతులు వీటిని భరించలేక అవినీతి శాఖ అధికారులను ఆశ్రయించిపట్టిస్తున్నారు. అవినీతి నిరోధకశాఖ అధికారులు దాడుల్లో పట్టుపడుతున్న వందల కోట్లరూపాయల ఆదాయానికి మించిన ఆస్తులు ఇందుకు అద్దం పడుతున్నాయి. ఇంకొందరు రైతులు భూమి పోతుందన్న భయంతో నిరాశ నిస్పృహాలకుగురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మొన్న ఒక రైతు కార్యాలయంలోనే ఉన్న ఒక చెట్టుకు ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకొన్నాడు. అంతకు మునుపు ఏకంగా ఆ అధికారిపైనే పెట్రోల్ పోసి నిప్పంటించి తాను ఆ మంటల్లో సమిధైపోయాడు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఒకపక్క రైతే రాజు, రైతు సంక్షేమమే తమ లక్ష్యం అంటూ ఉపన్యాసాలు ఇచ్చే నేతలు ప్రభుత్వం కార్యలయాలకు వచ్చే రైతులకు ఏపాటి గౌరవ మర్యాదలిస్తున్నారో ఒక్కసారి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అర్థమౌతుంది. మొన్న తన గోడును విన్నవించుకునేందుకు వచ్చిన ఒక రైతును ఉద్దేశించి నువ్వు ఇంకా మందు తాగి చావలేదా అంటూ బాధ్యత కలిగిన అధికారే ఎద్దేవా చేసిన ఉదంతం కలకలం రేపింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు బయట ఉన్న చెట్ల కింద కూర్చుని వేచి చూసినా అధికారుల దర్శనభాగ్యం కలగడం లేదు. ఒకవేళ కలిగినా ఒక్క నిమిషం వారి సమస్య వినే ఓపిక ఉండడం లేదు. దళారులతో గంటల తరబడి మాట్లాడే అధికారులకు కనీసం రైతును కూర్చోమని చెప్పే సంస్కారం కూడా లేకుండాపోతున్నది. ఇచ్చిన దరఖాస్తును కనురెప్పపాటైనా చూసే సమయం కేటాయించలేకపోతున్నారు. ఒక సెకను అయినా తామిచ్చిన దరఖాస్తును చూడని వారు తమసమస్యను ఎలా పరిష్కరిస్తారని నిరాశ నిస్పృహాలతో విధిలేని పరిస్థితిల్లో దళారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతున్నారు. దీంతోడబ్బు పెద్దఎత్తున చేతులు మారుతున్నది కింది స్థాయిలో కొందరు అధికారుల నిర్వాకం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నది. ఇతరత్రా ఎంత అభివృద్ధి సాధించినా మానవ జీవనానికి ఆహారం తప్పనిసరి. ఇంతపెద్ద జనాభాకు కావాల్సిన ఆహార పంటలు ఆ రైతుల 'చెమట' పుణ్యమేననే విషయం గుర్తుంచుకోవాలి. చివరిగా ఒక్కమాట. రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన ఎవుసం బాగుపడినట్లు చరిత్రలో లేదు. ●

# చికిత్సతో ఉపశమనం.. ఖర్చుతో కలవరం!

సి.ప్రతాప్

అవసరానికి మించిన పరీక్షలు, మందులు, చికిత్సలు రోగుల ఆరోగ్యానికీ, కుటుంబాల ఆర్థిక భద్రతకూ భారమవుతున్నాయి. ఏ పరీక్ష ఎందుకు చేయిస్తున్నారో, సూచించిన చికిత్సకు ప్రత్యామ్నాయం ఉందో తెలియకుండానే పలువురు ఖర్చులు భరిస్తున్నారు. వ్యాధి తగ్గాలనే ఆందోళనలో సందేహాలను అడగలేకపోతున్నారు. రోగికి ప్రయోజనం చేకూర్చని వైద్యసేవలను తగ్గించి, అవసరమైన చికిత్సను సమర్థంగా అందించడమే అతివైద్య నియంత్రణ లక్ష్యం కావాలి. జాతీయ ఆరోగ్య ఖాతాల 2022-23 అంచనాల ప్రకారం, భారతదేశ మొత్తం ఆరోగ్య వ్యయంలో ప్రజలు నేరుగా సొంత జేబుల నుంచి భరించిన వాటా 43.4 శాతం. ఈ వ్యయమంతా అతి వైద్యం వల్లేనని చెప్పలేం. అయితే ఇప్పటికే వైద్యఖర్చులతో సతమతమవుతున్న కుటుంబాలకు అనవసర బిల్లులు తోడైతే పొదుపు కరిగిపోతుంది. అప్పుల భారం పెరుగుతుంది. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ అతివైద్యం సమస్య ఉంది. అక్కడి విధానాలన్నీ సంపూర్ణంగా అమలవుతున్నాయని భావించకూడదు. అయితే అనవసర వైద్యసేవలను గుర్తించేందుకు, రోగికి విషయాన్ని వివరించేందుకు రూపొందించిన పద్ధతులు మనకు ఉపయోగకరమైన పాఠాలు అందిస్తున్నాయి. బ్రిటన్‌లోని నైస్ మార్గదర్శకాలు చికిత్స నిర్ణయంలో రోగి భాగస్వామ్యానికి ప్రాధాన్యమిస్తున్నాయి. అందుబాటులోని చికిత్సలు, వాటి ప్రయోజనాలు, ప్రమాదాలు, పరిణామాలను వైద్యుడు వివరించాలని సూచిస్తున్నాయి. మన దేశంలోనూ సమ్మతిపత్రంపై సంతకంతో సరిపెట్టకుండా, రోగికి అర్థమయ్యే భాషలో ఈసంభాషణ జరగాలి. అమెరికాలో 'చూజింగ్ వైజ్లీ' కార్యక్రమం కింద 2012-2023 మధ్య 80కిపైగా వైద్య నిపుణుల సంఘాలు, అతిగా వినియోగిస్తున్న లేదా అనవసరమైన పరీక్షలు, చికిత్సలపై 700కిపైగా సిఫారసులు రూపొందించాయి. వైద్యులు-రోగులు వాటి అవసరాన్ని చర్చించాలన్నదే ఉద్దేశం. ఇవి అన్ని చికిత్సలపై నిషేధాలు కావు, ప్రతి నిర్ణయాన్నీ శాస్త్రీయంగా సమీక్షించేందుకు సూచనలు. భారత దేశంలోనూ వివిధ వైద్య విభాగాలు ఇలాంటి స్పష్టమైన ప్రమాణాలను విస్తృతంగా అమలు చేయాలి. కెనడాలోని 'చూజింగ్ వైజ్లీ' సిఫారసులు ఒక ఆచరణాత్మక ఉదాహరణను అందిస్తున్నాయి. తీవ్రమైన వ్యాధినిసూచించే ప్రమాద సంకేతాలు లేని నడుమునొప్పికి సాధారణంగా వెంటనే ఇమేజింగ్ పరీక్షలు చేయవద్దని సూచిస్తున్నాయి. పరీక్ష చేయించగల సామర్థ్యం ఉందన్న కారణంతో దాన్ని సూచించకుండా, ఫలితం చికిత్సకు ఉపయోగపడుతుందా అన్నది పరిశీలించడమే ఇక్కడ కీలకం. ఈ అనుభవాల నుంచి మనం స్వీకరించాల్సింది మూడు అంశాలు. స్పష్టమైన చికిత్స మార్గదర్శకాలు, రోగితో సమాచారపూర్వక సంభాషణ, వైద్య నిర్ణయాలపై క్రమబద్ధమైన సమీక్ష. పరీక్ష ఎందుకు అవసరమో నమోదు చేయాలి. మందులను కొనసాగించాల్సిన అవసరాన్ని పరిశీలించాలి. అత్యవసరం కాని పెద్ద శస్త్రచికిత్సల్లో మరో నిపుణుడి అభిప్రాయానికి అవకాశం కల్పించాలి. అంచనా ఖర్చులు, ప్రత్యామ్నాయాలను ముందుగానే తెలియజేయాలి. రోగులు కూడా ఎక్కువ మందులు, ఇంజెక్షన్ల కోసం పట్టుబట్టకుండా వైద్యుల వివరణను తెలుసుకోవాలి. అవసరమైన చికిత్సను నిరాకరించడం, అత్యవసర సేవలను ఆలస్యం చేయడం లక్ష్యం కాకూడదు. ఎంత వైద్యం అందించామన్నది కాదు ఎంత మేలు చేశామన్నదే ప్రమాణం. ●

# పేదరిక రహిత భారత్‌ను నిర్మిద్దాం

బి. మధుపాళి

ప్రపంచ మానవాళిని పట్టి పీడిస్తున్న పలు సమస్యలకు 8.2 బిలియన్ల పేదరికమే ప్రధాన కారణమని, పేదరికం ఓ బహువ్యాధి లక్షణంగా మారిందని మనకు తెలుసు. మానవాళి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన నిరక్షరాస్యత, అధిక జనాభా, ప్రజారోగ్యం, అసమానతలు, లింగ వివక్ష, పర్యావరణ కాలుష్యం, నిరుద్యోగం, పారిశుధ్య లోపం లాంటి అంశాలు పేదరికంతో సమీప సంబంధాన్ని కలిగి ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 108కి పైగా దేశాలకు సంబంధించిన 6.3 బిలియన్ (630 కోట్లు) ప్రజలప్రపంచ బహుమితీయ పేదరిక సూచికలను ఐరాస అనుబంధ సంస్థలు అధ్యయనం చేసి నివేదికను రూపొందించడం జరిగింది. 'ఐరాస డెవలప్‌మెంటల్ ప్రోగ్రామ్ (యూఎన్‌డీపీ)' ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్(ఓపిహెచ్ఐ)'లు సంయుక్తంగా ఈ నివేదికను తయారు చేశాయి. గృహ వసతులు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, వంట గ్యాస్/ఇంధనాలు, పోషకాహారం, విద్యార్థుల పాఠశాలల హాజరు లాంటి ప్రధాన అంశాలను అధ్యయనం చేసిన పిదప 'బహుమితీయ పేదరిక సూచిక 2026 (మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్, ఎంపిఐ2026)లను నిర్ణయించి నివేదిక రూపొందించారు. 1992లో ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానం ఆధారంగా ప్రతి ఏటా 17 అక్టోబర్ రోజున ప్రపంచ దేశాలు 'అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని' అధికారికంగా 2008 నుంచి జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. 17 అక్టోబర్ 1987 రోజు పారిస్‌లో లక్షలాది ప్రజలు ఆకలి, పేదరికం, హింసకు వ్యతిరేకంగా గళం ఎత్తడంతో దానికి గుర్తుగా 17 అక్టోబర్ రోజును నిర్ణయించారు. 2026 అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం ఇతివృత్తంగా 'అందరికీ సురక్షితమైన గృహాలు (సేఫ్టీ హోమ్స్ ఫర్ ఆల్)' అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. 1997-2006 మధ్య తొలిసారి 'ఐక్యరాజ్య సమితి పేదరిక నిర్మూలన దశాబ్దం'గా నిర్ణయించి పలు కార్యక్రమాలు చేపట్టడం చూసాం. పేదరికాన్ని ఏడు రకాలుగా విభజించారు. తీవ్రమైన, సాపేక్ష, గ్రామీణ, పట్టణ, పరిస్థితుల ఆధార, దీర్ఘకాలిక బహుమితీయాతో పేదరికాలను అధ్యయనం చేస్తున్నారు. పారిశుధ్య లోపంతో 828 మిలియన్లు, గృహ వసతులు లేని వారు 886 మిలియన్లు, వంట గ్యాస్ లేని వారు 998 మిలియన్లు ఉన్నారని, 110 కోట్ల ప్రపంచ పేదల్లో 637 మిలియన్ల పేద పిల్లలకు పోషకాహారం అందడం లేదని వెల్లడవుతున్నది. దక్షిణ ఆసియాలో 272 మిలియన్లు, సబ్‌సహార ఆఫ్రికా ప్రాంతాల్లో 256 మిలియన్ల పేదలకు కనీస పోషకాహారం అందడం లేదని తెలుస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 83.2 శాతం పేదలు సబ్‌సహారా, దక్షిణ ఏసియా ప్రాంత దేశాల్లోనే ఉన్నారని పేర్కొనబడింది. అల్పాదాయ దేశాల్లో 34.8 శాతం, మధ్య ఆదాయ దేశాల్లో 65.2 శాతం



మంది కడు పేదలు ఉన్నారని నివేదిక వెల్లడించింది. ప్రపంచ పేదల్లో 83.7 శాతం వరకు గ్రామీణ బడుగులే ఉన్నారని తేలింది. ప్రపంచ జనాభాలో 28 శాతం గ్రామీణులు, 6.6 శాతం పట్టణ ప్రాంత పేదలు ఉన్నట్లు నివేదిక తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 108 అల్పాదాయ అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన 1.2 బిలియన్ల (18 శాతం జనాభా) ప్రజలు కడు పేదరికంలో మగ్గుతున్నారని, పేదరికం అత్యధికంగా భారత్, పాకిస్థాన్ దేశాల్లోనే ఉందని తాజాగా విడుదల చేసిన 'ఐరాస ప్రపంచ బహుమితీయ పేదరిక సూచిక 2026 (యూఎన్ గ్లోబల్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ 2026)' నివేదిక స్పష్టం చేస్తున్నది. అత్యధికంగా భారత్‌లో 234 మిలియన్లు, పాకిస్థాన్‌లో 93 మిలియన్లు, ఇథియోపియాలో 86 మిలియన్లు, నైజీరియాలో 74 మిలియన్లు, కాంగోలో 66 మిలియన్ల పేదలు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. ప్రపంచ పేదల్లో 48.1 శాతం ఈ ఐదు దేశాల్లోనే ఉన్నట్లు తేలింది. ఐరాస అధ్యయనం చేసిన దేశాల 'బహుమితీయ పేదరిక సూచిక' జాబితాలో భారత్ 105వ స్థానంలో నిలిచింది. 18 ఏండ్ల లోపు వయస్సు కలిగిన కడు పేదలు దాదాపు 584 మిలియన్లు, అనగా 27.9 శాతం ఉండగా, పెద్దలు 13.5శాతం ఉన్నట్లు వర్ణించబడింది. భారత పేదల్లో 13.7 శాతం జనాభా పోషకాహారలోపంతో, 35.5 శాతం ఐదేళ్ల లోపుపిల్లలు వయసుకు తగిన ఎత్తు లేకపోవడం (స్టంటెడ్ గ్రోత్), 18.7 శాతం ఎత్తుకు తగిన తక్కువ బరువు లేకపోవడం(వేస్టింగ్), 2.9 శాతం పిల్లలు ఐదేళ్లలోపు అకాల మరణాల బారిన పడడం గమనించారు. తరతరాలుగా పోషకాహార లోపాలు, ఆర్థిక అసమానతలు, అవిద్య, అనారోగ్యాలు, లింగ వివక్ష లాంటి కారణాలే పేదరికం రూపంలో భారతాన్ని పట్టి పీడిస్తున్నది. 2వ ప్రపంచ యుద్ధం తర్వాత 2023లోనే యుద్ధాలు, ఘర్షణలు, వివాదాస్పద ఘటనలు అధికంగా నమోదు అయ్యాయని, వీటి పర్యవసానంగా 117 మిలియన్ల ప్రజలు ఖాళీ చేతులతో వలసలు వెళ్లినట్లు, ఆకలి చావుల అంచున దీన స్థితుల్లో బతుకులు ఈడుస్తున్నట్లు తేలింది. ప్రపంచవ్యాప్త 110కోట్ల పేదల్లో దాదాపు 40 శాతం వరకు, అనగా 455 మిలియన్ల ప్రజలు ఈ ప్రాంతాలకు చెందిన వారే అని పేర్కొనబడింది. వీటిలో 218 మిలియన్ల ప్రజలు యుద్ధ ప్రాంతాల్లో, 335 మిలియన్ల ప్రజలు ఘర్షణాత్మక ప్రాంతాల్లో, 375 మిలియన్లు అశాంతియుత సమాజ ప్రాంతాల్లో ఉన్నారని వివరించబడింది. 2023 నాటికి ఇజ్రాయిల్ దాడితో పాలస్తీనా గాజా ప్రాంత ప్రజలు 83 శాతం వలసల బాట పట్టారని, 60 శాతం వరకు ఇండ్లు నేల మట్టం అయ్యాయని స్పష్టం చేసింది. పేదరికానికి కారణాలను అధ్యయనం చేయడం, ఆయా కారణాలకు తగిన పరిష్కారాలకు పథక రచనల అమలు చేయడం, జీవన ప్రమాణాలను పెంచడం, గ్రామీణులకు కనీస వసతులు పెంచడం, పోషకాహార భద్రత కల్పించడం, నిలువ నీడను ఏర్పాటు చేయడం, పరిసరాల పరిశుభ్రతకు పెద్ద పీట వేయడం లాంటి చర్యలు ప్రపంచ పేదరికాన్ని, ముఖ్యంగా భారతదేశ పేదరికాన్ని అదుపు చేస్తాయని గమనించి ప్రభుత్వాలు, పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరుకుందాం. పేదరికం లేని ప్రపంచ కలలను సాకారం చేసుకుందాం. ●

# డీలిమిటేషన్‌పై అఖిలపక్షం జరపండి

## - ప్రధాని మోడీకి కాంగ్రెస్ చీఫ్ ఖర్గే లేఖ

## - పార్లమెంట్ ప్రోరోగ్ జాప్యంపై అసహనం



**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాశారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)కు సంబంధించి ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలను పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు, వాటిపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. శుక్రవారం ఈ మేరకు ప్రధాని మోడీ లేఖ రాశారు. ఆగస్టు 13న పార్లమెంటు వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడినప్పటికీ, ఇప్పటివరకు ఉభయ సభలను అధికారికంగా ముగించకపోవడం (ప్రోరోగ్ చేయకపోవడం)పై ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలా జరగడం "అపూర్వమైన" (గతంలో ఎన్నడూ లేని) పరిస్థితి అని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ఎటువంటి రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకువచ్చే ముందైనా అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ, తాను ఏప్రిల్ 11న ప్రధానికి లేఖ రాశానని ఆయన గుర్తు చేశారు. "మీరు అలా చేయలేదు. ఆ తర్వాత, ఏప్రిల్ 14న రాత్రి వేళ బిల్లులను బహిర్గతం చేసి, ఏప్రిల్ 16న ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఫలితంగా, ఏప్రిల్ 17న లోక్‌సభలో ఆ రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ లభించలేదు" అని ఖర్గే పేర్కొన్నారు. "ఆ తర్వాత, జులై 16న, ఆగస్టు 27న, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ మీకు మళ్లీ లేఖలు రాశాను. ఇప్పుడు నాలుగోసారి ఈ అభ్యర్థన చేస్తున్నాను. పార్లమెంటులో చర్యలు తీసుకువచ్చే ముందు, మీ కొత్త ప్రతిపాదనలపై సమగ్ర చర్చ జరిపేందుకు దయచేసి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయండి. అన్ని రాజకీయ పార్టీలకు తమలో తాము చర్చించుకోవడానికి, ఇతర భాగస్వాములతో సంప్రదింపులు జరపడానికి తగిన సమయం లభించాల్సి ఉంది" అని ఆయన అన్నారు. "గతంలో మీరు చేసిన ప్రయత్నంలాగే, సుదూర పరిణామాలు కలిగిన రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేయాలని మరోసారి ప్రయత్నించకండి. అప్పట్లో ఆ ప్రయత్నానికి తగిన ఫలితమే దక్కింది" అని ఖర్గే హెచ్చరించారు. 'ఎక్స్'లో ఖర్గే ఆ లేఖను పోస్ట్ చేశారు.

# బంగ్లా తరహా పాలన కోసం కాంగ్రెస్ వ్యూహం

## రాజ్యాంగ సంస్థలను దెబ్బతీయడమే వారి లక్ష్యం: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**డెహ్రాడూన్, అక్టోబరు 16:** బంగ్లాదేశ్‌లో జరిగిన తరహాలో భారత్‌లోనూ పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామనే పేరుతో దేశంలో అరాచకాన్ని సృష్టించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని, రాజ్యాంగ సంస్థలను దెబ్బతీయడమే వారి లక్ష్యమని విమర్శించారు. శుక్రవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్, రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. దేశంలో ఇటీవలి పరిణామాలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని రాజ్‌నాథ్ అన్నారు. యువత శక్తిని దేశ అభివృద్ధికి వినియోగించ కుండా, రాజకీయ అస్థిరత సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పు తీసుకు రావాలని కాంగ్రెస్ నేతలు బహిరంగంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. వారి వ్యాఖ్యలను బట్టి ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరచడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. అధికారం కోసమే అరాచకాన్ని [illegible] ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నామని కాంగ్రెస్ చెబుతున్నా.. అసలు లక్ష్యం అధికారం చేజిక్కించుకోవడమేనని రాజ్‌నాథ్ ఆరోపించారు. పాలన మార్పు వంటి పదాలను ఉపయోగించడం వెనుక ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాజకీయ స్వార్థం కోసం దేశ ప్రయోజనాలను పక్కనపెడితే ప్రజాస్వామ్య చర్చలు వాస్తవాల ఆధారంగా కాకుండా మొండివైఖరి, దుష్ప్రచారానికి వేదికగా మారతాయని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం పేరుతో అరాచకాన్ని సృష్టించడానికి, రాజ్యాంగ సంస్థలపై దాడులకు, దేశాభివృద్ధికి ఆటంకం కలిగించడానికి ఎవరికీ హక్కు లేదని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు. [illegible] శాంతిభద్రతలను కాపాడుకోవాలని, రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీయకూడదని సూచించారు. ప్రజా తీర్పును గౌరవించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. [illegible] పేరుతో రాజకీయ గందరగోళం సృష్టించడం మానుకోవాలని రాహుల్‌కు హితవు పలికారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని గుర్తుచేస్తూ కాంగ్రెస్ గతంలోనూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీసిందని రాజ్‌నాథ్ విమర్శించారు. 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ, 1984లో సిక్కులపై జరిగిన హింస, 1990లో కరసేవకుల హత్యలకు సంబంధించిన పరిణామాలను ప్రస్తావించారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ వైఖరిలో మార్పు లేదని ఆరోపించారు. 1975లో ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యాన్ని జైల్లో పెట్టారు. ఇప్పుడు రాహుల్ గాంధీ జేబులో రాజ్యాంగాన్ని పెట్టుకుని అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుందని కూడా ఆయన ఆరోపించారు. 1993లో ఎన్నికల కమిషనర్ల నియామకం, అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ ఎన్నికల కమిషనర్ నవీన్ చావ్లాపై చేసిన ఆరోపణలను ప్రస్తావించారు. చావ్లా కాంగ్రెస్ నేతలకు ఎన్నికల సంఘానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని చేరవేశారని శేషన్ ఆరోపించినట్లు పేర్కొన్నారు.

# పోటీకి జియో ఎప్పుడూ సిద్ధమే!

## ఎలాన్ మస్క్ విమర్శలపై స్పందించిన రిలయన్స్

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవల్లో స్టార్‌లింక్ సహా ఏ సంస్థతోనైనా పోటీకి సిద్ధంగా ఉన్నామని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది. భారతీయ, విదేశీ సంస్థలన్నింటికీ దేశంలో ఒకే విధమైన నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. స్టార్‌లింక్ భారత్‌లో ప్రవేశించేందుకు ఎదురవుతున్న నియంత్రణపరమైన అడ్డంకులపై ఎలాన్ మస్క్ విమర్శలు చేసిన నేపథ్యంలో రిలయన్స్ ఈ ప్రకటన చేసింది. భారత్‌లో పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలను స్వాగతించే వాతావరణం ఉందని రిలయన్స్ పేర్కొంది. అయితే దేశ చట్టాలు, విధానాలకు లోబడి ప్రతి సంస్థ పనిచేయాల్సిందేనని స్పష్టం చేసింది. భారత ప్రభుత్వ విధానం ప్రకారం దేశీయ, విదేశీ సంస్థలకు ఒకే విధమైన ప్రక్రియ వర్తిస్తుందని తెలిపింది. జియో ఉపగ్రహ సేవలకు సైతం ఇంకా అనుమతులు రావాల్సి ఉందని వెల్లడించింది. పోటీకి తాము ఎప్పుడూ భయపడలేదని, వినియోగదారులకు మెరుగైన సేవలు ఎవరు అందిస్తున్నారో నిరూపించుకునేందుకు పోటీనే సరైన పరీక్ష అని రిలయన్స్ పేర్కొంది. 2016లో టెలికాం రంగంలోకి అడుగుపెట్టినప్పుడు జియోకు ఒక్క వినియోగదారుడు కూడా లేదని గుర్తుచేసింది. పదేళ్లలో 53 కోట్లకు పైగా వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించామని, ప్రపంచంలోనే అత్యంత అందుబాటు ధరల్లో డేటా సేవలను, మెరుగైన డిజిటల్ మౌలిక సదుపాయాలను అందిస్తున్నామని తెలిపింది.

# గాల్లో ఎగురుకుంటూ ఇంటినుంచి ఆఫీసుకు!



**ప్యూబ్లో, కొలరాడో, అక్టోబరు 16:** ఆఫీసు డ్యూటీకి వెళ్లాలంటే ఎదురవుతున్న ట్రాఫిక్‌జామ్‌లనుంచి పరిష్కారంగా అమెరికాలోని ఓ వ్యక్తి ఈ ట్రాఫిక్ గందరగోళంతో సంబంధం లేకుండా నేరుగా గాల్లోంచి తన ఆఫీస్‌కు చేరుకుంటున్నాడు. విమానంలో కాదు, తన వీపునకు కట్టుకున్న ఓ చిన్న మోటార్ సాయంతో ఆయన చేసే ఈ ప్రయాణం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. అమెరికాలోని కొలరాడో రాష్ట్రం ప్యూబ్లో నగరానికి చెందిన 28 ఏళ్ల జాకబ్ హాట్లర్ వృత్తిరీత్యా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్. ఆయన తన ఇంటి నుంచి ఆఫీస్‌కు వెళ్లేందుకు ఎంచుకున్న మార్గం అందరి కంటే భిన్నం. రోజూ తన అపార్ట్‌మెంట్ బయట ఉన్న రోడ్డుపై పారాగ్లైడర్ రెక్కను పరిచి, దానికి అమర్చిన మోటరైజ్డ్ ప్రొపెల్లర్ బ్యాక్‌ప్యాక్‌ను (పారామోటార్) స్టార్ట్ చేస్తాడు. కొద్ది దూరం పరుగెత్తి గాల్లోకి లేచి, పొలాలు, హైవే మీదుగా సుమారు 20 నిమిషాల పాటు ప్రయాణిస్తాడు. గంటకు 56 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించి, తను పనిచేసే ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండ్ అవుతాడు. చిన్నప్పటి నుంచి విమానాలంటే ఇష్టం ఉన్న జాకబ్‌కు పైలట్ లైసెన్స్ కూడా ఉంది. ఈ ప్రయాణం ప్రారంభించడానికి ముందు ఆయన తన పై అధికారుల నుంచి ప్రత్యేక అనుమతి తీసుకున్నాడు. గాల్లోకి లేచినప్పటి నుంచి ల్యాండ్ అయ్యే వరకు ఎయిర్‌పోర్ట్ కంట్రోల్ టవర్‌తో నిరంతరం టూవే కమ్యూనికేషన్‌లో ఉంటాడు. ఎందుకంటే, రాడార్లకు ఈ చిన్న పరికరం కనిపించే అవకాశం తక్కువ. వాతావరణం అనుకూలించినప్పుడు, గత జూన్ నుంచి వారానికి ఒకసారి ఇలాగే ఆఫీస్‌కు వెళుతున్నాడు. ఈ ప్రయాణానికి సిద్ధమవ్వడానికి పట్టే సమయాన్ని కూడా కలిపితే, కారులో వెళ్లడం కంటే వేగమేమీ కాదని జాకబ్ చెబుతున్నాడు. సమయం ఆదా కోసం కాదు, ఈ ప్రయాణంలో లభించే స్వేచ్ఛ, గాల్లోంచి కనిపించే దృశ్యాలు, నచ్చిన సంగీతం వింటూ ప్రయాణించడం కోసం ఇలా వెళుతున్నానని ఆయన వివరించారు. ఇటీవల తన ప్రయాణానికి సంబంధించిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా అది వైరల్‌గా మారింది. నెటిజన్లు ఏరియల్ ట్రాఫిక్, ఇంధన ఖర్చులు అంటూ సరదాగా కామెంట్లు చేస్తున్నారు.

# మహిళా అధికారిని షటప్ అన్న సీనియర్ ఐఏఎస్

**శ్రీనగర్, అక్టోబరు 16:** జమ్ముకశ్మీర్‌లో ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. వర్చువల్ సమీక్షా సమావేశంలో ఓ మహిళా ఉన్నతాధికారిపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా, ఆమెను అవమానకరమైన పదజాలంతో దూషించి, సస్పెన్షన్ ఆదేశాలు జారీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సంభాషణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్మిక మరియు ఉపాధి శాఖ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి కుమార్ రాజీవ్ రంజన్ అక్టోబర్ 14న మిషన్ యువ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో లేబర్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ బనీశ్ వానీ వర్చువల్‌గా పాల్గొన్నారు. కార్యక్రమంలో జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ పాత్రపై చర్చ జరుగుతున్నప్పుడు వివాదం మొదలైంది. ఎన్నార్ఎల్ఎం కేవలం సహాయక సాధనం మాత్రమేనని, దానికి సొంత అధికారాలు ఉండవని రంజన్ అన్నారు. లక్ష్యాలు పూర్తయ్యాయని, ఎన్నార్ఎల్ఎం సహకారం అవసరమని బనీశ్ వానీ వివరించడానికి ప్రయత్నించగా, రంజన్ ఒక్కసారిగా ఆగ్రహంతో "షటప్, మాట్లాడొద్దు" అంటూ ఆమెపై కేకలు వేశారు. బనీశ్ వెనక్కి తగ్గకుండా తన వాదన వినిపించే ప్రయత్నం చేయడంతో రంజన్ మరింత రెచ్చిపోయారు. నాతో మాట్లాడేంత ధైర్యం నీకెలా వచ్చింది ప్రశ్నిస్తూ, ఆమెను ఉద్దేశించి ఓ అవమానకరమైన పదం వాడారు. వెంటనే ఆమె సస్పెన్షన్ ఆర్డర్ సిద్ధం చేయాలని కిందిస్థాయి అధికారిని ఆదేశించారు. అంతేకాదు, సదరు మహిళా ఉన్నతాధికారిని ఉద్దేశించి "గెటవుట్" అంటూ ఆయన గట్టిగా అరిచారు. దీనికి బనీశ్ అంతే ధీటుగా బదులిచ్చారు. "మీరు నన్ను సస్పెండ్ చేసుకోండి" అని స్పష్టం చేస్తూ, "టు హెల్ విత్ యూ" అంటూ సమావేశం నుంచి నిష్క్రమించారు. ఘటన వీడియో వైరల్ కావడంతో రాజకీయ దుమారం రేగింది.

# భర్త హత్యకేసులో భార్య, ప్రియుడికి మరణశిక్ష



**మీరట్, అక్టోబరు 16:** భర్తను హత్య చేసిన భార్యకు, ఆమె ప్రియుడికి జిల్లా కోర్టు మరణశిక్ష విధించింది. ఈ మేరకు శుక్రవారం మీరట్ జిల్లా కోర్టులో అడిషనల్ జడ్జి 12 అయిన జైవీర్ సింగ్ నగర్ శిక్ష ఖరారు చేశారు. ఉత్తర ప్రదేశ్, మీరట్‌లో ఈ తరహా శిక్ష ఖరారు కావడం రెండు రోజుల్లో ఇది రెండోది. మొదటి కేసులో కూడా భర్తను హత్య చేసినందుకు భార్య, ఆమె ప్రియుడికి మరణశిక్ష విధించింది మీరట్ జిల్లా కోర్టు. తాజా కేసులో మృతుడు అమిత్ కశ్యప్ కాగా అతడిని భార్య రవిత, ఆమె ప్రియుడు అమర్‌దీప్ కలిసి హత్య చేశారు. గత ఏడాది ఏప్రిల్ 17న అమిత్ కశ్యప్‌ను అతడి భార్య రవిత, ఆమె ప్రియుడు అమర్‌దీప్ కలిసి గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం అతడిని పాము కరవడం వల్లే చనిపోయాడని నమ్మించారు. ఈ విషయం అందరూ నమ్మేలా బెడ్ పక్కన ఒక పామును కూడా వదిలిపెట్టారు. అతడు పాముకాటు వల్ల చావలేదని పోస్టుమార్టంలో తేలింది. అతడి ఒంటిపై పాము కాటు గాయాల్లేవని వైద్యులు అన్నారు. గొంతు నులమడం వల్లే అతడు మరణించాడని కూడా వైద్యులు ధృవీకరించారు. దీంతో పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి విచారణ జరపగా రవిత, అమర్‌దీప్ వ్యవహారం బయటపడింది. వారే హత్య చేసినట్లుగా తేలింది. దీనిపై స్థానిక జిల్లా అడిషన్ కోర్టు12లో విచారణ జరిగింది. దీనిపై విచారణ జరిపిన పోలీసులు 60 రోజుల్లోనే చార్జిషీటు దాఖలు చేశారు. ఇంతకాలం కోర్టులో విచారణ జరగగా పలువురు సాక్షులను విచారించి, ఇద్దరూ హత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. దీనిపై శుక్రవారం కోర్టు తీర్పు వెల్లడించింది. నిందితులు ఇద్దరూ వేర్వేరు జైళ్ల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి వారి నేరం, శిక్ష గురించి ప్రశ్నించారు. తాము చేసిన పనికి పశ్చాత్తాప పడుతున్నామని చెప్పారు. కోర్టు ఏ శిక్ష వేసినా చట్టపరంగా అనుభవించడానికి తాను సిద్ధమేనని రవిత తెలిపింది. తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, వారి బాధ్యతను ఇతరులు చూసుకుంటారని కోర్టుకు తెలిపింది.

# భర్త నుంచే నాకు ప్రాణహాని ఉంది!

## ఉత్తరాఖండ్ మంత్రి పోలీసులకు ఫిర్యాదు



**డెహ్రాడూన్, అక్టోబరు 16:** ఉత్తరాఖండ్ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి రేఖా ఆర్య తన భర్త గిరిధారి లాల్ సాహుపై సంచలన ఆరోపణలు చేశారు. తనపై గృహ హింసకు పాల్పడుతున్నారని, ప్రాణహాని ఉందని, తనను హత్య చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపిస్తూ డెహ్రాడూన్‌లోని కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భర్తపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు. తన మైనర్ పిల్లల భద్రతపై కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మంత్రి రేఖా ఆర్య ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇటీవల తనకు లభించిన ఒక ఆడియో రికార్డింగ్ తనను తీవ్రంగా కదిలించిందని, తన వైవాహిక జీవితంలోని నిబద్ధతను ప్రశ్నించేలా చేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఆడియో విన్న తర్వాత నా పిల్లల భద్రత, రక్షణ కోసం ఈ బాధాకరమైన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. మహిళలు సామాన్యులైనా, ప్రముఖులైనా గృహ హింసను సహించవద్దు. దానిపై గళం విప్పాలని ఆమె పిలుపునిచ్చారు. తాను వ్యక్తిగతంగా బాధలో ఉన్నప్పటికీ, రాజ్యాంగబద్ధంగా తన విధులను నిర్వర్తిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రేఖా ఆర్య పలు కీలక విషయాలను ప్రస్తావించారు. తనకు 2004లో గిరిధారి లాల్ సాహుతో వివాహం జరిగిందని, అయితే అప్పటికే అతనికి పెళ్లై పిల్లలు ఉన్న విషయాన్ని దాచిపెట్టి తనను మోసం చేశారని ఆరోపించారు. ఈ విషయం చాలా ఏళ్ల తర్వాత తెలిసిందని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మౌనంగా ఉన్నానని తెలిపారు. ఇటీవల కాలంలో భర్త ప్రవర్తన మారిపోయిందని, ఇతర మహిళలతో సంబంధాలు పెట్టుకున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై నిలదీయడంతో తనపై శారీరకంగా దాడి చేసి, దుర్భాషలాడి, చంపుతానని బెదిరించారని పేర్కొన్నారు. ఓ మహిళతో మాట్లాడుతూ తనను హత్య చేసేందుకు భర్త కుట్ర పన్నుతున్నట్లుగా ఉన్న ఆడియో రికార్డింగ్ తనకు లభించిందని రేఖా ఆర్య ఫిర్యాదులో తెలిపారు.

కంపెనీ డైరెక్టర్ పదవి నుంచి తాను వైదొలిగినట్లు తన సంతకాలను ఫోర్జరీ చేసి డాక్యుమెంట్లు సృష్టించారని కూడా ఆరోపించారు. ఈ ఆడియో, బెదిరింపుల నేపథ్యంలో తన ప్రాణాలకు, పిల్లల భద్రతకు తీవ్ర ముప్పు ఉందని, తన భర్త ఎప్పుడైనా ప్రమాదకర ఘటనకు పాల్పడవచ్చని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

# గ్యాంగ్ రేప్ కేసులో మహిళపైనా అభియోగాలు చేయొచ్చు!

## ఢిల్లీ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,అక్టోబరు 16:** సామూహిక అత్యాచారం (గ్యాంగ్ రేప్) కేసులో ఓ మహిళ నేరుగా శారీరకంగా పాలుపంచుకోకపోయినా, ఆ నేరానికి పాల్పడిన బృందంలో భాగమై ఉన్నా లేదా ఉమ్మడి ఉద్దేశంతో వ్యవహరించినా ఆమెపైనా అభియోగాలు నమోదు చేయవచ్చని ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఐపీసీ సెక్షన్ 376డి, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 70 కింద మహిళను కూడా నిందితురాలిగా చేర్చవచ్చని స్పష్టం చేసింది. జస్టిస్ అనూప్ జైరాం భంభానీ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఈ తీర్పును వెలువరించింది. ఓ మహిళ, మరో నిందితుడిపై నమోదైన అభియోగాలను సవాలు చేస్తూ దాఖలైన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌ను కొట్టివేసింది. సామూహిక అత్యాచారానికి సంబంధించిన చట్టాల్లో ఉపయోగించిన వ్యక్తులు అనే పదాన్ని కేవలం పురుషులకు మాత్రమే పరిమితం చేయలేమని, దాన్ని లింగ రహితంగా చూడాలని కోర్టు అభిప్రాయపడింది. అత్యాచారం చేసినట్లుగా భావించాలి అనే వాక్యం, బృందంలోని ప్రతి సభ్యుడు నేరుగా నేరంలో పాల్గొనాల్సిన అవసరం లేదన్న శాసనసభ ఉద్దేశాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొంది. జులై 2024లో భల్స్వా డెయిరీ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు విచారణ సందర్భంగా ఈ తీర్పు వెలువడింది. తన మైనర్ కుమార్తెను ఓ సహ నిందితుడితో లైంగిక సంబంధం పెట్టుకోవాలని ఓ మహిళ (తల్లి) బెదిరించి, బలవంతం చేసిందని ప్రాసిక్యూషన్ ఆరోపించింది.

# ఉక్రెయిన్ అధ్యక్షుడిగా జెలెన్‌స్కీ పనికిరాడు

## మండిపడిన డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్, అక్టోబరు 16:** ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. యుద్ధాన్ని ముగించడానికి జెలెన్‌స్కీ సుముఖంగా లేరని.. అందువల్లే రష్యాపై దాడులు కొనసాగిస్తున్నారని విమర్శించారు. అమెరికాతో డీల్ చేసుకోవడానికి ఆయన సరైన వ్యక్తి కారని అన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడిగా ఆయన ఇక ఎంతమాత్రం పనికిరారని.. కొత్త వ్యక్తిని ఎన్నుకోవడం ఉత్తమమని ఆ దేశ ప్రజలకు సూచించారు. శాంతి చర్చలు, రాజీ యత్నాలంటూ బయటకు చెబుతారు కానీ.. లోపల మాత్రం యుద్ధం కొనసాగించాలనే ఆయన కోరుకుంటారన్నారు. జెలెన్‌స్కీ వల్లే ఆ దేశం నాశనం అవుతోందని దుయ్యబట్టారు. మరోవైపు 2014లో రష్యా క్రిమియాను స్వాధీనం చేసుకోవడాన్ని తప్పుబట్టారు. ఈ యుద్ధం కొనసాగింపునకు గత ఒబామా, బైడెన్ ప్రభుత్వాలు అందించిన సాయంపై కూడా విమర్శలు చేశారు. రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారంపై ఉక్రెయిన్ దాడి.. రష్యాలోని ర్యాజాన్ ప్రాంతంలో ఉన్న చమురు శుద్ధి కర్మాగారంపై ఉక్రెయిన్ గురువారం డ్రోన్ దాడులకు పాల్పడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మరోవైపు మధ్య ఉక్రెయిన్‌లోని కిరోవోగ్రాడ్ ప్రాంతంపై మాస్కో విరుచుకుపడడంతో ముగ్గురు మరణించగా.. ఆరుగురు గాయపడ్డారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య తక్షణమే ఇంధన వనరుల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిందని ట్రంప్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది వెలువడి వారం పూర్తి కాకముందే ఇరు దేశాలు దాడులకు పాల్పడుతుండడం గమనార్హం.

# సంక్షిప్త వార్తలు

## తుదిదశకు చేరిన భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం చర్చలు



**బ్యాంకాక్, అక్టోబరు 16:** భారత్ అమెరికా మధ్య ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అమెరికాతో జరుగుతున్న చర్చలు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న ఐఎంఎఫ్‌ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో భాగంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి దశ ఇప్పటికే ఖరారైందని, ప్రస్తుతం దీనికి సంబంధించిన న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్ట్) సిద్ధం చేస్తున్నట్లు నిర్మల తెలిపారు.

## చిన్నారుల భద్రతపై కేంద్రానికి సుప్రీం నోటీసులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకు సమగ్రమైన, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంపై ఈరోజు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. ది ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్, దాని డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వాడకానికి కనీస వయసు నిబంధనలు, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించే మార్గదర్శకాలు రూపొందించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు.

## త్విషాశర్మ కేసు ఢిల్లీకి మార్చాలన్న పిటిషన్‌పై సుప్రీం నోటీసులు



**భోపాల్, అక్టోబరు 16:** సంచలనం సృష్టించిన త్విషా శర్మ మృతి కేసును విచారిస్తున్న సీబీఐకి, అలాగే కీలక నిందితులుగా ఉన్న త్విష భర్త సమర్థ్ సింగ్, అతడి తల్లి గిరిబాలా సింగ్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు విచారణను భోపాల్ నుంచి ఢిల్లీకి మార్చాలంటూ త్విషా శర్మ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం ఈ నోటీసులు జారీ చేసింది. త్విష తండ్రి పిటిషన్‌పై స్పందన తెలియజేయాల్సిందిగా కోర్టు కోరింది. ఇదే సమయంలో కేసు విచారణపై కోర్టు మధ్యంతర స్టే విధించింది.

## కేరళ మాజీ సిఎం పినరయి విజయన్‌కు ఇడి నోటీసులు!

**తిరువనంతపురం, అక్టోబరు 16:** కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌కు ఈడీ షాకిచ్చింది. సీఎంఎల్ఆర్ మనీ లాండరింగ్ కేసులో నోటీసులు జారీ చేసింది. ఈనెల 23న విచారణకు హాజరు కావాలని ఈడీ ఆదేశించింది. మనీలాండరింగ్ కేసులో కేరళ హైకోర్టును ఈడీ ఆశ్రయించింది. దీనిపై స్పందించిన కోర్టు ఈ కేసులో మాజీ సీఎం విజయన్‌తోపాటు ఆయన కూతురు వీణా విజయన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేసు విచారణ కోసం కోచిలోని తమ కార్యాలయంలో ఈనెల 23న హాజరు కావాలని విజయన్‌ను ఈడీ ఆదేశించింది.

## వెండి, బంగారం ఎగుమతులపై సుంకం

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** బంగారం, వెండి ఆభరణాలతో పాటు ఇతర విలువైన లోహ ఉత్పత్తుల ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం డ్యూటీ డ్రాబ్యాక్ రేట్లను తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ రోజు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయంతో నగల ఎగుమతిదారుల లాభాలపై కొంత ప్రభావం పడే అవకాశం ఉంది. తాజా సవరణ ప్రకారం

బంగారం ఆభరణాల ఎగుమతిపై డ్యూటీ డ్రాబ్యాక్ గ్రాముకు రూ. 1,851.99 నుంచి రూ. 1,794.11కి తగ్గింది.

# సెంట్రల్‌పార్కు మూసివేతపై పిటిషన్ - విచారణకు తిరస్కరించిన సుప్రీం బెంచ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతిపాదించిన లెహ్రా దో తిరంగా నిరసన కార్యక్రమం కారణంగా ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సెంట్రల్ పార్క్‌ను మూసివేయడాన్ని వ్యతిరేకిస్తూ వ్యాపారులు దాఖలు చేసిన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ మూసివేత వల్ల చిన్న వ్యాపారులపై పడే ప్రభావం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పరిణామంతో తమకు రోజుకు సుమారు రూ. 200 కోట్ల నష్టం వాటిల్లుతోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ కిరాణా కమిటీ, ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశాయి. పిటిషనర్ల తరఫున న్యాయవాది జై అనంత్ దేహద్రాయ్ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ముందు నేడు వాదనలు వినిపించారు. న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ) అర్ధరాత్రి వేళ పార్క్‌ను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసిందని, పండగ సీజన్‌లో ఈ నిర్ణయం వల్ల వ్యాపార కార్యకలాపాలు స్తంభించిపోయి, తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీజేఐ సూర్యకాంత్ ఈ విషయంలో సంబంధిత వర్గాలన్నింటిలోనూ మంచి ఆలోచన వస్తుందని మేము ఆశిస్తున్నాము. పండగ రోజుల్లో చిన్న దుకాణదారులు తమ జీవనోపాధిని ఎలా సంపాదించుకుంటారో మాకు తెలుసు. వారి కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలు, ఇబ్బందులు మాకు అర్థమవుతాయి" అని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో జస్టిస్ బాగ్చీ జోక్యం చేసుకుంటూ నిరసన తెలిపే హక్కు, శాంతిభద్రతల పరిరక్షణ, వ్యాపారం చేసుకునే హక్కు పరస్పరం ముడిపడి ఉంటాయని అన్నారు. ఒకవేళ ప్రభుత్వం విధించిన ఆంక్షలు అహేతుకమైనవని, వాటి వల్ల వ్యాపారులకు చట్టవిరుద్ధంగా నష్టం వాటిల్లిందని తర్వాత తేలితే, రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక




అధికారాలను ఉపయోగించి కోర్టు నష్టపరిహారం ఇప్పించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో సంబంధిత పిటిషన్లు విచారణలో ఉన్నాయి. దసరా సెలవుల అనంతరం, అక్టోబర్ 26 లేదా 27 తేదీల్లో ఈ పిటిషన్‌పై విచారణ జరిపే అవకాశం ఉంది.



శుక్రవారం గాంధీభవన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధత సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకొంటే చట్టసభల్లో వినిపించనున్న మేధావుల గొంతు

## సామ రాంమోహన్‌రెడ్డి విజయం కోసం పట్టభద్రులు ప్రతిన పూనాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** పట్ట భద్రులు ఓటరుగా నమోదు చేసుకొంటేనే మేధా వుల గొంతు చట్టసభల్లో బలంగా వినిపిస్తుందని నిరుద్యోగ యువత, ఉద్యోగ ఉపాధ్యాయ, ఇంజినీరు, డాక్టర్, లాయర్, ఆడిటింగ్, ఇతర వైట్‌కాలర్ వృత్తుల వారి సం క్షేమం కోసం చట్టలా రూపకల్పనకు దోహదం పడుతోందని రాష్ట్ర రవాణ,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం గాంధీ భవన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సన్నద్ధత సమావేశం జరిగింది. ఎఐసిసి ఇంచార్జి సెక్రటరీ సచిన్ సావంత్, డిసిసి అధ్యక్షులు మోత రోహిత్, దీపక్ జాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్ , రాష్ట్ర గ్రంథాల సంస్థ చైర్మన్ రియాజ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్ల హుస్సేన్,15 నియోజకవర్గాల ఇన్‌చార్జులు, పిసిసి కోఆర్డినేటర్ లుపాల్గొన్నారు. పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదుకు తీసుకోవాల్సిన చర్యలు ఆయన వివరించారు. పట్టభద్రుల గుర్తింపు తదితర అంశాలపై నేతలకు దిశా నిర్దేశం చేశారు. 2023 అక్టోబర్ 31 కి ముందు పట్టభద్రులైన వారు ఓటరు గా నమోదు చేసుకునే అవకాశం ఉండడం తో బూత్ స్థాయి నుండి పట్టభద్రుల ను గుర్తించి ఓటరు నమోదు చేయడానికి పార్టీ నేతలు ఆక్టివ్ గా పని చేసేలా తీసుకోవడానికి తీసుకోవలసిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్బంగా పొన్నం విలేఖరులతో మాట్లాడుతూ హైదరాబాద్ జంట నగరాల్లో ఉన్న పట్టభద్రులందరూ వెంటనే తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఏకగ్రీవంగా విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పట్టభద్రులను కలిసి ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలనీ కాంగ్రెస్ కార్యకర్తలకు ఉద్బోదిం చానని తెలిపారు.. పతి శాసనసభ నియోజకవర్గం పరిధిలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్ర మాన్ని విస్తృతంగా చేపట్టాలని నిర్ణయించామనీ తెలిపారు.కోర్టులు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఇతర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న పట్టభద్రులను సంప్రదించి వారి ఓటు హక్కు నమోదు చేసుకునేలా కార్యాచరణ రూపొందించు కోవాలనీ ఆయన కోరారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, పట్టభద్రుల సమస్యలను శాసన మండలిలో బలంగా వినిపించడానికి పట్టభద్రుల ఓటు హక్కు ఎంతో కీలకమనీ అన్నారు.ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, న్యాయవాదుల సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలు, ఉద్యోగ ఖాళీల భర్తీ వంటి పట్టభద్రులకు సంబంధించిన అంశాలపై ప్రజాపాలన ప్రభుత్వం పనిచేస్తోందనీ భరోసా ఇచ్చారు.పట్టభద్రుల సమస్యలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా సామా రామమోహన్ రెడ్డి ని పట్టభద్రుల ఎమ్మెల్సీ గా గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించామనీ అన్నారు.ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నేపథ్యంలో పట్టభద్రులు తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలనీ ఆయన కోరారు.తెలంగాణలో పట్టభద్రుల భవిష్యత్తు, వారి హక్కులు, సమస్యల పరిష్కారానికి తమ విలువైన ఓటును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరుతున్నామనీ తెలిపారు.హైదరాబాద్‌లోని పట్టభద్రులందరూ వెంటనే తమ ఓటు హక్కును నమోదు చేసుకుని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలనీ కోరారు.



వేపకాయల బతుకమ్మల ఆటాపాటలతో దత్తాత్రేయ, వి.హనుమంతరావు, శ్రీనివాస్‌గౌడ్, నరసింహారెడ్డి తదితర రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం మహిళలు, యువత, చిన్నారులు తదితరులు

# తెలంగాణ మహిళల జీవన ప్రతిబింబం బతుకమ్మ

## మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

### యువత, మహిళలు, చిన్నారులతో చేతులు కలిపి ఆడిపాడిన ప్రముఖులు విహెచ్, జాజుల, బొంతు శ్రీదేవి, జూపల్లి సుజన, శేఖర సగర

### హోరెత్తిన వేపకాయల బతుకమ్మ సంబురాలు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 16, ప్రభాతవార్త :** బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజలు, మహిళల జీవన ప్రతిబింబమని హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల పూర్వ గవర్నరు బండారు దత్తాత్రేయ అన్నారు. రవీంద్రభారతి ప్రాంగణంలో ఉవ్వెత్తిన మహిళలు, చిన్నారులు, యువతతో చేతులుకలిపి ఆడిపాడిన ప్రముఖులు వి.హనుమంతరావు, జాజుల శ్రీనివాస్‌గౌడ్, బొంతు శ్రీదేవి, జూపల్లి సుజన, శేఖరసగర తదితర నాయకులు సంప్రదాయ తీన్మార్ పాటలు ఆటలతో హోరెత్తించడం విశేషం. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో బతుకమ్మ పండుగకున్న విశిష్టత, ప్రాధాన్యతను కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, సిబ్బంది పర్యవేక్షణలో రవీంద్రభారతిలో ఈ నెల 10 నుండి 9రోజులపాటు నిర్వహింపబడుతున్న బతుకమ్మ సంబరాలు-2026లో 7వరోజు శుక్రవారం రాత్రి వేపకాయల బతుకమ్మ సంబరాలు కనువిందు చేశాయి. తెలంగాణ రాష్ట్ర మహిళా బిసి సంక్షేమ సంఘం నేతృత్వంలో పెద్దసంఖ్యలో విచ్చేసి వేపకాయల బతుకమ్మలను పేరొకతీరునపేర్చి వేపకాయల ఆకారంలో ముద్దలుచేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో బతుకమ్మల చుట్టూ ధూందాం ఆట పాటలతో తిరుగుతూ రవీంద్రభారతి ప్రాంగణాన్ని ఉవ్విళ్లూరించారు. రేపు 17 శనివారం 8వరోజు రాత్రి తెలంగాణ రెడ్డి సేవాసమితి వసంత నేతృత్వంలో వెన్నెముద్దల బతుకమ్మను ఆటలు, పాటలతో మహిళలు సంబరాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి తెలిపారు.

# రాష్ట్రంలో 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు

## రూ.425.50 కోట్ల అంచనా వ్యయం

## వాహనాల ఫిట్‌నెస్‌కు అత్యాధునిక సాంకేతికత

## స్పెషల్ పర్పస్ వెహికల్ వ్యవస్థ ఏర్పాటు

## రెండు దశల్లో అమలుకు రవాణా శాఖ నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించేందుకు రూ.425.50 కోట్ల వ్యయంతో 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల (ఎటిఎస్)ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. గతంలో ఒక్కో స్టేషన్‌కు రూ.8 కోట్ల చొప్పున మొత్తం రూ.296 కోట్లకు అనుమతులు మంజూరు చేయగా, పెరిగిన వ్యయం నేపథ్యంలో తాజాగా ఒక్కో స్టేషన్ వ్యయాన్ని రూ.11.50 కోట్లకు పెంపుదల చేసింది. ఈ మేరకు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా రాష్ట్రంలో ఈ ప్రాజెక్టును రెండు దశల్లో అమలు చేయనున్నారు. మొదటి దశలో రూ.172.50 కోట్ల వ్యయంగా 15 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తారు. అప్పటి జిల్లా ప్రధాన కార్యాలయాల్లో ఒక్కొక్కటి చొప్పున, గ్రేటర్ హైదరాబాద్ లేదా హెచ్‌ఎండీఏ పరిధిలో అదనంగా 4 స్టేషన్లను ఈ దశలో నిర్మిస్తారు. రెండో దశలో మిగిలిన 22 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.

ఒక్కో స్టేషన్‌కు రూ.11.50 కోట్ల చొప్పున ఈ దశకు రూ.253 కోట్లు కేటాయించారు. ఈ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ కోసం రవాణా శాఖ పరిధిలో స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పివి)ను ఏర్పాటు చేయనుంది. ఈ సంస్థ స్వయం ఆర్థిక నమూనాలో పనిచేస్తుంది. స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన నిధులను హడ్కో తదితర ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి రుణాల రూపంలో సమీకరించనుంది. వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలకు సంబంధించి వసూలు చేసే దరఖాస్తు రుసుము, పరీక్ష రుసుము, వినియోగదారు చార్జీలను ఎస్‌పివి నిర్వహించే ప్రత్యేక నిధిలో జమ చేస్తారు. ఈ నిధులను ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ఏర్పాటుకు, నిర్వహణకు తీసుకున్న రుణాల అసలు, వడ్డీ చెల్లింపులకే వినియోగించనున్నారు. కాగా, ఎస్‌పివి ఏర్పాటు, దాని కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన నిర్మాణం, విధానం, ఆర్థిక నమూనాను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని తెలంగాణ రవాణా కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

# తిరుగు ప్రయాణానికి భారీగా ప్రత్యేక సర్వీసులు

## 17, 18, 19 తేదీల్లో అదనపు బస్సులు

### జెబిఎస్‌లో ఏర్పాట్లు పరిశీలించిన ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** దసరా పండుగను పురస్కరించుకుని సొంత ఊళ్లకు వెళ్లేందుకు అలాగే తిరిగి రావడానికి భారీగా ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఎండి వై నాగిరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని జూబ్లీ బస్‌స్టేషన్‌లో బస్సుల నిర్వహణను శుక్రవారం ఆయన పరిశీలించారు. బస్‌ల ఏర్పాట్లు, సౌకర్యాలు, మౌలిక వసతుల గురించి ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరా పండుగకు ఊళ్లు వెళ్లే ప్రయాణీకుల సౌకర్యార్థం 7 వేల ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఇప్పటివరకు సుమారు 95 శాతం బస్సులను విజయవంతంగా నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చామని వెల్లడించారు. ఈ నెల 17, 18 తేదీల్లో ప్రయాణికుల రద్దీ చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, రద్దీకి అనుగుణంగా అవసరమైన ప్రాంతాల్లో అదనపు బస్సులను నడపాలని తెలిపారు. ప్రత్యేక బస్సుల నిర్వహణలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పండుగ ముగిసిన అనంతరం తిరిగి నగరాలకు చేరుకునే ప్రయాణికుల కోసం కూడా ఇదే తరహాలో ప్రత్యేక బస్సు సర్వీసులను సిద్ధం చేయాలని ఆదేశించారు. బస్ స్టేషన్లలో తాగునీరు, విశ్రాంతి వసతులు, పారిశుధ్యం, భద్రత విషయంలో లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రయాణికులు తమ ముందస్తు రిజర్వేషన్లను అధికారిక వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవాలని కోరారు. ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం మరియు వివరాల కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 04069440000, 04023450033 లను సంప్రదించాలని సూచించారు.

# గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయం: కెటిఆర్

**హైదరాబాద్,అక్టోబరు16: ప్రభాతవార్త:** రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలోని గ్రాడ్యుయేట్లు, విద్యావంతులు, నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీల్లో ఒక్కదానినీ అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారిని తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు రానున్న గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో విద్యావంతులు, నిరుద్యోగులు తమ ఓటు ద్వారా సమాధానం చెబుతారని అన్నారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతపై శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో కేటీఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు అత్యంత బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సన్నద్ధతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# వేషం మారెను, అయినా కెటిఆర్ భాష మార్చలేదు

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విసుర్లు

**హైదరాబాద్, అక్టోబరు 16,ప్రభాతవార్త:** కెటిఆర్ గడ్డం, మీసాలు పెంచి వేషం మార్చాడు కానీ భాష మాత్రం మార్చలేదు..రంగులు వేశాడు కానీ ఆయన అసలు రంగు మాత్రం మార్చుకోవడం లేదు అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. సిఎల్‌పిలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చూసి కాపీ కొట్టి గడ్డం, మీసాలు పెంచు కోవడం కాదు ఆయనలా దమ్ము, ధైర్యంతో ప్రజల పక్షాన నిలబడే కలేజా కావాలి అని హితవుచెప్పారు. కుటుంబ వారసత్వం తో అయ్య చాటు బిడ్డవు నువ్వు ఎదిగావు నువ్వెంత రంకెలు వేసినా జనం నిన్ను పట్టించుకోరనీ అన్నారు,నువ్వు గడ్డం, మీసాలు పెంచి గబ్బర్ సింగ్‌లా కనిపించాలని చూసినా నిన్ను గాబరా సింగ్‌లాగే చూస్తారనీ వివరించారు.నీకు దమ్ము, ధైర్యం ఉంటే 2014 నుంచి బొగ్గు ఒప్పందాలు, యాదాద్రి పవర్ ప్లాంట్ అక్రమాలపైన విచారణ కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాయి అని సవాల్ చేశారు. విచారణ గురించి మా ముఖ్యమంత్రి సవాల్ విసిరితే తెలంగాణ భవన్‌లో సన్నాయి నొక్కులు నొక్కుతున్నావు నీ ఉడత ఊపులకు భయపడటానికి ఇక్కడ ఉంది పిల్లి కాదు.. నల్లమల పులి అని అన్నారు. తెలంగాణ జనం ముందు మీ అక్రమాలు,పంచపాండవుల చెరువు నుంచి కెసిఆర్ ఫామ్‌హౌస్‌కు నీళ్లు ఎలా చేరుతున్నాయో మా సిఎం చెప్పారనీ ఆయన వివరించారు.ప్రజలను, రైతులను ఎలా ఆదుకోవాలని మా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే నువ్వు కాళ్లలో కట్టెలు పెడుతున్నావుఅని ఆవేదన చెందారు.

# యూరియా ఫ్యాక్టరీకి శాశ్వత పరిష్కారం



శుక్రవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో సమావేశమైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## మహానది బొగ్గు రాష్ట్రానికి కేటాయించాలి

## రాష్ట్ర ప్రయోజనాలపై 8 కీలక ప్రతిపాదనలు

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** రామగుండం ఎరువుల కర్మాగారంలో సాంకేతిక సమస్యలు తలెత్తి తరచూ ఉత్పత్తి నిలిచిపోతుండటంతో దాన్ని పరిష్కరించేందకు శాశ్వత పరిష్కారం చూపాలని కేంద్రాన్ని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో భేటీ అయి రాష్ట్రానికి సంబంధించి ఎనిమిది అంశాలను కేంద్రం దృష్టికి తీసుకొచ్చారు. కేంద్రం సహకారంతో పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపాలని, కీలక ప్రాజెక్టులకు వేగం పెంచాలని కోరారు. ఎరువుల ఫ్యాక్టరీ ఉత్పత్తి నిలిచిపోవడంతో రాష్ట్రంలో యూరియా సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, ముఖ్యంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎదురైన అంతరాయాలు రబీ సీజన్‌లో రైతులకు ఎరువుల లభ్యతపై ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. అలాగే కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.100 కోట్లు మంజూరు చేయాలన్నారు. ఇక యాదాద్రి విద్యుత్ కేంద్రానికి అవసరమైన బొగ్గును మహానది నుంచి కేటాయించాలన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో కీలకమైన ఈ కేంద్రానికి నిరంతరాయంగా బొగ్గు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణికి సత్తుపల్లి, సత్తుపల్లి బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని ప్రతిపాదించారు. కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కీలక రైల్వే ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా రైల్వే శాఖతో సమన్వయం చేయాలని చెప్పారు. సత్తుపల్లి-కొవ్వూరు, పెనుబల్లి-కొండపల్లి కొత్త రైల్వే లైన్లకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఇప్పటికే మంజూరైన పాండురంగాపురం-మల్కన్‌గిరి రైల్వే లైన్ పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యేలోగా అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ మార్గం పూర్తయితే గిరిజన, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల మంత్రులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# మేడిగడ్డ మరమ్మతులపై సిఎం రేవంత్‌రెడ్డి అనాసక్తి

## మాజీ ఇఎన్‌సి మురళీధర్‌రావు

## ఎక్స్ వేదికగా వ్యాఖ్యలు

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి మేడిగడ్డ బ్యారేజీ రిపేర్లకు ఆసక్తి చూపించడం లేదన్నారు. మాజీ ఇఎన్‌సి మురళీధర్ రావు ఎక్‌వేదికపై శుక్రవారం సంచలన వ్యాఖ్యల చేశారు. మేడిగడ్డ దగ్గర బాంబ్ పేలిన శబ్దం వచ్చింది దీని మీద ఇన్వెస్టిగేషన్ చేయండని కాంగ్రెస్ మంత్రుల సమక్షంలో గతంలో స్పష్టం చేశారు. మళ్ళీ ఆయన ఎక్స్‌వేదికపై ఇలా రాసుకొచ్చారు. అక్టోబర్ 21, 2023న మేడిగడ్డ ఏడవ బ్లాకు దగ్గర బాంబు పేలినట్లు పెద్దగా శబ్దం వచ్చింది. పెద్ద చప్పుడు రావడంతో బాంబు పేలిందని అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు కూడా ప్రాథమిక విచారణ చేశారని వెల్లడించారు. మట్టి, ఇసుక కుంగడం వల్ల ప్రమాదం జరిగితే స్తంభాలకు పగుళ్లు రావని నిపులుణులు చెబుతున్నారు.అసాంఘిక శక్తులు బ్యారేజీని కూల్చడానికి కుట్ర చేసినట్టు అప్పట్లో ఇంజినీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రాజకీయ కుట్రతోనే మేడిగడ్డ పిల్లర్లను బాంబుతో పేల్చారని బీఆర్ఎస్ నాయకులు సైతం మొదటి నుంచి ఆరోపణలు చేస్తున్నారు. కాగా, మురళీధర్ రావు వ్యాఖ్యలతో మేడిగడ్డపై బలపడుతున్న బీఆర్ఎస్ నేతల అనుమానాలు బలపడు తున్నాయి. ఇప్పటికైనా ఇకనైనా విచారణ చేయాలని ఆయన అభ్యర్థించారు.

# యాదాద్రి థర్మల్ స్టేషన్‌ను సందర్శించిన విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్ సందర్శించారు. థర్మల్ విద్యుత్ కేంద్రంలో లోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, క్రషర్ హౌస్, ట్రాక్ హాపర్, వ్యాగన్ టిప్లర్లు, జుబిసీలు, మార్షలింగ్ యార్డ్, తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్శన సందర్భంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ 5/800 మెగావాట్ల పనుల పురోగతిని సమీక్షించారు. జెన్కో, బిహెచ్ఇఎల్‌కు చెందిన ఇంజినీర్లతో కలిసి కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లోని సమస్యలను సమీక్షించారు. కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై బిహెచ్ఇఎల్ ఇంజినీర్లతో చర్చించారు. గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన సరిదిద్దే చర్యలను ప్రాధాన్యతా క్రమంలో చేపడతామని ఇంజనీర్లు హామీ ఇచ్చారు. కాగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 20,003 మెగావాట్లకు చేరుకుని, ఇది ఇప్పటివరకు నమోదైన అత్యధిక డిమాండ్ నిలిచిందని నవీన్‌మిట్టల్ అన్నారు. ప్రారంభ దశలో స్థిరీకరణకు సంబంధించిన సమస్యలు ఉన్నప్పటికీ, యాదాద్రి థర్మల్ ప్లాంట్లలోని నాలుగు యూనిట్ల నుంచి తొలిసారిగా 2,109 మెగావాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి నమోదైందన్నారు. విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరచేందుకు యూనిట్5 సింక్రొనైజేషన్ ను కూడా ఈ వారంలో చేపట్టేలా ప్రణాళిక రూపొందించారని చెప్పారు. ఈ పర్యటనలో జెన్కో సిఎండి డాక్టర్ ఎస్ హారీష్, డైరెక్టర్లు వై. రాజశేఖరరెడ్డి, బి. నాగ్య, బి. లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఘనంగా బతుకమ్మ యంగ్ ఫిల్మ్‌మేకర్స్ అవార్డ్స్ వేడుకలు



శుక్రవారం శిల్పకళా వేదికలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** శనివారం ఉదయం 11 గంటల నుండి హైదరాబాద్ శిల్పకళా వేదికలో.. బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ అవార్డ్స్-2026 వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. శిల్పకళా వేదికలో చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం ఉదయం ఆయన పరిశీలించారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్, తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి ముకుందరెడ్డి, క్రియేటివ్ డైరెక్టర్ కొండ రాజు, టీజి ఎఫ్‌డిసి ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ కిషోర్ బాబు, ఐ అండ్ పిఆర్ అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, యాంకర్ ఉదయభాను తదితరులు పాల్గొన్నారు. ఈ ఛాలెంజ్ 5 కేటగిరీల్లో ఎంపిక అయిన 35 మంది యంగ్ ఫిల్మ్ మేకర్స్‌కు అవార్డులు ముఖ్య అతిథులు అందజేస్తారు.

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెం కటరెడ్డిలు, రాష్ట్ర పర్యా టక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, ఐటి, పరిశ్రమలు, వాణిజ్య, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ప్రజా ప్రతినిధులు, సినిమా రంగ ప్రముఖులు, తదితరులు పాల్గొంటారు. బతుకమ్మ పండుగను పురస్కరిం చుకుని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2వ యంగ్ ఇండియా ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్ ఛాలెంజ్ -2026లో భాగంగా 5 కేటగిరీల పోటీలలో పాల్గొనేందుకు 2,670 మంది ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఎంట్రీల పరిశీలన, అవార్డులకు ఎంపికకు ప్రతి కేటగిరీకి ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. 1)ఫిల్మ్, 2)సాంగ్స్, 3)ఫోక్ సాంగ్స్, 4)ఇన్ఫ్లూయెన్సర్స్ కేటగిరీల్లో ప్రతి కేటగిరీలో మొదటి బహుమతిగా రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.2 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.1 లక్ష చొప్పున అందజేస్తారు. ఈ 4 కేటగిరీలో ప్రతి కేటగిరీలో 5 కన్సోలేషన్ బహుమతుల కింద ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున ఇస్తారు. అలాగే 5వ కేటగిరీ ఆర్టికల్స్ కేటగిరీ అవార్డ్స్ కింద ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.3 లక్షలు, రూ.2 లక్షలు, రూ 1 లక్ష చొప్పున అందజేస్తారు.

# రాష్ట్రంలో 41 బార్లకు ఏకంగా 8,770 దరఖాస్తులు

## హైదరాబాద్‌లో 14 బార్లకు 4,251 అప్లికేషన్లు

## మొయినాబాద్‌లో 2 బార్లకు 644 దరఖాస్తులు

## డ్రా తీసిన ఎక్సైజ్ శాఖ, రూ.87.71 కోట్ల ఆదాయం

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** తెలంగాణలో కొత్తగా కేటాయించనున్న 41 బార్ల లైసెన్సుల కోసం నిర్వహించిన లక్కీ డ్రా ప్రక్రియ పూర్త యింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 8,770 దరఖాస్తులు అందగా.. ఫీజుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రూ.87.71 కోట్ల ఆదాయం సమకూరింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పరిధిలోని 14 బార్ల కోసం భారీ సంఖ్యలో 4,251 దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన 27 బార్లకు 4,519 అప్లికేషన్లు అందాయి. మొయినాబాద్‌లో ఉన్న 2 బార్లకు ఏకంగా 664 దరఖాస్తులు రావడంతో అక్కడ పోటీ తీవ్రంగా కనిపించింది. మరోవైపు.. బోధన్‌లోని బార్‌కు కేవలం 19 దరఖాస్తులే వచ్చాయి. హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో వ్యాపార అవకాశాలపై మద్యం వ్యాపారులు ఆసక్తి చూపారు. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని 14 బార్లకు 4,251 దరఖాస్తులు రావడం పోటీ తీవ్రతను తెలియజేస్తోంది. ఐటీ కారిడార్లు, రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లో వ్యాపార అవకాశాలను దృష్టిలో పెట్టుకుని పలువురు లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం హైదరాబాద్ పరిధిలో నార్సింగిలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ సమక్షంలో డ్రా నిర్వహించగా.. ఇతర ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో లైసెన్సీలను ఎంపిక చేశారు. దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ నిర్వహించి లైసెన్సీల ఎంపిక చేపట్టారు. రాష్ట్రంలోని ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో కొత్తగా కేటాయించనున్న 27 బార్లకు 4,519 దరఖాస్తులు అందాయి. ఈ ప్రాంతాల్లోనూ లైసెన్సుల కోసం వ్యాపారులు పెద్ద సంఖ్యలో పోటీపడ్డారు. ఆయా జిల్లాల్లో జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో లక్కీ డ్రా నిర్వహించి లైసెన్సీలను ఎంపిక చేశారు. మొత్తం 41 బార్లకు వేల సంఖ్యలో దరఖాస్తులు రావడంతో లైసెన్సుల కేటాయింపు ప్రక్రియపై వ్యాపార వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

లక్కీ డ్రా ద్వారా ఎంపికైన వారికి నిబంధనల ప్రకారం బార్ లైసెన్సులు కేటాయించనున్నారు. ఫ్యూచర్ సిటీ పరిసర ప్రాంతాలకు దగ్గరగా ఉన్న మొయినాబాద్‌లో రెండు బార్ల కోసం 664 దరఖాస్తులు రావడం విశేషం. చేవెళ్లలోని ఒక బార్ కోసం 279 దరఖాస్తులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ ఎ రి ది. లో ని అలియాబాద్‌లో ఒక బార్‌కు 201 దరఖాస్తులు అందాయి. యెల్లంపేట్‌లో రెండు బార్ల కోసం 225.. మూడుచింతలపల్లిలో రెండు బార్లకు 112 అప్లికేషన్లు వచ్చాయి. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో రెండు బార్లకు 287 దరఖాస్తులు రాగా.. గడ్డపోతారంలో 112, కోహిర్‌లో 127 అప్లికేషన్లు వచ్చాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగులోని బార్‌కు 376 దరఖాస్తులు వచ్చాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 357, జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో 349, మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో 331, ఖమ్మం జిల్లా కల్లూరులో 325 దరఖాస్తులు నమోదయ్యాయి. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని బార్‌కు కేవలం 19 దరఖాస్తులే రావడం గమనార్హం. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోని బార్‌కు 27 దరఖాస్తులు వచ్చాయి. వికారాబాద్ జిల్లా పరిగిలో 36, మక్తల్‌లో 38 దరఖాస్తులు నమోదయ్యాయి. కొత్త బార్ లైసెన్సుల కోసం వచ్చిన దరఖాస్తుల ఫీజుల ద్వారానే రాష్ట్ర ప్రభుత్వానికి రూ.87.71 కోట్ల ఆదాయం వచ్చింది. లాటరీలో లైసెన్స్ దక్కని వారికి కూడా ఆ మొత్తం తిరిగి అందదు. వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం వల్ల ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరిగింది. లక్కీ డ్రా ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తయిందని ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి. హరికిరణ్ తెలిపారు. లైసెన్స్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన దరఖాస్తుదారులు, అధికారులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన లైసెన్సీలకు నిబంధనల ప్రకారం తదుపరి ప్రక్రియ పూర్తి చేయనున్నారు.



## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ దంపతులు

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** సీఎం రేవంత్ రెడ్డిని సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. నవంబర్ 21 న చెన్నైలో జరగనున్న కావ్య మారన్(ఎస్ఆర్‌హెచ్ ఓనర్), అనిరుధ్ రవిచందర్(మ్యూజిక్ డైరెక్టర్) వివాహ రిసెప్షన్ రిసెప్షన్‌కు రావాలని సీఎంను వారు ఆహ్వానించారు. కాగా, కెటిఆర్‌ను కూడా వీరు ఆహ్వానించారు.

## సైబర్ నేరగాళ్లకు మ్యూల్ బ్యాంకు ఖాతాలు సమకూర్చిన కేసులో నలుగురు అరెస్టు

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** అధిక లాభాల ఆశ చూపించి ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా ఓ మహిళ నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసిన కేసులో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా అధిక మొత్తంలో లాభాలు వస్తాయని ఆశ చూపించిన కొందరు దుండగులు.. ఓ మహిళ నుంచి రూ.37.40 లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారు. మహిళ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి మ్యూల్ బ్యాంకు ఖాతాలు, సిమ్‌కార్డులు, 9 మొబైల్ ఫోన్లు, 10 డెబిట్, క్రెడిట్ కార్డులు, 8 చెక్‌బుక్కులను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో మ్యూల్ ఖాతాపై రూ.10 వేల కమీషన్ ఆశ చూపించి.. సైబర్ నేరగాళ్లకు వీటిని అందిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దేశవ్యాప్తంగా ఈ ముఠాపై 54 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ మొత్తం కేసులలో సుమారు రూ. 10 కోట్ల మోసపూరిత లావాదేవీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

## పాకిస్థాన్ శరణార్థులు 319 మందికి భారతీయ పౌరసత్వం

### ఉద్వేగంతో శరణార్థుల ఆనందబాష్పాలు

**రాజ్‌కోట్, అక్టోబరు 16:** పాకిస్థాన్ నుంచి వలస వచ్చి గుజరాత్‌లో తలదాచుకున్న 319 మందికి ఎట్టకేలకు భారతీయ పౌరసత్వం లభించింది. ఏళ్ల తరబడి పడిన నిరీక్షణ ఫలించడంతో ఆ కుటుంబాలన్నీ తమ జీవితంలో కొత్త అధ్యాయం మొదలైందని ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం హర్ష్ సంఘ్వీ లబ్ధిదారులకు పౌరసత్వ ధ్రువపత్రాలను అందజేశారు. రాజ్‌కోట్‌లోని ప్రముఖ స్వామి ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకలో చాలామంది భావోద్వేగానికి గురయ్యారు. పౌరసత్వం వచ్చినట్లు ప్రకటించగానే వారి కళ్లలో ఆనందబాష్పాలు రాలాయి. నవ్వుకోండి, ఇకపై మీరందరూ అధికారికంగా భారతీయులే అంటూ డిప్యూటీ సీఎం వారికి అభినందనలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న కీలక నిర్ణయం, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వల్లే ఇది సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. ఈ చట్టం ద్వారా శరణార్థుల జీవితాల్లో భద్రత, ఆశలు చిగురించాయని హర్ష్ సంఘ్వీ తెలిపారు. పాకిస్థాన్‌లో హిందూ కుటుంబాలు, ముఖ్యంగా మహిళలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కాదన్నారు. పాక్‌లోని థార్‌పార్కర్ ప్రాంతం నుంచి భారత్‌కు వచ్చిన ఎంతోమంది మహిళలు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి పేర్లు కూడా మార్చుకోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు భారతీయ పౌరసత్వం రావడంతో వారు ఎవరికీ భయపడకుండా తమ అసలు పేర్లతో ఆత్మగౌరవంతో బతకవచ్చని చెప్పారు.

పౌరసత్వం పొందిన 319 మందిలో రాజ్‌కోట్ జిల్లాకు చెందిన వారు 259 మంది ఉండగా, మోర్బీ నుంచి 53 మంది, కచ్ నుంచి 6 మంది, సురేంద్రనగర్ నుంచి ఒకరు ఉన్నారు. పాకిస్థాన్ పాస్‌పోర్ట్ కంటే రాజ్‌కోట్ గర్బా ఉత్సవాల్లో పాల్గొనేందుకు లభించే అనుమతి పత్రమే తనకు ఎంతో విలువైనదని ఈ సందర్భంగా హర్ష్ సంఘ్వీ వ్యాఖ్యానించారు. దేశంలో స్థిరమైన గుర్తింపు, రక్షణ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ కుటుంబాలకు ఈ రోజు ఎంతో ప్రత్యేకమైనది. పౌరసత్వం దక్కడంపై వారు స్పందిస్తూ ఇది తమ కల నిజమైన క్షణమని చెప్పారు.

## రహస్య సమాచారం చేరవేసి 300 మంది మృతికి కారకుడైన రష్యన్ అధికారి

**మాస్కో, అక్టోబరు 16:** ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధంలో ఊహించని పరిణామం వెలుగులోకి వచ్చింది. రష్యా సైన్యానికి చెందిన 26 ఏళ్ల లెఫ్టినెంట్ లెవ్ స్టూప్నికోవ్ రహస్యంగా ఉక్రెయిన్ నిఘా వర్గాలతో చేతులు కలిపి సొంత దేశం ఆర్మీ స్థావరాల సమాచారాన్ని శత్రు దేశానికి చేరవేశాడు. ఈ సమాచారం ఆధారంగా ఉక్రెయిన్ జరిపిన దాడుల్లో దాదాపు 300 మందికి పైగా రష్యన్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. అనంతరం ఆ రష్యన్ అధికారి



ఫ్రంట్‌లైన్ దాటి ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు పారిపోయి పుతిన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న బెటాలియన్‌లో చేరాడు. బుద్యోన్నీ మిలిటరీ అకాడమీ నుంచి పట్టభద్రుడైన స్టూప్నికోవ్ డోన్‌బాస్ ప్రాంతంలోని కీలకమైన వుహ్లెడార్ ను హస్తగతం చేసుకునే బాధ్యతను కలిగి ఉన్న బెటాలియన్‌కు చీఫ్ సిగ్నల్స్ ఆఫీసర్‌గా నియమితుడయ్యాడు. కమాండర్లకు, నిఘా వ్యవస్థలకు మధ్య సమాచార వ్యవస్థను పర్యవేక్షించడం లాంటి బాధ్యతలను ఆయన నిర్వర్తిస్తున్నారు. అయితే ఆ స్థానాన్ని దుర్వినియోగం చేస్తూ డ్రోన్లు, కెమెరాల ద్వారా లభించే రష్యా దళాల కదలికలు, యుద్ధ ప్రణాళికల వివరాలను రహస్యంగా ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్‌కు చేరవేశాడు. ఒకరోజు కడుపునొప్పి అనే నెపంతో సహచర సైనికులకు దూరంగా వెళ్లిన మరుసటి క్షణమే ఆయన పంపిన వివరాల ప్రకారం ఉక్రెయిన్ మిస్సైల్ దాడి జరిపింది. ఈ దాడిలోనే 68 మంది రష్యన్ సైనికులు అక్కడికక్కడే మరణించగా మరో 60 మంది తీవ్రంగా గాయపడ్డారు. రష్యా ఉక్రెయిన్‌పై జరిపిన దండయాత్రే స్టూప్నికోవ్‌ను ఈ నిర్ణయం వైపు నడిపించింది.

## కెనడా విచ్ఛిన్నానికి అమెరికా యత్నాలు

### ప్రధాని మార్క్ కార్నీ సంచలన వ్యాఖ్యలు

**ఒట్టావా, అక్టోబరు 16:** తమ దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి అమెరికా ప్రయత్నిస్తోందని కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కెనడా ప్రావిన్స్ ఆల్బెర్టాలో వచ్చే సోమవారం రిఫరెండం జరగనున్న నేపథ్యంలో ప్రచార ర్యాలీలో కార్నీ మాట్లాడారు. ఆల్బెర్టా కెనడాలో భాగంగా ఉండేలా ఆ ప్రావిన్స్ ప్రజలు ఓటు వేయాలని కోరారు. అందుకు భిన్నంగా జరిగితే.. విభజన, అనిశ్చితికి దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.'ప్రపంచం ప్రమాదకరంగా, సొంత లక్ష్యాల ఆధారంగా విడిపోయి ఉంది. మన సరిహద్దులకు అవతల ఉన్నవారు మనల్ని విచ్ఛిన్నం చేసి, గుప్పిట పెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇలా ఏమాత్రం అనుకూలంగా లేని సమయంలో రిఫరెండం జరుగుతోంది. ఇందులో నిర్ణయాత్మక ఫలితం వేర్పాటువాద సమస్యను పరిష్కరిస్తుంది. ఆల్బెర్టా విడిపోవడానికి వేసే ఓటు సంవత్సరాల తరబడి అనిశ్చితికి దారితీస్తుంది' అని ఆ ప్రావిన్స్ ప్రజలను హెచ్చరించారు.ప్రస్తుతం అమెరికా, కెనడా మధ్య ట్రేడ్ వార్ నడుస్తోంది. మరోవైపు కెనడాను తమ దేశంలో 51వ రాష్ట్రంగా చేర్చుకుంటామని పలు సందర్భాల్లో ట్రంప్ బెదిరింపులకు పాల్పడ్డారు.

# ఏపిలో పుర పోరు హింసాత్మకం

- రాయలసీమలో పలు ప్రాంతాల్లో ఉద్రిక్తత
- పుంగనూరులో ఎంపి మిథున్‌రెడ్డి వాహనంపై దాడి
- **రాయచోటిలో వైసిపి ఆఫీసు ధ్వంసం, వాహనాలకు నిప్పు**
- ధర్మవరంలో బిజెపి, వైసిపి శ్రేణుల ఘర్షణ
- **తిరుపతిలో టిడిపి శ్రేణులను అడ్డుకున్న వైసిపి నేతలు**
- తాడిపత్రిలోనూ టిడిపి-వైసిపి పరస్పర ఆరోపణలు
- మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి అనుచిత వ్యాఖ్యలు.. కేసు
- హింసాత్మక ఘటనపై ఎస్ఇసికి వైసిపి ఫిర్యాదు
- వైసిపి అరాచకాలపై ఎస్ఇసికి ఆధారాలిచ్చిన టిడిపి
- **శాంతిభద్రతలపై డిజిపి సీరియస్.. కంట్రోల్ రూములు ఏర్పాటు**
- పుంగనూరు ఘటనలపై మూడు కేసులు: డిఐజి ప్రవీణ్
- **ఘటనలపై హైకోర్టులో విచారణ, తీర్పు రిజర్వ్**



శుక్రవారం రాయచోటి వైసిపి కార్యాలయం వద్ద తగలబడుతున్న కారులు, ద్విచక్రవాహనాలు





పుంగనూరులో వైసిపి, టిడిపి శ్రేణుల ఘర్షణలో గాయపడ్డ కార్యకర్త. పోలింగ్ కేంద్రంలో ఎంపి మిథున్ రెడ్డి

**విజయవాడ. అక్టోబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలు, నగర పంచా యతీలు, మున్సిపల్ కార్పొరేషన్లులకు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారం భమైంది. అయితే రోజు మందకొండి నామినేషన్లు దాఖలు అయ్యాయి. పలు చోట్ల నామినేషన్లు సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. పిఠాపురం మున్సిపాలిటీలో తొలి నామినేషన్ దాఖలైంది. టిడిపి అభ్యర్థి శ్రీనివాసరావు 13వ వార్డులో నామినేషన్ దాఖలు చేసారు. తొలిరోజు కడప కార్పొరేషన్‌లో 10 నామినేషన్లు (వైఎస్సార్సీపి నుంచి 7, టిడిపి నుంచి 2) దాఖలయ్యాయి. అయితే, నామినేషన్ల పర్వంలో రాయలసీమలో పలుచోట్ల ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలపై అటు రాజకీయ నేతలు, ఇటు పోలీస్ అధికారులు స్పందించారు. రాష్ట్రంలో నామినేషన్ దాఖలు నడుమ తెలుగుదేశం, వైసిపి నడుమ ఘర్షణలు చెలరేగాయి. పుంగనూరులో పరిస్థితి అదుపు తప్పింది. దాడులకు కారణం మీరంటే మీరని టిడిపి, వైసిపి నేతలు పరస్పర ఆరోప ణలకు దిగారు. రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యా దు చేసారు. టిడిపి దౌర్జన్యాలకు దిగుతున్నదని, ఎన్నికలు సక్రమంగా జరిగేందుకు కేంద్రం నుంచి అదనపు బలాలను దించాలని వైసిపి ఎస్ఇసిని కోరింది. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్ర చేస్తున్నాయని కూటమి నేతలు ఆరోపించారు.

**అన్నమయ్య జిల్లాలో ఉద్రిక్తత:** నామినేషన్ల తొలి రోజున అన్నమయ్య జిల్లా పుంగనూరులో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బసవరాజు గవర్నమెంట్ జూనియర్ కాలేజీలోని నామినేషన్ కేంద్రానికి వెళ్తున్న వైఎస్ఆర్సీపి శ్రేణులపై టిడిపి వర్గీయులు దాడులకు పాల్పడ్డారు. కర్రలు, రాళ్లతో ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరగడంతో పాటు, వైఎస్ఆర్సీపి నేత, ఎంపి మిథున్ రెడ్డి కాన్వాయ్ వాహనాలపై దాడి చేసి ధ్వంసం చేయ డం, కొన్ని వాహనాలకు నిప్పు పెట్టడం వంటి ఘటనలు జరిగాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ ఘర్షణలతో ఆ ప్రాం తంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. స్థా నిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది.

**రాయచోటిలో వైఎస్సార్సీపి కార్యాలయానికి నిప్పు:** రాయచోటి ఘర్షణల్లో వైఎస్సార్సీపి కార్యాల యానికి నిప్పు పెట్టారు. వైఎస్సార్సీపి కార్యా లయంలో అగ్నిమాపక సిబ్బంది మంటలార్పింది. రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో వైసిపి, టిడిపి వర్గాల నడుమ స్వల్ప ఘర్షణలు జరిగాయి.

**ఎస్పీ ధీరజ్ వివరణ:** పుంగనూరు నామినే షన్ కేంద్రం వద్ద జరిగిన ఘటనపై అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ స్పం దించారు. ఎంపి మిథున్‌రెడ్డి తన అనుచరులతో సుమారు 100 వాహనాల్లో నామినేషన్ కేంద్రం వద్దకు చేరుకుని 100 మీటర్ల నిబంధనను ఉల్లంఘించారని తెలిపారు. కేంద్రం వద్దకు వేగంగా దూసుకొచ్చిన ఒక వాహనం గేట్లను ఢీకొని ప్రజలు, అభ్యర్థుల పైకి వెళ్లడంతో పలు వురికి గాయాలయ్యాయని, వారిని ఆసుపత్రికి తరలించామని స్పష్టం చేశారు. అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరిని మాత్రమే కేంద్రంలోకి అనుమ తించాలన్న నిబంధన ఉన్నప్పటికీ ఉల్లంఘనకు పాల్పడ్డారని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠినంగా శిక్షిస్తామని ఎస్పీ ధీరజ్ హెచ్చరించారు.

**ధర్మవరంలో స్వల్ప ఉద్రిక్తత:** శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో మున్సిపల్ కార్యాలయం వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఉదయం నుంచి వాహనాలతో కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తమ్ముడు కృష్ణారెడ్డి హడావుడి చేశారు. వైఎస్సార్సీపి నాయకుల హడావుడిపై బిజెపి కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. బిజెపి, వైఎస్సార్సీపి కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఇరుపక్షాల ఘర్షణతో పోలీసులు అప్రమత్తమై, వారిని చెదరగొట్టారు.

**తిరుపతి మేయర్ ఎన్నికల్లో ఉద్రిక్తత:** తిరుపతి మేయర్ ఎన్నికల్లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కొర్లగుంట, బైరాగి పట్టెడలో నామినేషన్ కేంద్రాల వద్ద వైఎస్సార్సీపి నాయకులు హడావిడి చేశారు. టిడిపి కార్యకర్తలను భూమన కరుణాకర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి అడ్డుకున్నారు. సత్యనారాయణ పురం, శ్రీకృష్ణనగర్‌లో నామినేషన్ కేంద్రాల వద్ద ఆందోళనలు చేపట్టారు. విశాఖ జిల్లా గాజువాక జోనల్ కార్యాలయంలో నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో పాటు ముగ్గురికి అనుమతి ఇచ్చారు. జోనల్ కార్యాలయం పరిసరాలలో భారీగా పోలీసులు మోహరించారు. కార్యాలయానికి 500 మీటర్లు దూరంలో కార్యకర్తలు ఉండాలని ఆంక్షలు విధించారు.

## తెలంగాణ, కర్ణాటక సమష్టిగా పనిచేస్తే అపార అవకాశాలు

### బెంగళూరులో తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** తెలంగాణ,కర్ణాటక రాష్ట్రాలు పోటీపడే ధోరణికి స్వస్తి పలికి,పరస్పర సహకారంతో పారిశ్రామిక రంగంలో కొత్త అవకాశాలను సృష్టించుకోవాలని రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు,వాణిజ్య శాఖల మంత్రి డి.శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం బెంగళూరులో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 రోడ్‌షో... పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు.

తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు ఒకే విలువ ఆధారిత గొలుసులో రెండు భాగాలు అని చెప్పారు. కర్ణాటక పరిశ్రమలను తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.హైదరాబాద్‌లో భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు వరకు జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026లో పాల్గొనాలని ఆహ్వానించారు. కర్ణాటక నుంచి ఏదైనా తీసుకెళ్లాలనే ఉద్దేశంతో తాము బెంగుళూరుకు రాలేదని, కర్ణాటకకు అద్భుతమైన బలాలు ఉన్నాయని తెలంగాణకు ప్రత్యేక సామర్థ్యాలు ఉన్నాయని చెప్పారు. ఈ రెండు రాష్ట్రాలు కలిసి పనిచేస్తే దేశ పారిశ్రామిక అభివృద్ధికి మరింత దోహదపడవచ్చని పేర్కొన్నారు. ఏరోస్పేస్, లైఫ్ సైన్సెస్, సెమీకండక్టర్లు, టెక్స్‌టైల్స్ రంగాల్లో భాగస్వామ్యాలకు ఆయన ప్రతిపాదన చేశారు.





శుక్రవారం బెంగళూరులో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 రోడ్‌షో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యం.. 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ.2047 నాటికి 3 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యం అని చెప్పారు.

## హైదరాబాద్‌లో ఎపి ఎక్సైజ్ ఎస్సైల పాసింగ్ ఔట్ పెరేడ్

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో ఏపీ ఎక్సైజ్ ఎస్సైల పాసింగ్ అవుట్ పెరేడ్ జరిగింది ఈ కార్యక్రమానికి ఎపి ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.కె.మీనా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మీ విజయాన్ని చూసి మీ కుటుంబాలు గర్వపడుతున్నాయని ఎం.కె.మీనా పేర్కొన్నారు. సమస్యల్ని పరిష్కరించే విధానమే మీపై విశ్వసనీయత పెంచుతుందని, నకిలీ మద్యం అరికట్టాలి,



పెరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన జి.జ్ఞానప్రసన్నలక్ష్మికి ప్రత్యేక ప్రతిభా అవార్డును అందజేస్తున్న ఎపి ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.కె.మీనా

క్షేత్రస్థాయిలో ధైర్యంగా పని చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న సంస్థాగత సహకారంలో భాగంగా ఈ ఉమ్మడి శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు. అకాడమీలో 6 నెలల పాటు పోలీస్ స్థాయి కఠోరమైన, కఠినమైన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఎక్సైజ్ అధికారులు ఈ పెరేడ్‌లో పాల్గొని ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ ఎక్సైజ్ కమిషనర్ చేమాకూరి శ్రీధర్(ఐఏఎస్), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ(ఐపిఎస్), తెలంగాణ పోలీస్ అకాడమీ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ బ్యాచ్‌లో ఆల్ రౌండర్ ప్రతిభ కనబర్చి పెరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన జి.జ్ఞాన ప్రసన్న లక్ష్మి ప్రత్యేక ప్రతిభా అవార్డును అందుకున్నారు. ఈ 6 నెలల శిక్షణలో శారీరక దారుఢ్యం, వ్యూహాత్మక క్రమశిక్షణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సామర్థ్యాలు, ఎన్‌డిపిఎస్ (మత్తుపదార్థాల నియంత్రణ) చట్టాలపై ప్రత్యేక శిక్షణనిచ్చారు.

## యూట్యూబర్ ధృవ్‌రాఠీ ఇంటిగోడపై సాకేత్‌కోర్టు సమన్లు

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** యూట్యూబర్ ధ్రువ్ రాఠీకి పరువు నష్టం కేసులో ఇబ్బందులు మరింత పెరిగాయి. గురుగ్రామ్‌లోని ఇంటి ప్రధాన గేటుపై ఢిల్లీ సాకేత్ కోర్టు సమన్లను అంటించారు. బీజేపీ ఐటీ సెల్ సభ్యుడు వికాస్ సాంకృత్యాయన్ అలియాస్ వికాస్ పాండే దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసుకు సంబంధించి ఈ పరిణామం చోటుచేసుకుంది. గురుగ్రామ్‌లోని సెక్టార్56 లో ఉన్న కేంద్రీయ విహార్ సొసైటీలో ఉన్న ధ్రువ్ రాఠీ ఇంటి గేటుపై ఈ నోటీసును అతికించారు. కోర్టు సిబ్బందితో పాటు ఫిర్యాదుదారుడు స్వయంగా వెళ్లి ఈ సమన్లను జారీ చేసేందుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో అధికారులు ఈ చర్య తీసుకున్నారు. రాఠీకి నేరుగా అందజేయడానికి వీలుపడకపోవడంతో కోర్టు ఆదేశాల మేరకు ఇంటి గేటుపైనే ఈ నోటీసును అంటించి సమాచారం అందించారు. ఈ వివాదం మూలాలు 2018 నాటి ఓ వీడియోలో ఉన్నాయి. బీజేపీ ఐటీ సెల్ పార్ట్2 పేరుతో అప్పట్లో అప్‌లోడ్ చేసిన ఆ వీడియోలో తమపై, బీజేపీ ఐటీ సెల్ పై నిరాధార ఆరోపణలు చేశారని వికాస్ పాండే ఫిర్యాదులో పేర్కొన్నారు. వికాస్ పాండే ద్వారా మహావీర్ ప్రసాద్ అనే వ్యక్తికి లంచం ఇవ్వడానికి ప్రయత్నించారని, అంతేకాకుండా ధ్రువ్ రాఠీని బద్నాం చేయడానికి రూ.50 లక్షలు ఆశ చూపారంటూ ఆ వీడియోలో తప్పుడు ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఈ నిరాధార ఆరోపణలు తన వ్యక్తిగత, సామాజిక ప్రతిష్టకు తీవ్ర భంగం కలిగించాయని వికాస్ పాండే తెలిపారు. 2019 జూలైలోనే ఈ కేసుకు సంబంధించి మొదటిసారి సమన్లు జారీ అయినప్పటికీ, ఇప్పటివరకు అవి ఆయనకు అందలేదు. ధ్రువ్ రాఠీ ఆస్ట్రియాలో నివసిస్తుండటం, నోటీసులు తీసుకోవడానికి నిరాకరించడమే ఇందుకు కారణం. అయితే, ఆయన ప్రస్తుతం భారత్‌లోని ఢిల్లీఎన్‌సీఆర్‌లోనే ఉన్నట్లు సమాచారం అందడంతో కోర్టు తాజాగా మరోసారి సమన్లు జారీ చేసింది. మరోవైపు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలోని సెంట్రల్ పార్క్‌లో జెండా వందన నిరసన కార్యక్రమం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాలన్నింటి మధ్య, ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణ అక్టోబర్ 17న జరగనుండటంతో అందరి దృష్టి కోర్టు తీర్పుపైనే నిలిచింది.

## నేటికీ అంతుచిక్కని మిస్టరీగా పాక్ తొలిప్రధాని హత్య

**రావల్పిండి, అక్టోబరు 16:** పాకిస్థాన్ మొదటి ప్రధానమంత్రి లియాఖత్ అలీ ఖాన్, 1951 అక్టోబర్ 16న రావల్పిండిలో జరిగిన ఓ బహిరంగ సభలో దారుణ హత్యకు గురయ్యారు. దశాబ్దాలు గడిచినా, ఈ హత్య వెనుక ఉన్న అసలు కారణాలు, కుట్రదారుల వివరాలు ఇప్పటికీ రహస్యంగానే మిగిలిపోయాయి. పాకిస్థాన్ రాజకీయ గమనాన్ని మార్చేసిన ఈ ఘటన, నేటికీ అంతుచిక్కని మిస్టరీగానే కొనసాగుతోంది. 1951 అక్టోబర్ 16న, రావల్పిండిలోని కంపెనీ బాగ్‌లో జరిగిన బహిరంగ సభలో లియాఖత్ అలీ ఖాన్ ప్రసంగించేందుకు సిద్ధమయ్యారు. ఆయన బరాదరాన్‌ఎ మిల్లత్ అని తన ప్రసంగాన్ని ప్రారంభించిన కొన్ని క్షణాల్లోనే, సభలో ఉన్న సయీద్ అక్బర్ అనే ఆఫ్ఘన్ జాతీయుడు తన వద్ద ఉన్న తుపాకీతో రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన 56 ఏళ్ల లియాఖత్ అలీ ఖాన్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆశ్చర్యకరంగా కాల్పులు జరిపిన వెంటనే పోలీసులు హంతకుడు సయీద్ అక్బర్‌ను అక్కడికక్కడే కాల్చి చంపారు. దీంతో హత్యకు గల కారణాలు తెలుసుకునేందుకు అతడిని విచారించే అవకాశం లేకుండా పోయింది. ఈ చర్యే తదనంతర కాలంలో అనేక అనుమానాలకు, కుట్ర సిద్ధాంతాలకు దారితీసింది. ఈ హత్యపై 1951-52 మధ్య ఒక అధికారిక కమిషన్, ఆ తర్వాత స్కాట్లాండ్ యార్డ్ బృందం కూడా దర్యాప్తు చేశాయి. కానీ, ఎవరూ కచ్చితమైన ముగింపును ఇవ్వలేకపోయారు. విచారణలో ప్రధానంగా ఒక అంశం బలంగా వినిపించింది. 1947-48లో భారత్ పాకిస్థాన్ మధ్య కశ్మీర్ కోసం జరిగిన యుద్ధం తర్వాత, 1949 లో కుదిరిన కాల్పుల విరమణ ఒ ప్పందంపై కొం దరు గిరిజన యోధులు, సైనిక వర్గాలు తీవ్ర అ సంతృప్తితో ఉన్నా



యని, ఆ కోపమే హత్యకు దారితీసి ఉండొచ్చని ఒక వాదన ఉంది. హంతకుడు సయీద్ అక్బర్, కశ్మీర్‌లోకి చొరబడేందుకు తాను ఒక సైనిక దళాన్ని (లష్కర్) నడిపిస్తానని గతంలో ప్రతిపాదించినట్టు వార్తలు వచ్చాయి. దీనికి ఆధారాలు లేవని దర్యాప్తు సంస్థలు కొట్టిపారేశాయి. సయీద్ అక్బర్, ఆఫ్ఘన్ రాచరికంతో విభేదించి పాకిస్థాన్‌లోని అబోట్టాబాద్‌లో ప్రభుత్వ భత్యంపై జీవించేవాడు. అతను ఉపయోగించిన జర్మన్ 9ఎంఎం పిస్టల్‌ను కశ్మీర్ నుంచి తిరిగి వచ్చిన ఒక ముజాహిద్ నుంచి పొందినట్లు తేలింది. ఈ అంశం కశ్మీర్ అసంతృప్తి వాదనకు మరింత బలాన్నిచ్చింది. కాల్పుల విరమణ ఒప్పందంపై అసంతృప్తితో ఉన్న సైనికాధికారులు పన్నిన రావల్పిండి కుట్ర కేసుకు ఈ హత్యకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు జరిగినా, స్పష్టమైన ఆధారాలు లభించలేదు. సంవత్సరాల తర్వాత హంతకుడు సయీద్ అక్బర్ కుమారుడు ఫరూఖ్ బబ్రాక్‌జాయ్ ఒక పుస్తకాన్ని ప్రచురించారు.

తన తండ్రిని సజీవంగా పట్టుకునే అవకాశం ఉన్నప్పటికీ, పోలీసులు ఎందుకు వెంటనే చంపేశారని ఆయన ప్రశ్నించారు. 75 ఏళ్లు గడిచినా, లియాఖత్ అలీ ఖాన్ హత్య వెనుక ఉన్నది వ్యక్తిగత కక్షలా కశ్మీర్ వివాదమా లేక అంతర్జాతీయ శక్తుల కుట్రనా అనే ప్రశ్నలకు సమాధానం దొరకలేదు.

# నేడే సిరీస్ డిసైడ్ మ్యాచ్





## వెస్టిండీస్‌తో చావోరేవో తేల్చుకోనున్న భారత్

**బెంగుళూరు:** వెస్టిండీస్‌తో ఐదు టి20ల సిరీస్‌లో ఆఖరి పోరుకు టీమిండియా సిద్ధమైంది. ప్రస్తుతం ఇరు జట్లు 2-2తో సమంగా ఉండటంతో ఈ నెల 17న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగబోయే ఐదో మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. ఏ జట్టు ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే ఆ జట్టు సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది. నాల్గో మ్యాచ్‌లో ఓటమి చవిచూసిన టీమిండియా, ఈ ఆఖరి పోరులో గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డాలని చూస్తోంది. విండీస్ దూకుడును అడ్డుకోవడానికి భారత కోచింగ్ స్టాఫ్ ప్రత్యేక వ్యూహాలు రచిస్తోంది. దాంతో బెంగళూరు వేదికగా శనివారం జరిగే ఆఖరి టి20 సిరీస్ డిసైడర్‌గా మారింది. నాలుగో టి20 పరాజయంనుంచి పాఠంనేర్చుకొని ఆఖరి మ్యాచ్‌లో విజయం సాధించాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. మరోవైపు తమకు అలవాటైన రీతిలోనే సత్తా చాటి సిరీస్ ఎగరేసుకుపోవాలని వెస్టిండీస్ భావిస్తోంది. హైదరాబాద్‌లో టీమిండియా ఓటమి పాలవ్వడంతో ఇప్పటికే సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు టీమ్ కాంబినేషన్, గేమ్ ప్లాన్‌ను ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలోనే టీమిండియా కాంబినేషన్‌లో పలు మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను మళ్లీ తుది జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. ఎక్స్‌ట్రా పేసర్‌గా ప్రిన్స్ యాదవ్‌ను ఆడించడంతో కుల్దీప్ బెంచ్‌కే పరిమిత మయ్యాడు. ఇండోర్ టి20లో ఈ కాంబినేషన్ ఫలితాన్ని ఇచ్చినా, ఉప్పల్ మ్యాచ్‌లో మాత్రం మిస్‌ఫైర్ అయింది. ఈ క్రమంలోనే బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే చిన్నస్వామి స్టేడియంలో కుల్దీప్ యాదవ్‌ను బరిలోకి దించే అవకాశం ఉంది. పరుగుల నియంత్రణ కంటే వికెట్లు తీసే బౌలర్లకు మేనేజ్‌మెంట్ ప్రాధాన్యత ఇవ్వవచ్చు. దాంతోనే కుల్దీప్ జట్టులోకి వస్తే ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్‌లో ఒకరు బెంచ్‌కే పరిమితం కానున్నారు. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ లేదా వైభవ్‌లు ఓపెనింగ్ చేయనుండగా, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, నమన్ ధీర్, నితీష్ రెడ్డి, అక్షర్ పటేల్ మిడిలార్డర్ బాధ్యతలు పంచుకోనున్నారు. అర్ష్‌దీప్ సింగ్ ఫిట్‌గా ఉంటే మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్‌లో ఒకరితో కలిసి పేస్ విభాగాన్ని లీడ్ చేయనున్నారు. అర్ష్‌దీప్ ఫిట్‌గా లేకుంటే మయాంక్, ప్రిన్స్ యాదవ్ బరిలోకి దిగుతారు. కుల్దీప్ యాదవ్, నమన్ ధీర్, అక్షర్ పటేల్ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు.

ఆట



### రెజ్లింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్..

## మహిళల విభాగంలో కోమల్‌కు కాంస్యం

**లాస్ వెగాస్:** అమెరికాలోని లాస్ వెగాస్‌లో శుక్రవారం జరిగిన 2026 అండర్23 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో, మహిళల 59 కేజీల విభాగంలో జరిగిన కాంస్య పతక పోరులో కజకిస్థాన్‌కు చెందిన విక్టోరియా ఖుసైనోవాను 72 తేడాతో ఓడించి కోమల్ కాంస్యం గెలుచుకుంది. మరోవైపు, అమృత పూజారి రెండు పిన్‌ఫాల్ విజయాలతో మహిళల 72 కేజీల ఫైనల్‌కు చేరుకుంది. విశ్వజిత్ మోర్ (55 కేజీల విభాగంలో) దేశపు మొట్టమొదటి గ్రీకో రోమన్ రెజ్లర్‌గా రజత పతకం సాధించి చరిత్ర సృష్టించిన తర్వాత, ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఇది రెండవ పతకం. స్వర్ణ పతకం కోసం జరిగే పోరులో రెజ్లర్ పూజారి ఉక్రెయిన్‌కు చెందిన ఇరినా జబ్లోట్స్కాతో తలపడనుంది. ఆమె తన ప్రస్థానాన్ని కజకిస్తాన్‌కు చెందిన సబీరా నోవాపై ఫాల్‌తో ప్రారంభించి, ఆ తర్వాత సెమీఫైనల్‌లో చైనాకు చెందిన వెంజిన్ క్యూపై మరో పిన్‌తో విజయం సాధించింది. భారత క్రీడాకారిణి సబిర, నోవాపై 7-1 ఆధిక్యం సాధించి, ఆ తర్వాత ఫాల్ ద్వారా పోటీని ముగించింది. కియుతో జరిగిన పోరులో, పూజారి 10-8 ఆధిక్యంలో ఉన్నప్పుడు నిర్ణయాత్మక పిన్‌ను సాధించి ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఇ. ఫైండింగ్‌ను 1-1తో ఓడించిన కోమల్, ఆ తర్వాత ఎం. ప్రిసకారిపై 8-3 తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. మహిళల 76 కేజీల విభాగంలో పతకం కోసం పోటీపడిన మరో భారతీయ క్రీడాకారిణి దీక్షా మాలిక్, ఉక్రెయిన్‌కు చెందిన సోకోలోవ్స్కా ఎన్ చేతిలో 3 నిమిషాల కన్నా కొంచెం తక్కువ సమయంలో 0-5 తేడాతో ఓడిపోయింది.

## ఎటిపి మాస్టర్స్.. షాంఘై సెమీఫైనలిస్ట్‌గా జోడార్



**షాంఘై:** ఎటిపి మాస్టర్స్ 1000 ఈవెంట్‌లో శుక్రవారం కాస్పర్ రూడ్‌పై విజయం సాధించిన రఫెల్ జోడార్, ఒక సెట్ వెనుకబడిన స్థితి నుండి వరుసగా తన నాలుగో విజయాన్ని నమోదు చేశాడు. రెండు, మూడవ సెట్లలో రూడ్ సర్వ్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన జోడార్, రెండు గంటల 20 నిమిషాల పోరులో 4-6, 6-4, 6-3 తేడాతో విజయం సాధించి, టోర్నమెంట్ చరిత్రలోనే అత్యంత పిన్న వయస్కుడైన సెమీఫైనలిస్ట్‌గా నిలిచాడు. రూడ్ 10వ గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి తొలి సెట్‌ను కైవసం చేసుకున్నాడు, ఆ తర్వాత తొలి గేమ్‌లోనే మరో బ్రేక్ సాధించి రెండో సెట్‌ను 2-2తో సమం చేశాడు. అనంతరం జోడార్ క్రమంగా ఆటపై తన పట్టు సాధించడం మొదలుపెట్టాడు. 5-4తో ఆధిక్యంలోకి వెళ్లి, ఆ తర్వాత రెండో సెట్‌ను సున్నా స్కోరుతో గెలుచుకున్న జోడార్, నిర్ణయాత్మక సెట్‌లో రూడ్ సర్వ్‌ను మూడుసార్లు బ్రేక్ చేసి, ప్రపంచ నంబర్ 24 ఆటగాడిపై అద్భుతమైన విజయాన్ని పూర్తి చేశాడు. ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో స్థానం కోసం, ఆ స్పానిష్ డ్రైవర్ తదుపరి లైవ్ రేసులో తనకంటే ఒక స్థానం పైన ఉన్న డానియల్ మెద్వెదేవ్‌తో గానీ, లేదా టామీ పాల్‌తో గానీ తలపడతాడు. ఈ స్పానిష్ ఆటగాడు ఎటిపి లైవ్ రేస్ టు టురిన్‌లో నోవాక్ జొకోవిచ్ మరియు అలెక్స్ డి మినార్‌లను అధిగమించి తొమ్మిదవ స్థానానికి ఎగబాకాడు.



## డెన్మార్క్ ఓపెన్.. ట్రీసా-గాయత్రి జోడీ నిష్క్రమణ

**ఒడెన్స్, డెన్మార్క్:** మలేషియాకు చెందిన రెండో సీడెడ్ జోడీ పెర్లీ టాన్-థినా మురళీధరన్‌ల చేతిలో 21-14, 17-21, 11-21 తేడాతో ఓడిపోవడంతో, భారత్ డబుల్స్ జోడీ ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్‌ల జోడీ డెన్‌మార్క్ ఓపెన్ ఓపెన్ ప్రయాణం శుక్రవారం క్వార్టర్ ఫైనల్స్‌లోనే ముగిసింది. తొలి గేమ్‌లో భారత జంట చక్కగా ప్రారంభించి, కచ్చితమైన నెట్ షాట్‌లతో 8-4 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. వారి ప్రత్యర్థులు ఒక గట్టి క్రాస్‌కోర్ట్ షాట్‌తో దెబ్బతీసినప్పటికీ, విరామ సమయానికి ట్రీసా, గాయత్రీ ద్వయం 11-7 ఆధిక్యంలోనే ఉంది. ఆట చివర్లో 19-12 వద్ద గాయత్రి, ట్రీసా ఒత్తిడికి గురయినా మొదటి గేమ్‌ను 21-14తో ముగించారు. ప్రపంచ 18వ ర్యాంకర్ జోడీ, టాన్-మురళీధరన్‌పై 6-4 ఆధిక్యంతో రెండవ గేమ్‌ను ప్రారంభించింది. ప్రత్యర్థులు వరుసగా పాయింట్లు సాధించడంతో టాన్ మరియు మురళీధరన్ 9-9తో స్కోరును సమం చేశారు. తర్వాతి రెండు పాయింట్లు గెలుచుకుని, ఆట మొదటి అర్ధభాగాన్ని 11-9తో కైవసం చేసుకున్నారు. గాయత్రి, ట్రీసా 17-19 వద్ద సుదీర్ఘ ర్యాలీలో హోరాహోరీగా తలపడినా రెండో గేమ్‌ను 17-21 తేడాతో కోల్పోవడంతో, మ్యాచ్ నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. మూడవ గేమ్‌లో, మలేషియన్లు 7-2 ఆధిక్యాన్ని సాధించగా, విరామ సమయానికి భారతీయులు 4-11తో వెనుకబడ్డారు. 7-14 వద్ద, 81 షాట్ల సుదీర్ఘ ర్యాలీ మలేషియన్ల వైపు మొగ్గింది. టాన్ మరియు మురళీధరన్ 21-11 తేడాతో గేమ్‌ను ముగించారు.

## ఆసియా పారా గేమ్స్.. భావినా విజయంతో ఆరంభం



**నగోయా:** టోక్యో పారాలింపిక్స్ రజత పతక విజేత భావినా పటేల్, శుక్రవారం నగోయాలో జరిగిన మహిళల పారా టేబుల్ టెన్నిస్ పోటీలలో తన ప్రారంభ మ్యాచ్‌లో కువైట్‌కు చెందిన అహద్ అల్‌రషీదీని ఓడించి, తన ఆసియా పారా గేమ్స్ ప్రచారాన్ని విజయవంతంగా ప్రారంభించింది. మహిళల సింగిల్స్ క్లాస్ 45 గ్రూప్ ఎ మ్యాచ్‌లో భావినా తన కువైట్ ప్రత్యర్థిని 3-0 (11-6 11-3 11-6) తేడాతో ఓడించింది. మహిళల సింగిల్స్ క్లాస్ 9 గ్రూప్ బి మ్యాచ్‌లో బేబీ సహానా రవి కూడా వియత్నాంకు చెందిన థి హోవా ఫుయోంగ్ గుయెన్‌ను 3-0 (11-6 11-5 11-4) తేడాతో ఓడించింది. శుభమ్ వాధ్వా కూడా తన ప్రారంభ పురుషుల సింగిల్స్ క్లాస్ 3 గ్రూప్ మ్యాచ్‌లో నేపాల్‌కు చెందిన కేశవ్ థాపాను 3-0 (11-6 11-4, 11-9) తేడాతో ఓడించి విజయం సాధించాడు. మరో భారత పారా అథ్లెట్, జెహాన్ మదన్, పురుషుల సింగిల్స్ క్లాస్ 1 గ్రూప్ మ్యాచ్‌లో తన స్వదేశీయుడైన సందీప్ డాంగిని 3-1 (11-8 12-10 10-12 11-6) తేడాతో ఓడించి శుభారంభం చేశాడు.

# వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలజోరు.. లాభాల్లో ముగిసిన స్టాక్ సూచీలు




**ముంబయి,అక్టోబరు 16:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషన్‌లోనూ లాభాలతో ముగిశాయి. భారీ షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో కీలక సూచీలు పుంజుకున్నాయి. సెప్టెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించగా, డాలర్‌తో పోలిస్తే రూపాయి వరుసగా ఆరో సెషన్‌లోనూ బలపడింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 105 డాలర్ల స్థాయిలో కొనసాగింది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 413.66 పాయింట్లు పెరిగి 74,729.27 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 50 సూచీ 148.80 పాయింట్లు లాభపడి 23,146.15 వద్ద ముగిసింది. వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2.68 శాతం, నిఫ్టీ 2.31 శాతం చొప్పున ర్యాలీ తీశాయి. టీసీఎస్ 4.89 శాతం, ఇన్ఫోసిస్ 4.61 శాతం, భారతి ఎయిర్‌టెల్ 2.75 శాతం పెరిగి నిఫ్టీకి ప్రధానంగా మద్దతునిచ్చాయి. ఐటీ, మెటల్ షేర్లలో కొనుగోళ్లు కనిపించగా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 సూచీ 0.09 శాతం తగ్గగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 సూచీ 0.06 శాతం పెరిగింది. బీఎస్‌ఈలో మార్కెట్ ధోరణి సానుకూలంగా నమోదైంది. మొత్తం 2,404 షేర్లు లాభాల్లో ముగియగా, 1,962 షేర్లు నష్టపోయాయి. మరో 263 షేర్లలో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. ప్రభుత్వ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ బాండ్ ఈల్డ్ 0.32 శాతం తగ్గి 7.365 శాతానికి చేరింది. గత సెషన్‌లో ఇది 7.389 శాతంగా నమోదైంది. విదేశీ మారక మార్కెట్లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది.

గత సెషన్‌లో 94.9900 వద్ద ముగిసిన రూపాయి, శుక్రవారం 94.9275 స్థాయిలో ట్రేడయింది. ఎంసీఎక్స్‌లో డిసెంబర్ 4, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 0.62 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,48,401కు చేరాయి. బ్రెంట్ క్రూడ్ డిసెంబర్ 2026 ఫ్యూచర్స్ బ్యారెల్‌కు 25 సెంట్లు తగ్గి 105.67 డాలర్ల వద్దకు చేరాయి. గత సెషన్‌లో 106 డాలర్ల స్థాయిని దాటిన చమురు ధరలు స్వ ల్పంగా వెనక్కి తగ్గాయి. ఇక షేర్లపరంగాచూస్తే టెక్ మహీంద్రా కంపెనీ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 32.7 శాతం పెరిగి రూ.1,585.6 కోట్లకు చేరినట్లు ప్రకటించడంతో షేరు 8.48 శాతం దూసుకెళ్లింది. విప్రో రెండో త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 1.9 శాతం తగ్గి రూ.3,200 కోట్లకు చేరినప్పటికీ, షేరు 5.95 శాతం పెరిగింది. సైయెంట్ డీఎల్‌ఎం రెండో త్రైమాసికంలో ఆదాయం వార్షికంగా 26.5 శాతం, త్రైమాసిక ప్రాతిపదికన 5.16 శాతం పెరిగి రూ.393.09 కోట్లకు చేరింది. అయినప్పటికీ షేరు 12.62 శాతం పడిపోయింది. పీసీ జ్యువెలర్: ఎన్‌ఎస్‌ఈలో జరిగిన బల్క్ డీల్ ద్వారా ఇన్వెస్టర్ ఆదిత్య కుమార్ హల్వాసియా 5.1 కోట్ల షేర్లను కొనుగోలు చేసినట్లు వెల్లడి కావడంతో షేరు 11.97 శాతం ఎగబాకింది. సొలారా యాక్టివ్ ఫార్మా సైన్సెస్ షేరు 9.43 శాతం పెరిగింది. మహీంద్రా ఈపీసీ ఇరిగేషన్ షేరు 6.18 శాతం లాభప డింది. ప్రధాన సూచీలు వరుసగా రెండో రోజు లాభాలను నమోదు చేయడం మార్కెట్లో కొను గోళ్ల ఆసక్తిని సూచిస్తోంది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లలో పరిమిత కదలికలు, అంతర్జా తీయంగా అధిక స్థాయిలో కొనసాగుతున్న ముడిచమురు ధరలు ఇన్వెస్టర్లకు కీలక అం శాలుగా మారాయి. రానున్న రోజుల్లో కంపెనీల త్రైమాసిక ఫలితాలు, రూపాయి కదలికలు, అం తర్జాతీయ పరిణామాలు మార్కెట్ దిశను ప్రభావితం చేసే అవకాశముంది.

## భారత్ ఆర్థికవృద్ధి 7.1-7.3%

### డెల్లాయిట్ ఎకనమిక్ ఔట్‌లుక్ అంచనా




**ముంబయి, అక్టోబరు 16:** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ మరోపక్క అమెరికాతో వాణిజ్య యుద్ధం కొనసాగుతున్నా భారత్ ఆర్థిక వృద్ధి మాత్రం ప్రపంచ రేటింగ్‌సంస్థలను ఆకర్షిస్తోంది. ప్రముఖ ఐటి సాఫ్ట్‌వేర్ సంస్థ డెల్లాయిట్ ఎకనమిక్ ఔట్‌లుక్‌లో భారత్ ఆర్థికవృద్ధి 7.1 నుంచి 7.3శాతంగా ఉంటుందని అంచనావేస్తే ఐఎంఎఫ్ ఇప్పటికే 7 శాతంగా ఉండవచ్చని వెల్లడించింది. అలాగే మరోసంస్థ బిఎంఐ భారత్ ఆర్థికవృద్ధి పారిశ్రామికవృద్ధి పెరుగుతుండటంతో 7.5శాతంగా ఉంటుందని అంచనావేసింది. ఇప్పటికే మూడీస్, ఒఇసిడి, ఆర్బీఐ, ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్, మూడీస్ అంచనాలుసైతం 7.1శాతంగా ఉంటాయని వెల్లడించాయి. రక్షణరంగ ఉత్పతినత, ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్స్, స్వ చ్ఛ ఇంధనం, ఎఐ మౌలిక వనరులు వంటివి ప్రైవేటు క్యాపెక్స్‌ను మరింత పెంచుతున్నాయని, అందువల్ల ఉపాధిరంగం కూడా మరింత కోలుకుంటుందని ఈ సంస్థలు అంచనావేసాయి. మరోపక్క భారత్ పాలకులు కూడా దేశంలో వాణిజ్య వాతా వరణాన్ని మరింత వృద్ధిలోకి తెస్తున్నారు. అం దువల్లనే ప్రైవేటు పెట్టుబడులు కూడా పెరు గుతూ వస్తున్నాయి. తాజాగా డెల్లాయిట్ తన భారత్ ఆర్థిక వృద్ధి అంచనాలను 7.1 ఉంచి 7.3శాతంగాను, 2027-2028లో 6.6 నుంచి 7శాతంగా ఉంటుందని అంనావేసింది. సంస్థ భారత్ ఆర్థికవేత్త రుంకీ మజుందార్‌మాట్లాడుతూ గడచిన దశాబ్దకాలంలో భారత్ వృద్ధి క్రమేపీ పెరుగుతోందని, కుటుంబ వ్యయం కూడా పెరుగుతున్నదని, సుస్థిర పెట్టుబడులు ప్రభుత్వరంగ మౌలికవనరుల్లో పెరుగుతున్నాయని వెల్లడించారు. వాణిజ్యపరంగా మంచి కనెక్టివిటీ, ఆరోగ్యకరమైన ఆస్తిఅప్పుల పట్టాలు మరింత ఎక్కువ సామర్థ్య వినియోగం వంటివి ఆర్థికవృద్ధికి దోహదంచేస్తున్నట్లు డెల్లాయిట్ ఆర్థికవేత్త వివరించారు.

## విదేశీ కరెన్సీ ఒత్తిడి ఉన్న దేశాలతో రూపీ కరెన్సీలోనే ట్రేడింగ్‌కు భారత్ కసరత్తు: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**ముంబయి, అక్టోబరు 16:** విదేశీ కరెన్సీ ఒత్తి డులు మరింతగా ఎదుర్కొంటున్న దేశాలతో భా రత్ రూపాయి కరెన్సీలో ట్రేడింగ్ నిర్వహిం చేందుకు సిద్ధం అవుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇప్పటికే ప్రపంచంలోని కొన్ని దేశాలు విదేశీ కరెన్సీ ఒత్తి డిని ఎదుర్కొంటున్నాయి. దీనితో అత్యవసర ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆర్థిక మంత్రి వివరించారు. వాణిజ్య సుస్థిరతను కొనసాగించేందుకు విదేశీ కరెన్సీ లోటు ఎదుర్కొంటున్న దేశాలు ఇక భారత్‌తో రూపాయి కరెన్సీ లావాదేవీలు నిర్వహించవచ్చని ఆర్థికమంత్రి సంకేతాలిచ్చారు. అట్లాంటిక్ కౌన్సిల్ చర్చల్లో కేంద్ర మంత్రి ఈ అంశం వెల్లడించారు.ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వార్షిక సమావేశాలు ఈసారి థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరుగుతున్నాయి. భారత్‌నుంచి ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటున్న దేశాలు తమకు రూపాయి కరెన్సీలో చెల్లింపులు జరిపే వ్యవస్థలనుకూడా తీసుకురావాలని భారత్ ప్రతిపాదిస్తున్నట్లు మంత్రి వివరించారు. భారత్‌రూపాయిని చెలామణిలోకి తీసుకురావడంతోపాటు స్థానిక కరెన్సీలో సెటిల్‌మెంట్లు చేసుకునే వాణిజ్య వ్యవస్థను భారత్ కోరుతున్నట్లు కూడా నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు స్పష్టంచేస్తున్నాయి. దీనివల్ల విదేశీ కరెన్సీ సమస్యలు ఎదుర్కొం టున్న దేశాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె అన్నారు. భారత్‌నుంచి దిగుమతులు చేసు కుంటున్న దేశాల్లో విదేశీ కరెన్సీ లేనిపక్షంలో అటువంటి వాటికి స్థానిక కరెన్సీలోనే ఒప్పందాలు జరిపేందుకు భారత్ సిద్ధం అవుతోందని, స్థానిక కరెన్సీల్లో ఒప్పందాలవల్ల వాణిజ్యం మరింత మెరుగవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తంచేసారు. బహుళజాతి ఆర్థికసంస్థలు ఈ సమస్యపై స్పందిం చేందుకు సుదీర్ఘకాలం నుంచి పరిశీలిస్తున్నాయని మూడునుంచి నాలుగేళ్లుగా ఈ వ్యవస్థ దిద్దు బాటుకు భారత్ కృషిచేస్తున్నా, బహుపాక్షిక వ్యవస్థలో కొంత జాప్యం జరుగుతున్నదన్నారు. ఆగ్నేయాసియా దేశాల పరంగా భారత్‌కు ప్రతి బంధకం అవుతున్నా ఈవ్యవస్థ ఆసియాన్ దేశా లకు సానుకూలం అయితే భారత్‌కు సంతోష మేనన్నారు. ఆసియా పసిఫిక్‌ప్రాంతంలోని 16 దేశాలతో ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగ స్వామ్య ఒప్పందాలు కొనసాగిస్తోందని అయితే ఈ డీల్ భారత్‌కు ఎలాంటి ఆఫర్లు లేవన్నారు. నిజానికి భారత్ 2019లోనే ఈ ఆర్సీఈపీ నుంచి వెలుపలకువచ్చింది. దేశీయ పరిశ్ర మలకు, వ్యవసాయరంగానికి కీడు జరుగుతుందని భావించింది.ప్రత్యేకించి చైనానుంచి ఎదురయ్యే సమస్యలు పరిశీలించిన భారత్ వాణిజ్యలోటు కూడా పెరిగే ముప్పును గమనించి ఈ ఒప్పందం విత్‌డ్రా చేసుకుంది.

## పిఎన్బీ నికరలాభం రూ.5532 కోట్లు




**ముంబయి, అక్టోబరు 16:** ప్రభుత్వరంగంలోని పంజాబ్‌నేషనల్‌బ్యాంకు రెండోత్రైమాసిక నికర లాభం 13శాతం పెరిగి రూ.5532కోట్లకు చేరింది. దేశంలో రెండో అతిపెద్ద బ్యాంక్‌గా ఉన్న పంజాబ్‌నేషనల్ బ్యాంకు గత ఏడాది ఇదే కాలంలో రూ.4904 కోట్లు ఆర్జించింది. బ్యాంకు మొత్తం ఆదాయవనరులు కూడా రూ.38,185 కోట్లకుపెరిగాయి. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ.36,214కోట్లుగా ఉంది. ఇక వడ్డీ ఆదాయం కూడా రూ.34,585కోట్లకు పెరిగింది. అదే గత ఏడాది సెప్టెంబరు త్రైమాసికంలో 31,872కోట్లు మాత్రమే ఉంది. నిర్వహణ లాభం కూడా రూ.7227 కోట్లనుంచి 7532 కోట్లకు పెరిగినట్లు బ్యాంకు స్టాక్ ఎక్స్ఛేంజిలకు నివేదిక ఇచ్చింది. ఇక బ్యాంకు స్థిరాస్తిప్రమాణాలపరంగా స్థూల నిరర్థక ఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 2.55శాతంగా ఉన్నాయి. అదే గత ఏడాది 3.45శాతంనుంచి గణనీయంగా తగ్గించుకోగలిగింది. అదే సమయంలో నికర నిరర్థక ఆస్తులు లేదా రానిబాకీలు మొత్తం అడ్వాన్సుల్లో 0.25శాతంగా ఉన్నాయి. అదే గత ఏడాది సెప్టెంబరు త్రైమాసికంలో 0.36శాతంగా ఉన్న ఎన్పీయేలు గణనీయంగా తగ్గుతున్నట్లు వెల్లడించింది. ఇక కేటాయింపుల కవరేజి నిష్పత్తి కూడా 97.32 శాతంగా ఉంది. గత ఏడాది సెప్టెంబరు త్రైమాసికంలో ఉన్న 96.91శాతం కంటే స్వల్పంగా పెరిగింది. క్యాపిటల్ రిస్క్ వెయిటెడ్ అసెట్స్ రేషియో క్రార్ కూడా 17.19శాతం నుంచి 17.95శాతంకు పెరిగింది.

## గోల్డ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్‌లో కొత్త పెట్టుబడులు నిలిపివేత



**ముంబయి, అక్టోబరు 16:** మ్యూచువల్‌ఫండ్స్ రంగంలో పసిడి ఫండ్‌ఆఫ్‌ఫండ్స్‌లోకి కొత్తపెట్టుబడులను నిలిపివేసాయి. ఫండ్ ప్రతినిధులు ఇదే విషయమై మాట్లాడుతూ సెబీ విధించిన ఆంక్షలు, మార్గదర్శకాలకారణంగా ఫండ్‌ఆఫ్ ఫండ్స్‌లోకి పెట్టుబడులు నిలిపివేసినట్లు చెపుతున్నారు. భారత్‌రూపాయిపై కరెంటుఖాతా లోటు మరింత ఒత్తిడిపెంచుతుండటంతో ఫండ్స్‌రంగ నిపుణులు ఈ నిర్ణయం వెల్లడిం చారు. విలువల రంగా భారత్‌లో బంగారం భారీ దిగుమతుల విలువలు భారీగా ఉంటాయి. ముం దురోజే ఫండ్‌సంస్థలు నోటీసులు జారీచేసాయి. గంపగుత్త పెట్టుబడులు, సిప్, ఎస్టీపీ, స్విచ్ రిజిస్ట్రేషన్లు వంటివి శుక్రవారం నుంచి నిలిపి వేస్తున్నట్లు వెల్లడించాయి. ప్రస్తుత సిప్, ఎస్టీపీ, స్విచ్‌లావాదేవీలు మాత్రం కొన సాగుతాయి. కొన్ని ఫండ్‌సంస్థల ఇదేవిధమైన ఆంక్షలను వెండి ఫండ్‌ఆఫ్ ఫండ్స్ పైనా విడుదల చేసాయి. ఇక పసిడి ఎక్ఛేంజి ట్రేడెడ్ ఫండ్స్ సిల్వర్ ఈటీఎఫ్‌లు పెట్టుబడులకు సా నుకూలంగా ఉన్నా యి. అయితే ఫండ్ ఆఫ్ ఫండ్స్ పై విధించిన ఆంక్షలు మొత్తంగా వెండి, బం గారం ట్రేడింగ్‌పై కొంత ఒత్తిడిని పెంచు తాయని చెప్పవచ్చు. రూపాయి భారీ ఎత్తున క్షీణించడం, ప్రస్తుత ఆర్థిక,మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఈ ఆంక్షలు అమలుచేయక తప్పదని వివరించారు.రూపాయి భారీ క్షీణత వల్లనే బంగారంపై పెట్టు బడులు తగ్గించాలని ప్రధాని మోడీ సైతంకుటుంబ వాసులకు సూచించారు. రానున్న నెలల్లో మరిన్ని ఫండ్‌సంస్థలు ఈ ఆంక్షలు కొంతమేర సడలించవచ్చున్న అంచనాలు ఉన్నాయి.

## పెట్రోలు ఎగుమతులపై విడ్‌ఫాల్ ట్యాక్స్ పెంచిన కేంద్రం



**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** కేంద్రం పెట్రోలు ఎగుమతులపై ఒక్కసారి విధించే సుంకం విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను పెంచింది. అదే డీజిల్‌పై మాత్రం ఎలాంటి మార్పులుచేయలేదు. పెట్రో ఎగుమతులపై ఈ సుంకం లీటరుకు 2.5రూపాయలుగా ఉంది. ఇప్పటి వరకూ లీటరుకు 0.5 రూపాయలు మాత్రమే ఉన్న ఈ ఎగుమతి సుంకాన్ని హటాత్తుగా పెంచింది. ఇక డీజిల్ ఎగుమతులపై ఇప్పటివరకూ 16 రూపాయలున్న సుంకాన్ని 8.5 రూపాయలకు తగ్గించింది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్‌పైనా 10.5శాతం పెంచుతున్నట్లు ప్రకటించింది. తొలిసారిగా 2022 జులైలో ఈ ఇంధన ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను కేంద్రం ప్రవేశపెట్టింది. అమెరికా ఇజ్రాయెల్ ఇరాన్‌లమధ్య తీవ్రస్థాయిలో జరుగుతున్న యుద్ధం సమయంలో పెరుగుతున్న ఇంధన ధరల భారం అధిగమించేందుకు ఈ నిర్ణయం అమలుచేసింది. ప్రస్తుతం ప్రతి పక్షానికి ఒక పర్యాయం ఈ ఎగుమతి పన్నులను సమీక్షిస్తున్నారు. అంతర్జాతీయంగా పెట్రోలియం ఉత్పత్తులు, ముడి చమురు ధరలకు బేరీజువేసి ఈ పన్నులు నిర్ణయిస్తారు. హార్ముజ్ నుంచి రాకపోకలు నిలిచిపోయిన తర్వాత ఇంధన ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లుగా కూడా కొనసాగాయి. శుక్రవారం రోజున బ్యారెల్ 105 డాలర్లుగా నడిచింది. ఇక గ్లోబల్ బెంచ్‌మార్క్ ఆల్‌టైమ్ గరిష్టానికి అంటే బ్యారెల్‌కు 126 డాలర్లకు చేరింది. ఇప్పటికీ యుద్ధ వాతావరణం కొనసాగుతుండటంతో రానున్న రోజుల్లో బ్యారెల్ 200 డాలర్లకు చేరే ప్రమాదం లేకపోలేదు. ఈ పరిస్థితులన్నింటినీ బేరీజువేసిన కేంద్రం పెట్రో ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను సవరించే నిర్ణయం ప్రకటించింది.

## విజయవాడ కనక దుర్గ నేటి అలంకరణ

# శ్రీ మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మ



"లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం శ్రీరంగ ధామేశ్వరీం
దాసీభూత సమస్తదేవ వనితాం లోకైక దీపాంకురాం
శ్రీమన్మంద కటాక్ష లబ్ద విభవద్బ్రహ్మేంద్ర గంగాధరాం త్వాం
త్రైలోక్య కుటుంబినీం సరసిజాం వందే ముకుంద ప్రియాం"

శ్రీ మహాలక్ష్మీ దేవి సర్వమంగళకారిణి. ఐశ్వర్యప్రదాయిని. అష్టలక్ష్ముల సమిష్టి రూపమే మహాలక్ష్మి. ఈ తల్లి క్షీరాబ్ధి పుత్రిక, చంద్రుని సహోదరి, శ్రీహరి పట్టపురాణి, డోలాసురుడనే రాక్షసుడ్ని సంహరించిన దేవత. శక్తిత్రయంలో ఈమె మధ్య శక్తి. ఈ దేవిని ఉపాసిస్తే ఫలితాలు శీఘ్రంగా కలుగుతాయని పురాణాలు చెపుతున్నాయి. 'యాదేవీ సర్వభూతేషు లక్ష్మీరూపేణ స ంస్థితా' అంటే అన్ని జీవులలోను ఉండే లక్ష్మీ స్వరూపమే దుర్గాదేవి అని చండీసప్తశతి చెబుతోంది. కాబట్టి శరన్నవరాత్రులలో మహాలక్ష్మీదేవిని పూజిస్తే సర్వమంగళ మాంగల్యాలు కలుగుతాయి.

**అలంకార వస్త్రము :** గులాబి రంగు చీర

**పుష్పములు :** ఎరుపు రంగు పూలు

**నివేదన:** పూర్ణాలు, తామర పేలాల పాయసం, శొంఠి అన్నం

**మంత్రం:** "ఓం శ్రీం హ్రీం క్లీం మహాలక్ష్మీ స్వాహా" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి.

- భట్టిప్రోలు నటరాజకుమార్

**చిట్కా:** ✦ ఇంటిపని, వంటపని చేస్తున్నప్పుడు మెత్తని స్పాంజితో తయారుచేసిన చెప్పులనే వాడాలి. ✦ చెప్పులు షూలు పెట్టుకునేందుకు స్టాండ్స్ వాడాలి. ✦ పొడి చర్మం గలవారు వారానికి ఒకసారి గోరువెచ్చటి నూనెలో పాదాలు కాసేపు వుంచాలి. □

## నేడు వెన్న ముద్దల బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో 8వ రోజైన వెన్నముద్దల బతుకమ్మ అని పిలుస్తారు. తంగేడు, గునుగు తదితర పూలను ఎనిమిది ఎత్తుల్లో పేర్చి గౌరమ్మను వాటిపై పెడతారు.

**ఈ రోజు నైవేద్యం :** నువ్వులు, వెన్నను పెడతారు. □

## ఫ్యాషన్ ఫ్యాషన్

## అగరబత్తి అనుభూతి



ఆస్వాదించే మనసు ఉండాలే కానీ, చుట్టూ పెరిగే ఎన్నో ప్రక్రియలు మనలో అంతులేని ఆనందాన్ని నింపుతాయి. అంతెందుకు.. పడుగలు, శుభకార్యాల వేళ దీపంతో పాటు అగరబత్తులనూ వెలిగించడం మన సంప్రదాయం కదా! చాలాసార్లు వెలిగించామా.. పూజ గది నుంచి బయటకు వచ్చేశామా అనుకుంటాం కానీ,ఆ ధూపాన్ని నిశితంగా గమనిస్తే ఉండే అనుభూతే వేరు. నిశ్శబ్దంగా ఉన్న గదిలో వెలిగించాక వచ్చే ఆ మొట్టమొదటి సువాసన మనసుకు ఎంతో హాయినిస్తుంది. ఆ పొగ గాల్లో రింగు రింగులుగా అటూ ఇటూ తేలిపోతూ నృత్యం చేస్తున్నట్లుగా అని పిస్తుంది. ఎర్రగా వెలిగే దాని అంచు ఓ చిన్నసైజు నక్షత్రాన్ని తలపిస్తుంది. అగరుబత్తిని అలా చూస్తూ, సువాసనపీలుస్తుంటే మనసులో అనవసరపు ఆలోచనలు, గందరగోళం లాంటి దూరమవడంతోపాటు గతం తాలూకు జ్ఞాపకాలనూ పోగేస్తుంది. ఏదో తెలియని భక్తి భావాన్నీ అంది స్తుంది. అంతేనా, అర్థం చేసుకోవాలే కానీ, అందులో ఓ నీతిపాఠమూ ఉంది. అగరుబత్తీ కడ్డీ తనని తానే కాల్చేసుకుంటూ, సువాసనలను వెదజల్లుతూ చివరకు బూడిదను విడిచిపెడుతుంది. దీన్నిబట్టి శారీరక అందం శాశ్వతం కాదనీ, దాన్నుంచి వచ్చే సువాసన అంటే గుణం, విలువలు మాత్రమే శాశ్వతంగా నిలిచి పోతాయనే పరమార్థమూ మనకు చెప్పకనే చెబుతున్నట్లు అనిపిస్తుంటుంది. □

# దాండియా ఆడదాం !











దేశవ్యాప్తంగా నవరాత్రి సందడి మొదలైంది. ఓవైపు భక్తి భావన.. మరోవైపు నృత్యాలతో కోలాహలం. చిన్నాపెద్దా ఓ చోట చేరి నవరాత్రులన్నీ సందడిగా గడిచిపోతాయి. నవరాత్రి అనగానే గుర్తొచ్చేది దాండియా కూడా! ఈ గుజరాతీ జానపద నృత్యం మనకీ కొత్తేమీ కాదు. స్నేహితులతో సరదాగా అలా ఆడిపాడడానికి ఉత్సాహం చూపేవారూ ఎందరో! అయితే దాండియా అంటే సంగీతానికి తగ్గట్టుగా పాదం కదిపేయడమే కాదు. ఆహార్యమూ నృత్యం చేస్తున్నట్లే ఉంటుంది. అలలుగా కదిలే గాగ్రా.. ఆ సందడికి సవ్వడి చేసే గవ్వలూ, మువ్వలూ.. వెలుగులకు తళుక్కుమనే అద్దాలూ! ఇక పెద్ద జుంకీలు, పట్టీలు, నెక్లెస్‌లు, గాజులను జతచేస్తే పెరిగే అందమే వేరు. కానీ తొలి ప్రాధాన్యం మాత్రం రంగురంగులతో మెరిసిపోయే వస్త్రాలదే ! దాండియా నృత్యంలో మనది అందె వేసిన చేయి కాకపోయినా.. ఆ వస్త్రధారణలో నలుగురితో అలా అలా ఆడిపాడినా వచ్చే సంతృప్తే వేరు. మీరూ ఆ ఆనందాన్ని ఆస్వాదించాలనుకుంటే ఈ గాగ్రా లేదా చనియా చోలీలను చూసేయండి. కోట్‌తో, అటాచ్‌డ్ చున్నీతో వేగంగా సిద్ధమవడంలో సాయం చేయడమే కాదు.. సౌకర్యవంతంగానూ అనిపిస్తాయి. మనమూ వీటిని ప్రయత్నించి మురిసిపోదామా? సరదాగా చేద్దామా.. □

## మైక్రో ఫైబర్ జాగ్రత్తగా !



తడిని ఇట్టే పీల్చేసుకుంటుంది... జిడ్డుని వదలగొడుతుంది. సులువుగా శుభ్రం చేయొచ్చు... వంటి కారణాలతో మైక్రో ఫైబర్ క్లాత్ వినియోగం పెరుగుతుంది. పైగా ఎక్కువ కాలం మన్నుతాయి. రీయూజ్ చేసుకోవచ్చు కూడా... అందుకే, వీటిని వాడటానికి మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. చిన్న, సన్నటి ఫైబర్ వీటిని తయారు చేస్తారు. కిటికీలు, అద్దాలు, గాజులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వంటగది, చెక్కఫర్నిచర్... వంటివాటికోసం ఈ మైక్రోఫైబర్ క్లీనింగ్ క్లాత్‌లను వినియోగించుకోవచ్చు. ఇవి గీతలు పడకుండా చేయడమే కాదు, దుమ్ము, ధూళితో పాటు గ్రీజు మరకల్నీ త్వరగా వదిలివేస్తాయి. తడి, పొడి... రకాలుగా దీన్ని ఉపయోగించొచ్చు. అయితే, ఆ తర్వాత వాటిని సరిగా ఉతకకపోతే మాత్రం వృద్ధి చెందే అవకాశం ఉంది. అందుకే, పని అయ్యాక ప్రతిసారీ వేడి నీళ్లల్లో కాస్త వంటసోడా వేసి వాష్ చేయండి. అయితే, వేరే వస్త్రాలతో వీటిని కలపొద్దు. అలానే కఠిన రసాయనాలతో కాకుండా సహజ క్లీనర్లతో శుభ్రం చేయడం వల్ల ఐక్రోప్లాస్టిక్‌ని విడుదల చేయకుండా అడ్డుకోవచ్చు. .□

# సరైన ఆహారం ఆరోగ్యకరమైన జీవితం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

శరీరంలోని ముఖ్యమైన అవయవాల్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి కావలసిన ఆహారాల వల్ల ఆరోగ్యం ఏ విధంగా పెంపొందించుకోవచ్చు తెలుసుకుందాం.

**గుండె:** ఒమేగా-3 క్రొవ్వు ఆమ్లాలుండే సాల్మన్ వంటి చేపలు, వాల్‌నట్స్, బాదం, ఓట్స్, ఆకుకూరలు గుండె ఆరోగ్యానికి చాలా మంచివి.

**మెదడు:** మెదడు చురుకుదనానికి, జ్ఞాపకశక్తికి ఒమేగా-3 సమృద్ధిగా ఉండే బ్లూ బెర్రీస్, వాల్‌నట్స్, కోకోనట్ ఆయిల్ ఉపయోగపడుతుంది.

**కాలేయం:** లివర్ పనితీరుని మెరుగుపర్చడానికి క్రొవ్వు చేరకుండా కాపాడడానికి అవకాడ, ఆలివ్ ఆయిల్, వాడాల్సి ఉంటుంది. మూత్ర పిండాలు (కిడ్నీలు): కిడ్నీల పనితీరుని మెరుగుపర్చి వ్యర్థాల్ని బైటికి పంపడానికి కిడ్నీల శుభ్రతకు బాదం, వాల్‌నట్స్, గింజలు, తృణధాన్యాలు, నీరు ఎక్కువగా తీసుకోవాల్సి ఉంటుంది.

**ఊపిరి తిత్తులు :** ఆపిల్స్, గ్రీన్ టీ అరటిపండ్లు అల్లం ఆంటీ ఆక్సిడెంట్స్ గల ఆహారాలు శ్వాసకోశ వ్యవస్థను శుభ్రపర్చి ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుతాయి.



**జీర్ణాశయం పొట్ట:** జీర్ణక్రియని మెరుగుపర్చి పొట్టలో మంట, గ్యాస్ సమస్యల్ని తగ్గించాడానికి అల్లం, పెరుగన్నం తీసుకోవాల్సి ఉంటుంది.

**థైరాయిడ్:** థైరాయిడ్ హార్మోన్ల సమతుల్యతకు అయోడిన్ ఉప్పు, చేపలు ఉపయోగపడతాయి.

**పిత్తాశయం:** పైత్యారసం సరిగ్గా ప్రవహించేలా చేసి పిత్తాశయంలో రళ్ళు ఏర్పడకుండా ఉండడానికి నిమ్మకాయలు ఆలివ్ ఆయిల్ తీసుకోవాల్సి ఉంటుంది.

**నాడీ వ్యవస్థ :** విటమిన్ బి6, పొటాషియం మెగ్నీషియం ఉండి నరాల కణాల మధ్య సమాచార రవాణాని వేగవంతం చేయడానికి అరటిపండ్లు, పిస్తా పప్పు వాడాలి.

**పాంక్రియాజ్ :** ఇన్సులిన్ స్రావాన్ని క్రమబద్దీకరించి రక్తంలో చక్కెరస్థాయిల్ని అదుపులో ఉంచడంలో చిలగడ దుంపలు సహాయపడతాయి.

**కళ్ళు :** విటమిన్ ఎ, ల్యూటిన్ సమృద్ధిగా ఉండి కంటి చూపుని మెరుగుపర్చడానికి క్యారెట్స్, బొప్పాలి, బీట్‌రూట్ వాడాల్సి ఉంటుంది.

**ఎముకలు :** ఎముకల్ని దృఢంగా ఉంటే కాల్షియం, విటమిన్ డి కోసం పాలు, పెరుగు, ఆకుకూరలు తీసుకోవాల్సి ఉంటుంది.

**చర్మం :** చర్మాన్ని కాంతివంతంగా, తేమగా ఉంచడానికి అవకాడో కొబ్బరి నీళ్ళు, ఉసిరి, ఆరెంజ్, నిమ్మ, తీసుకోవాల్సి ఉంటుంది.

**కండరాలు :** కండరాల బలానికి ప్రోటీన్స్ సమృద్ధిగా ఉండే గ్రుడ్లు, చికెన్ పప్పుధాన్యాలు తీసుకోవాల్సి ఉంటుంది.

కీళ్ళు కీళ్ళనొప్పులు, వాపులకి నువ్వులు, పసుపు ఎక్కువగా గర్భాశయమ బలానికి అవకాడో, దానిమ్మ వాడాల్సి ఉంటుంది.

**కీళ్ళు :** కీళ్ళనొప్పులు, వాపులకి నువ్వులు, పసుపు ఎక్కువగా వాడాల్సి ఉంటుంది. గర్భాశయ బలానికి అవకాడో, దానిమ్మ వాడాల్సి ఉంటుంది. రక్తం పట్టడానికి బీట్‌రూట్, దానిమ్మ వాడాల్సి ఉంటుంది. ముక్కు, సైనస్‌ల ఆరోగ్యానికి పైనాపిల్, మిరియాలు వాడాలి. కేశ సౌందర్యానికి పాలకూర, బాదం, ఖర్జూరం, ఉసిరి వాడాల్సి ఉంటుంది. పునరుత్పత్తి అవయవాల ఆరోగ్యానికి గుమ్మడి గింజలు, టమోటాలు, మిల్లెట్స్ వాడాల్సి ఉంటుంది. పళ్లు, చిగుళ్ళ ఆరోగ్యానికి ఆపిల్స్, క్యారెట్స్, జామ, నిమ్మ బొప్పాయి వాడాల్సి ఉంటుంది. □✸

# అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారిన పిఎం

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహా ఆరోపణ





సమావేశంలో మాట్లాడుతున్న ఇ.టి.నర్సింహా

**సైఫాబాద్, అక్టోబరు 16 ప్రభాతవార్త:** గత 12 ఏళ్ళ బిజెపి పాలనలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వానికి సరైన విదేశాంగ విధానం లేకపోవడం వల్లనే అమెరికా చెప్పిన ప్రతి మాటను జవదాటకుండా కీలుబొమ్మగా మారారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ్మా ఆరోపించారు. రష్యాతో అనేక సంవత్సరాలు తక్కువ ధరకు అయిల్ కొనుగోలు చేస్తూ భారత్ వాణిజ్య సంబంధాలు కలిగియున్నదని, ట్రంప్ సర్కార్ రష్యాతో ఏరకమైన వాణిజ్య ఒప్పందాలు చేసు కోకూడదని ఆదే శాలిస్తే దాన్ని పాటించిన వ్యక్తి నరేంద్ర మోదీ అని ఆయన ఆరోపించారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సత్య నారాయణరెడ్డి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకిస్తాన్‌కు సంబంధించిన ఉగ్రవాదులు మన దేశపౌరులను దారుణంగా హింసించి చంపిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆపెరేషన్ సిందూర్‌ను నేనే ఆపానని ట్రంప్ విలేకరులకు పేర్కొనడం జరిగిందని, కాని మోదీ ట్రంప్ వ్యాఖ్యలను ఖండించకపోగా మౌనంగా అసమర్థ ప్రధానిగా నిలిచారని ఆయన ఆరోపించారు. అమెరికా ఏజెంట్‌గా ఉంటూ పెయిడ్ ఆర్టిస్ట్‌గా ఉన్న మేరి మెల్ బెన్ మోదీకి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి సిజెపికి విదేశీ ఫండ్స్ వస్తున్నాయని మాట్లాడించడం సిగ్గుచేటని విమర్శించారు. ఇందుకు దేశంలో ఉన్న ప్రభుత్వ సంబంధిత సంస్థలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన గళం వినిపిస్తున్న ఉద్యమ సంస్థలపైన పోరాడే శక్తులపైన అబద్ధాలను, దుష్ప్రచారం చేయడం బిజెపి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు.

# ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపిలు ఈటల, ఆర్.కృష్ణయ్య

## భారీ ధర్నా నిర్వహించిన ఉద్యోగులు





ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య

**ధర్నాచౌక్, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే పర్మినెంట్ చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, ఎంపీ ఈటెల రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ, తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటం సరికాదన్నారు. తక్షణమే ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న 17వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిభారం తగ్గించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు అమలవుతున్న అన్ని సంక్షేమ పథకాలు వారికి వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించినందువల్ల ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థిక భారం పడదని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలతోనే దేశప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని గుర్తుచేశారు. అనేక రాష్ట్రాలలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పర్మినెంట్ చేసినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం మాత్రం వారిపై నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు చెల్లించే వేతనాలలో 60శాతం కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ అన్నివర్గాల ప్రజలకు హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చాక అమలుచేయలేదన్నారు.

## గన్‌తో కాల్చుకుని ఒకరి ఆత్మహత్య

**చార్మినార్,అక్టోబరు 16 ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనే యులు కథనం ప్రకారం.... దూద్‌బౌలి ప్రాం తానికి చెందిన అలీముద్దీన్ (45)కు భార్య,ఐదు మంది పిల్లలు ఉన్నారు. అలీ ముద్దీన్ గత కొంత కాలం నుంచి ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక అలీముద్దీన్ శుక్రవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఇంట్లో గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అలీ ముద్దీన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురికి తరలించారు. ఈ కేసును హుస్సేనీఆలం పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## రష్యా సైన్యంలో తెలంగాణ వాసులు సురక్షితమేనా?

### వివరాలు తెలపాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌ను ప్రశ్నించిన ప్రజావాణి ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి

**హైదరాబాద్ అక్టోబర్ 16 ( ప్రభాతవార్త ) :** ఉపాధి ఆశతో వెళ్లి రష్యా సైన్యంలో చిక్కుకున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన నలుగురు తెలంగాణ వాసులు సురక్షి తంగా ఉన్నారో లేదో ఆరా తీసి, పూర్తి వివరాలు అందజేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్యను సీఎం ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి ్మ ఆదేశించారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో నిర్వహించిన 262వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల కుటుంబ సభ్యులు గద్వాల్ విజయలక్ష్మి ్మని కలిసి తమ వారి ఆచూకీ కనుగొని రక్షి ంచాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన భూక్య రవీందర్, సిద్దుల అశోక్, ప్రకాష్, మహమ్మద్ అబ్జర్ ఖాన్‌లకు రష్యాలోని ఆయిల్ కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి ఏజెంట్లు అక్కడికి తీసుకెళ్లారు. ఆ తర్వాత మాయమాటలు చెప్పి బలవంతంగా రష్యా సైన్యంలో చేర్పించడంతో తమ వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని బాధితుల కుటుంబాలు ప్రజావాణిలో ఆవేదన వ్యక్తం చేశాయి. కాగా, ఈ బాధితులను మోసపూరితంగా రష్యాకు తరలించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రధాన ఏజెంట్ గౌరవ్‌ను నిజామాబాద్ జిల్లా పోలీసులు ఇటీవలే అరెస్ట్ చేసి, స్థానిక ఖిల్లా జైలుకు తరలించిన విషయం సభ దృష్టికి వచ్చింది. వెంటనే స్పందించిన గద్వాల్ విజయలక్ష్మి ్మ నిజామాబాద్ సీపీ సాయి చైతన్యతో ఫోన్లో మాట్లాడారు. రష్యా సైన్యంలో ఉన్న ఆ నలుగురు వ్యక్తుల భద్రతపై ఆరా తీసి తక్షణ సమాచారం అందించాలని, ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వ పరంగా తీసుకోవాలన్నారు.

# కాంగ్రెస్, వామపక్ష నేతల కీలక భేటీ

## సిపిఎం రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిన పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి వేం నరేందర్ రెడ్డి

### పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని సిపిఎం నేతలను కోరిన అధికార పార్టీ ప్రతినిధులు



సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో కాంగ్రెస్, వామపక్ష నేతల కీలక భేటీలో పాల్గొన్న పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం, ఎంపి వేంనరేందర్‌రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**ఇచిక్కడపల్లి అక్టోబర్ 16 ( ప్రభాతవార్త ) :** రాష్ట్రంలో రానున్న పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. ఈ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో ఉన్న సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో ఇరు పార్టీల కీలక నేతలు సమావేశమయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ప్రకటించాలని కోరుతూ కాంగ్రెస్ ముఖ్య నేతలు నేరుగా సీపీఎం కార్యాలయానికి వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఓటర్ల మద్దతు కూడగట్టే అంశంపై ఇరు పార్టీల అగ్రనేతలు కూలంకషంగా చర్చిస్తున్నారు. గత కొంతకాలంగా రాష్ట్ర రాజకీయాల్లో మారుతున్న పరిణామాలు, ప్రభుత్వ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా వామపక్ష పార్టీల మద్దతును కూడగట్టడం ద్వారా ఎన్నికల్లో సులభంగా విజయం సాధించవచ్చనే యోచనలో కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తోంది. సీపీఎం సానుకూలంగా స్పందించి అధికారికంగా మద్దతు ప్రకటిస్తే, అది ఎన్నికల్లో తమ అభ్యర్థి విజయానికి మరింత ఊతమిస్తుందని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మరోవైపు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆతిథ్యమివ్వగా.. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ నేతలు సాగర్, జ్యోతి, పోతినేని సుదర్శన్, బండారు రవికుమార్ తదితరులు ఈ భేటీలో పాల్గొని కాంగ్రెస్ నేతలతో చర్చలు జరుపుతున్నారు. ఇరు పార్టీల మధ్య జరుగుతున్న ఈ చర్చలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ సమావేశం వివరాలు తెలియాల్సి ఉంది.

# నకిలీ యుఎల్‌సి పత్రాలతో ఆస్తుల రిజిస్ట్రేషన్లు

## ముగ్గురు అరెస్ట్ - రూ.6 లక్షలు తీసుకుని నకిలీ క్లియరెన్స్ లేఖల తయారీ

**జీడిమెట్ల: అక్టోబర్ 16, ప్రభాతవార్త** నకిలీ అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) క్లియరెన్స్ లేఖలను తయారు చేసి, వాటి ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయించిన కేసులో ముగ్గురు నిందితులను సూరారం పోలీసులు అరెస్టు చేశారు. కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నకిలీ ప్రభుత్వ పత్రాలను సమర్పించి రెండు ఆస్తుల విక్రయ దస్తావేజులను రిజిస్ట్రేషన్ చేయించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో నకిలీ పత్రాల తయారీ, వాటిని సమకూర్చడం, ఆస్తి యజమానులతో లావాదేవీలను సమన్వయం చేయడం వంటి పాత్రలు ఉన్నట్లు నిందితులపై ఆరోపణలు ఉన్నాయి. పోలీసుల వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన జూనియర్ సబ్‌రిజిస్ట్రార్-1 పి. మధుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2026 ఆగస్టు 24న సూరారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జీడిమెట్ల గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 192, 193లో ఉన్న ప్లాట్లకు సంబంధించి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, అర్బన్ ల్యాండ్ సీలింగ్ అధికారి జారీ చేసినట్లుగా రెండు క్లియరెన్స్ లేఖలను సమర్పించారు. అయితే వాటి ప్రామాణికతను పరిశీలించగా, సంబంధిత ప్రభుత్వ అధికారులు జారీ చేసిన అసలైన పత్రాలు కావని గుర్తించారు. లేఖల ఆధారంగా 2026 జూన్ 4న రెండు విక్రయ దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తేలింది. యూఎల్‌సీ క్లియరెన్స్ పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆస్తి యజ మానులకు లేఖలు ఇప్పిస్తామని నమ్మించి, నకిలీ పత్రాలను తయారు చేసి అందించినట్లు దర్యాప్తులో ఆరోపణలు వచ్చాయి. జీడిమెట్ల గ్రామంలోని ప్లాట్లకు సంబంధించి 2026 ఏప్రిల్ 22 తేదీతో ఉన్నట్లుగా చూపించిన రెండు నకిలీ క్లియరెన్స్ లేఖలను రూ.6 లక్షలు తీసుకుని తయారు చేసినట్లు పేర్కొన్నారు. వీటి ఆధారంగా సంబంధిత ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గుర్తించారు. ఈ కేసులో సుభాష్‌నగర్ కాలనీ, ఐడీఏ జీడిమెట్లకు చెందిన జాదవ్ సుధాకర్ (39), హెచ్‌ఏఎల్ కాలనీకి చెందిన నారాయణదాసు శివాచారి అలియాస్ శివ (57), సుచిత్ర దుర్గా ఎస్టేట్‌కు చెందిన చిట్టిమిల్ల బాలరాం (64)లను అరెస్టు చేశారు.

# జిఎంఆర్ ఏరో టెక్నిక్-లాజిక్ ఎయిర్ మధ్య ఒప్పందం

## - విమానాల మార్పులు, ఇంజినీరింగ్ సేవల బలోపేతానికి భాగస్వామ్యం





ఒప్పందం కుదుర్చుకుంటున్న ఇరువురు ప్రతినిధులు

**శంషాబాద్ అక్టోబరు16,ప్రభాతవార్త :** విమానాల నిర్వహణ, మరమ్మతులు, సాంకేతిక సేవలను మరింత బలోపేతం చేసేందుకు జీఎంఆర్ ఏరో టెక్నిక్, కెనడాకు చెందిన కార్పొరేషన్ లాజిక్ ఎయిర్ ఇంక్.తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంతో భారతదేశంతో పాటు మధ్యప్రాచ్యం, ఆసియా-పసిఫిక్ ప్రాంతాల్లో విమానయాన సంస్థలకు సమగ్ర విమాన మార్పులు, ఇంజినీరింగ్, ధ్రువీకరణ సేవలు అందించనున్నాయి. బోయింగ్ 737 ఎన్‌జీ, ఏటీఆర్, డాష్ 8 విమానాల్లో సాంకేతిక ఆధునికీకరణలు, క్యాబిన్ విద్యుత్ వ్యవస్థలు, నిర్మాణపరమైన మార్పులు, సరుకు రవాణా విమానాలుగా మార్పిడి, కాలం చెల్లిన పరికరాలకు ప్రత్యామ్నాయ పరిష్కారాలు ఈ భాగస్వామ్యంలో ప్రధానంగా ఉంటాయి. విమానాల నిర్వహణ, మరమ్మతుల సమయంలోనే అవసరమైన మార్పులను చేపట్టి, ఖర్చులను తగ్గించడంతో పాటు విమానాల పనితీరును మెరుగుపరచడంపై దృష్టి సారించనున్నాయి. శిక్షణ, నిరంతర నిర్వహణ, సాంకేతిక సహాయ సేవలను కూడా విస్తరించనున్నాయి. జీఎంఆర్ ఏరో టెక్నిక్ అధ్యక్షుడు, బాధ్య తాయుత నిర్వా హకుడు అశోక్ గోపీనాథ్ మాట్లా డుతూ, ఇరు సంస్థల నైపుణ్యాలను సమ న్వయం చేయడం ద్వారా వినియోగదారులకు మెరుగైన సమగ్ర పరిష్కారాలు అందించనున్నట్లు తెలిపారు. లాజిక్ ఎయిర్ ప్రతినిధి ప్రశాంత్ రాజన్న మాట్లాడుతూ, ఈ ఒప్పందం అంతర్జాతీయ మార్కెట్లలో సంస్థ విస్తరణకు కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యంతో విమానాల నిర్వహణ సామర్థ్యాలు పెరుగుతాయన్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.